




www.navabhoomi.in | epaper.navabhoomi.in | RNI No:TELTEL:82083

# నవభూమి

ANUKSHANAM

NAVABHOOMI TELUGU DAILY

నవతరం తెలుగు దినపత్రిక








Published from Hyderabad and Vijayawada

ఎడిటర్ : అజీద్

హైదరాబాద్ | 24 సోమవారం | మార్చి 2025 | పేజీలు 12 | వెల: రూ.6 | సంపుటి:2 సంచిక: 188

Navabhoomi daily fallows..

Circulated at: Hyderabad, Rangareddy, Adilabad, Karimnagar,Warangal,Khammam, Nalgonda, Mahabubnagar,Medak, Nizamabad, Krishna,Guntur,Easrt Godavari, West Godavari,Prakasam, Nellore,Srikakulam,Vizianagaram,Visakhapatanam,Kurnool,Chittoor,Kadapa,and Anantapur


## బాలయ్య, ప్రభాస్, గోపీచంద్‌లకు
# బెట్టింగ్ సెగ!



- బాలకృష్ణ ప్రభాస్ గోపీచంద్‌ల తలకూ చుట్టుకున్న బెట్టింగ్ కేసు
- నందమూరి బాలకృష్ణ అన్‌స్టాపబుల్ షోకు హాజరైన ప్రభాస్,గోపీచంద్
- ఫన్ 88 బెట్టింగ్ యాప్‌కు ఈ ముగ్గురు ప్రమోట్ చేశారని ఫిర్యాదు
- ఈ ఎపిసోడ్ చూసి బెట్టింగ్ యాప్‌లో 83లక్షలు పోగొట్టుకున్నట్లు ఫిర్యాదు

హైదరాబాద్-నవభూమిబ్యూరో

ప్రస్తుతం టాలీవుడ్ చుట్టూ బెట్టింగ్ యాప్‌ల ఇష్యూ నడుస్తోంది. సెలబ్రిటీలు బెట్టింగ్ యాప్‌లను ప్రమోట్ చేయడంపై ఇప్పటికే పలువురిపై కేసులు నమోదయ్యాయి.
ప్రస్తుతం టాలీవుడ్ చుట్టూ బెట్టింగ్ యాప్‌ల ఇష్యూ నడుస్తోంది. సెలబ్రిటీలు బెట్టింగ్ యాప్‌లను ప్రమోట్ చేయడంపై ఇప్పటికే పలువురిపై కేసులు నమోదయ్యాయి. తాజాగా ఈ ఇష్యూ నందమూరి బాలకృష్ణ ప్రభాస్ గోపీచంద్‌ల తలకూ చుట్టుకున్నట్లు తెలుస్తోంది. బాలకృష్ణ హోస్ట్‌గా ఆహా ఓటీటీలో స్ట్రీమ్ అవుతున్న అన్ స్టాపబుల్ షోలో ఓ బెట్టింగ్ యాప్‌ని ప్రమోట్ చేయడమే ఇందుకు కారణంగా తెలుస్తోంది. రామారావు అనే వ్యక్తి ఆన్‌లైన్ ద్వారా ఫిర్యాదు చేసినట్లు తెలుస్తోంది. ఫన్ 88 బెట్టింగ్ యాప్‌కి బాలకృష్ణ, ప్రభాస్, గోపీచంద్ ప్రమోట్ చేశారని, దీని వల్ల చాలామంది డబ్బులు నష్టపోయారని ఫిర్యాదులో పేర్కొన్నారు రామారావు. అన్ స్టాపబుల్ షోకి ప్రభాస్ గోపీచంద్‌లు గెస్ట్‌లుగా హాజయైన సంగతి తెలిసిందే! ఈ ఎపిసోడ్‌లో ఫన్ 88 అనే బెట్టింగ్ యాప్‌ని ప్రమోట్ చేశారు.

ఈ ఎపిసోడ్ చూసి బెట్టింగ్ యాప్ డౌన్లోడ్ చేసుకున్నాననీ,. ఫన్ 88 యాప్‌లో బెట్టింగ్ ఆడి 83 లక్షలు పోగొట్టుకున్నానని ఓ వ్యక్తి మీడియా ముందుకు వచ్చారు. ఈ క్రమంలో బాలకృష్ణ, ప్రభాస్, గోపీచంద్‌లపై కేసు నమోదైనట్లు సమాచారం.

# అమరావతికి మోదీ?



- 15-20 తేదీల మధ్య అమరావతికి ప్రధాని?
- పునర్నిర్మాణ పనులకు శ్రీకారం చుట్టడానికి మరోసారి రాక
- 250 ఎకరాల్లో భారీ బహిరంగ సభ
- వెలగపూడి సచివాలయం వెనుక ఎన్-9 రోడ్డు సమీపాన ఏర్పాటు
- రాజధానికి మోదీ వరాలిస్తారని రైతుల్లో ఆశలు

2

**అమరావతి-నవభూమిబ్యూరో:** నవ్యాంధ్ర రాజధాని అమరావతికి శంకుస్థాపన చేసిన ప్రధాని మోదీ.. పునర్నిర్మాణ పనులకు శ్రీకారం చుట్టడానికి మరోసారి రానున్నారు. సుమారు రూ.42 వేల కోట్ల విలువైన పలు అభివృద్ధి పనులకు శంకుస్థాపన చేసేందుకు రావాలని సీఎం చంద్రబాబు ఆయన్ను ఆహ్వానించారు. ఈ ఆహ్వానాన్ని ప్రధాని కార్యాలయం (పీఎంవో) వర్గాలు ఆమోదించినప్పటికీ.. నిర్దిష్టమైన తేదీని ఖరారు చేయలేదు. అయితే ఏప్రిల్ 15-20 తేదీల నడుమ ఏదో ఒక రోజు ఆయన వస్తారని రాష్ట్రప్రభుత్వం ఇప్పటికే వెల్లడించింది. అధికారిక షెడ్యూల్ విడుదల కానప్పటికీ భారీ బహిరంగ సభ ఏర్పాటుకు సన్నాహాలు మొదలుపెట్టింది. వెలగపూడిలోని సచివాలయ భవన సముదాయానికి వెనుకవైపు ఎన్-9 రోడ్డుకు పశ్చిమంగా ఉన్న ప్రాంతాన్ని సిద్ధం చేస్తున్నారు. ఇందుకోసం సదరు ప్రాంగణాన్ని ఆదివారం నుంచి చదును చేయడం మొదలుపెట్టారు.
సుమారు 16 పొక్లయిన్లు, 4 భారీ క్రేన్లు, 6 ట్రక్కులతో పనులు పెద్దఎత్తున మొదలుపెట్టారు. ఈ నెల 30వ తేదీన ఈ ప్రాంతంలోనే 30-40 ఎకరాల్లో ఉగాది ఉత్సవాలు నిర్వహించనున్నారు. ప్రధాని సభను కూడా ఇక్కడే ఏర్పాట్లు చేసే ఉద్దేశంతో విస్తీర్ణాన్ని 250 ఎకరాలకు పెంచి ఇప్పటి నుంచే సంబంధిత పనులు మొదలుపెట్టారు. ఇంకోవైపు.. తమకు మేలు చేకూర్చే విధంగా రాజధానిపై ప్రధాని మరిన్ని వరాలు ప్రకటిస్తారని రైతులు ఆశగా

## తెలంగాణ స్పీకర్‌కు సుప్రీం నోటీసులు

- ఎమ్మెల్యేల పార్టీ ఫిరాయింపుల కేసులో కీలక పరిణామం..
- కాంగ్రెస్‌లో చేరిన పదిమంది బీఆర్ఎస్ ఎమ్మెల్యేలు
- వారిపై అనర్హత వేటు వేయాలని స్పీకర్‌కు బీఆర్ఎస్ ఫిర్యాదు
- స్పీకర్ స్పందించడంలేదంటూ సుప్రీంకోర్టులో పిటిషన్

2



హైదరాబాద్-నవభూమిబ్యూరో

తెలంగాణ స్పీకర్ గడ్డం ప్రసాద్ కుమార్ కు సుప్రీంకోర్టు మరోసారి నోటీసులు జారీ చేసింది. ఎమ్మెల్యేల పార్టీ ఫిరాయింపుల కేసులో ఏం చర్యలు తీసుకున్నారో తెలపాలంటూ గతంలోనూ నోటీసులు ఇచ్చింది. ఇందుకు సుప్రీంకోర్టు గడువు కూడా విధించింది. 2023లో జరిగిన తెలంగాణ అసెంబ్లీ ఎన్నికల్లో బీఆర్ఎస్ పార్టీ నుంచి పోటీ చేసి గెలిచిన 10 మంది ఎమ్మెల్యేలు కాంగ్రెస్ లో చేరారు. ప్రజలు కారు గుర్తుపై గెలిపించాక పార్టీ మారడం వారి నమ్మకాన్ని వమ్ము చేయడమేనని బీఆర్ఎస్ విమర్శించింది.
దీనిపై బీఆర్ఎస్ పార్టీ సుప్రీంకోర్టును ఆశ్రయించింది. పార్టీ ఫిరాయించిన ఎమ్మెల్యేలపై అనర్హత వేటు వేయాలంటూ స్పీకర్ ను

# 50 వేలు

## పాలస్తీనా మృతుల సంఖ్య

- ఇజ్రాయిల్ జరిపిన వైమానిక దాడుల్లో 26 మంది పాలస్తీనియన్లు మృతి
- హమాస్ సీనియర్ రాజకీయ నేత సలా బర్దావిల్,ఆయన సతీమణి మృతి
- వైమానిక దాడుల్లో ఇప్పటి వరకు 50 వేల మంది మృతి
- బందీలను విడిచిపెట్టకపోతే దాడులు ఉధృతమన్న ఇజ్రాయిల్

టెల్ అవీవ్-నవభూమి ప్రతినిధి

ఇజ్రాయెల్ ఆదివారం జరిపిన తాజా వైమానిక దాడుల్లో 26 మంది పాలస్తీనియన్లు ప్రాణాలు కోల్పోయారు. మృతుల్లో హమాస్ సీనియర్ రాజకీయ నేత సలా బర్దావిల్, ఆయన భార్య కూడా ఉన్నారు. దీంతో మొత్తం మృతుల సంఖ్య 50 వేలకు చేరింది. హమాస్ బందీలుగా చేసుకున్న వారిని విడిచిపెట్టకపోతే దాడులు మరింత ఉధృతం చేస్తామని ఇజ్రాయెల్ హెచ్చరించింది. తాజాగా ఇజ్రాయెల్ యుద్ధ ట్యాంకులు రఫా పట్టణంలోకి దూసుకుపోయాయి.



# ఇక విడదల రజని వంతు!

- రజిని అరెస్టుకు రంగం సిద్ధం..వైసీపీలో మొదలైన టెన్షన్
- గవర్నర్ నుంచి అనుమతి తీసుకున్న తర్వాతే రజినిపై కేసు నమోదు
- శ్రీ లక్ష్మీబాలాజీ స్టోన్ క్రషర్ యజమానిని బెదిరించి
- రూ.2.20 కోట్లు వసూలు చేశారని రజినిపై కేసు
- ఈ వ్యవహారంపై విజిలెన్స్ విచారణకు ఆదేశించిన ప్రభుత్వం
- తాజాగా ఏసీబీ కేసు నమోదుకు గ్రీన్ సిగ్నల్

2



గుంటూరు-నవభూమిబ్యూరో

వైసీపీ నేతలను కేసులు వదలడం లేదు. విడతల వారీగా వంతుల వారీగా కేసులు, అరెస్టులతో ప్రభుత్వం ముప్పతిప్పలు పెడుతోంది. సినీ నటుడు, వైసీపీ నేత పోసాని క్రిష్ణమురళి బెయిల్‌పై విడుదలయ్యేరని సంతోషిస్తున్న లోపే వైసీపీకి ప్రభుత్వం మారో షాక్ ఇచ్చింది. ఉమ్మడి గుంటూరు జిల్లాకు చెందిన మాజీ మంత్రి విడదల రజినిపై ఏసీబీ కేసు నమోదు చేసింది. మాజీ మంత్రితోపాటు ఐపీఎస్ అధికారి జాషువా, విడదల గోపి, పీఏ రామక్రిష్ణపై కేసులు నమోదయ్యాయి. దీంతో ఏ క్షణమైనా మాజీ మంత్రిని అరెస్టు చేసే అవకాశం ఉందంటూ ప్రచారం జరుగుతోంది. వైసీపీ ప్రభుత్వం అధికారంలో ఉండగా, చిలకలూరి పేట నియోజకవర్గం పరిధిలోని యడ్లపాడు మండలంలోని శ్రీ లక్ష్మీబాలాజీ స్టోన్ క్రషర్ యజమానిని బెదిరించి రూ.2.20 కోట్లు వసూలు చేశారని మాజీ మంత్రి విడదల రజినిపై కేసు నమోదైంది. 2020లో ఈ ఉదంతం చోటుచేసుకోగా, గత ఏడాది కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన వెంటనే బాధితుడు ఫిర్యాదు చేశారు. ఈ వ్యవహారంపై విజిలెన్స్ విచారణకు ఆదేశించిన ప్రభుత్వం వాస్తవాలు తెలుసుకుని తాజాగా ఏసీబీ కేసు నమోదుకు గ్రీన్ సిగ్నల్ ఇచ్చింది. ప్రభుత్వ ఆదేశాలు వచ్చిన తర్వాత మాజీ మంత్రి రజినిపై కేసు నమోదుకు గవర్నర్ అనుమతి తీసుకున్న అధికారులు తాజాగా కేసు నమోదు చేశారు. తన నియోజకవర్గం పరిధిలో వ్యాపారం చేసుకోవాలంటే తనకు రూ.5 కోట్లు ఇవ్వాల్సిందిగా అప్పట్లో మంత్రిగా ఉన్న రజిని బెదిరించారని బాధితుడు ప్రభుత్వానికి ఫిర్యాదు చేశాడు. అన్ని అనుమతులు ఉన్న తాను డబ్బులు ఎందుకు ఇవ్వాలని బాధితుడు ఎదురుతిరగగా, అప్పట్లో గుంటూరు విజిలెన్స్ ఎస్పీగా పనిచేసిన జాషువాను పంపి రూ.50 కోట్ల అపరాధ రుసుం విధిస్తానని బెదిరించినట్లు ఫిర్యాదు చేశారు. జాషువా బెదిరింపులతో తాను రూ.2 కోట్లు విడదల



## ఉల్లంఘనుల
# లైసెన్సులు రద్దు

- మంత్రి పొన్నం ప్రభాకర్ షాకింగ్ నిర్ణయం..
- ఐదు లేదా ఆరు సార్లు నిబంధనలు అతిక్రమిస్తే డ్రైవింగ్ లైసెన్స్ రద్దు
- తర్వాత లైసెన్స్ పునరుద్ధరణ జరగదు..కొత్తవాహనాల రిజిస్ట్రేషన్ ఉండదు
- ఆటో డ్రైవర్ల కోసం సంక్షేమ బోర్డు ఏర్పాటు చేస్తామన్న మంత్రి

2

హైదరాబాద్-నవభూమిబ్యూరో

రాష్ట్ర వ్యాప్తంగా ఉన్న వాహనదారులకు బిగ్ అలెర్ట్. రోజురోజుకూ పెరుగుతున్న ట్రాఫిక్ దృష్ట్యా రాష్ట్ర రవాణాశాఖ మంత్రి పొన్నం ప్రభాకర్ కీలక నిర్ణయం తీసుకున్నారు. ఇకపై ట్రాఫిక్ ఉల్లంఘనలకు పాల్పడితే లైసెన్సులు రద్దు చేస్తామని తెలిపారు. ఐదు లేదా ఆరు సార్లు నిబంధనలు అతిక్రమిస్తే డ్రైవింగ్ లైసెన్స్ రద్దు చేస్తామని హెచ్చరికలు జారీ చేశారు. ఆ తర్వాత వాటిని ఎప్పటికీ పునరుద్ధరించమని.. వారు తరువాత ఏవైనా వాహనాలు తీసుకుంటే వాటికి రిజిస్ట్రేషన్లు చేయమని స్పష్టం చేశారు. త్వరలోనే ఈ నిబంధనలు అమల్లోకి వస్తాయని దీనికి సంబంధించిన జీవో విడుదల చేస్తామని మంత్రి పొన్నం ప్రభాకర్ వెల్లడించారు. ఆటో డ్రైవర్ల కోసం సంక్షేమ బోర్డు ఏర్పాటు చేస్తామని అసెంబ్లీలో పొన్నం ప్రభాకర్ స్పష్టం చేశారు. సీపీఐ సభ్యుడు కూనంనేని సాంబశివరావు అడిగిన ప్రశ్నకు ఈ మేరకు పొన్నం సమాధానం ఇచ్చారు. ఆర్టీసీ కార్మికుల విలీన ప్రక్రియపై కమిటీని ఏర్పాటు చేస్తామని బీజేపీ శాసనసభాపక్షనేత ఏలేటి మహేశ్వర్ రెడ్డి

# వైసీపీకి ఎమ్మెల్సీ గుడ్‌బై?

- వరుసగా పార్టీని వీడుతున్న వైసీపీ ఎమ్మెల్యేలు
- వైస్సార్ కుటుంబానికి సన్నిహితుడైన ఎమ్మెల్సీ మర్రి రాజశేఖర్ టీడీపీలోకి..
- 3 దశాబ్దాల రాజకీయ జీవితమున్న సీనియర్ నేత,ఎమ్మెల్సీ తోట త్రిమూర్తులు సైతం జనసేన వైపు చూపు

2



గుంటూరు-నవభూమిబ్యూరో

పాంచ్ పటాకా అన్నట్లుగా అయిదురుగు ఎమ్మెల్సీలు వైసీపీని వీడిపోయారు. దీనికి పోతుల సునీత తోవ తీశారు. అదే బాటలో కర్రి పద్మశ్రీ, కళ్యాణ్ చక్రవర్తి, జయమంగళ వెంకటరమణ నడిచారు. లేటెస్ట్‌గా చూస్తే కనుక వైఎస్సార్ కుటుంబానికి అత్యంత సన్నిహితుడు అయిన మర్రి రాజశేఖర్ పార్టీని వీడి వెళ్ళారు. ఇపుడు ఆరవ ఎమ్మెల్సీ ఎవరా అని చర్చ అయితే జోరుగా సాగుతోంది. అయితే ఆ ఆరవ ఎమ్మెల్సీ ఉమ్మడి తూర్పు గోదావరి జిల్లాకు చెందిన వారే అవుతారని అంటున్నారు. ఆయన 3 దశాబ్దాల రాజకీయ జీవితం కలిగిన సీనియర్ మోస్ట్ నేత తోట త్రిమూర్తులు అని ప్రచారం సాగుతోంది. ఆయన 1994లో తొలిసారి రామచంద్రపురం నుంచి గెలిచారు. ఆ తరువాత అనేక సార్లు ఎమ్మెల్యేగా గెలిచారు. ఆయన టీడీపీ కాంగ్రెస్ ప్రజారాజ్యం వైసీపీ ఇలా పార్టీలు ఎన్నో మారారు. ఇక ఆయన వైసీపీలోకి వచ్చాక ఎమ్మెల్సీ పదవి దక్కింది. ఇవన్నీ ఇలా ఉంటే ఇంతటి సీనియర్ నేత అయినా మంత్రి కావాలన్న కోరిక అయితే ఆయనకు తీరలేదు. ఇపుడు ఆయన తన కుమారుడిని రాజకీయ వారసుడిగా

# బీసీ నేతకే బీజేపీ పగ్గాలు!

- వచ్చే ఎన్నికల్లో అధికారంపై బీజేపీ తాజా వ్యూహం
- ఏపీలో సక్సెస్ అయినట్లుగా తెలంగాణలోనూ కూటమి
- ఆపరేషన్ కమలం దక్షిణాది నుంచే అమలు
- తెలంగాణలో పార్టీ బలోపేతానికి కొత్త నేత నియామకం
- ఈటలకు పార్టీ పగ్గాలు అప్పగించేందుకు కసరత్తు!



హైదరాబాద్-నవభూమిబ్యూరో

తెలంగాణ రాజకీయాల్లో కీలక సమీకరణాలు చోటు చేసుకుంటున్నాయి. బీసీ కుల గణన, ఎస్సీ వర్గీకరణ నిర్ణయాల ద్వారా సామాజిక వర్గాల వారీగా పట్టు పెంచుకునేందుకు సీఎం రేవంత్ కొత్త వ్యూహాలు అమలు చేస్తున్నారు. మాజీ సీఎం కేసీఆర్ తిరిగి అధికారంలోకి వస్తామని ధీమాగా చెబుతున్నారు. ఇదే సమయంలో బీజేపీ అలర్ట్ అయింది. ఏపీలో సక్సెస్ అయిన కూటమి తెలంగాణలోనూ అమలు పైన ఆలోచన చేస్తోంది. ఇక, బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడి నియామకంలో ఊహించని రాజకీయం తెర మీదకు వస్తోంది. ఆపరేషన్ తెలంగాణ దక్షిణాదిలో తెలంగాణ నుంచి తమ ఆపరేషన్ మొదలు పెట్టాలని బీజేపీ భావిస్తోంది. అందులో భాగంగా కీలక నిర్ణయాల ప్రకటనకు సిద్దమైంది. ఢిల్లీ కసరత్తు తెలంగాణ బీజేపీకి నూతన అధ్యక్షుడి నియామకం పైన త్వరలోనే ప్రకటన రానుంది. ఇప్పటికే కసరత్తు పూర్తి చేసిన పార్టీ నాయకత్వం వచ్చే వారం అధికారికంగా వెల్లడించనుంది. అందులో భాగంగా తెలంగాణలో సామాజిక సమీకరణాల ఆధారంగా నిర్ణయాలు తీసుకుంటోంది. తెలంగాణ అసెంబ్లీ ఎన్నికల సమయంలో బీజేపీ బీసీ సీఎం నినాదం తీసుకొచ్చింది. అసెంబ్లీ ఎన్నికల్లో బీజేపీ 8 స్థానాలు దక్కించుకుంది. పార్లమెంట్ ఎన్నికల్లోనూ అనూహ్యంగా ఎనిమిది సీట్లు దక్కటంతో తెలంగాణ పైన పట్టు చిక్కినట్లు భావిస్తున్న పార్టీ నాయకత్వం..పార్టీ రాష్ట్ర అధ్యక్షుడి విషయంలో ఆచితూచి వ్యవహరిస్తోంది. బండి సంజయ్ ను తప్పించి ఆ స్థానంలో కిషన్ రెడ్డికి బాధ్యతలు

# మంత్రి కోమటిరెడ్డికి బీఆర్ఎస్ షాక్

- సభా హక్కుల ఉల్లంఘన నోటీస్
- స్పీకర్ గడ్డం ప్రసాద్ కుమార్‌ను కలిసి బీఆర్ఎస్ ఎమ్మెల్సీ వినతిపత్రం
- రోడ్ల నిధులపై మంత్రి ఇచ్చిన సమాధానం పూర్తిగా అవాస్తమన్న ఎమ్మెల్యేలు

2



హైదరాబాద్-నవభూమిబ్యూరో

తెలంగాణ మంత్రి కోమటిరెడ్డి వెంకట్ రెడ్డికి బీఆర్ఎస్ ఎమ్మెల్యేలు షాక్ ఇచ్చారు. ఆయనపై సభా హక్కుల ఉల్లంఘన నోటీసు అందజేశారు. ఈ మేరకు స్పీకర్ గడ్డం ప్రసాద్ కుమార్‌ను కలిసి వినతిపత్రం సమర్పించారు. మంత్రి కోమటిరెడ్డి సభలో అవాస్తవాలు మాట్లాడుతున్నారని స్పీకర్‌కు ఫిర్యాదు చేశారు. శాసనసభ ప్రశ్నోత్తరాల సమయంలో రోడ్లు, భవనాల శాఖకు సంబంధించి మంత్రి ఇచ్చిన సమాధానం సభను తప్పుదోవ పట్టించే విధంగా ఉందని వినతి పత్రంలో పేర్కొన్నారు. బీఆర్ఎస్ పాలనలో సీఆర్ఎఫ్ నిధులు రాలేదని మంత్రి వ్యాఖ్యానించినట్టు ఫిర్యాదులో స్పష్టం చేశారు. నల్గొండ నియోజకవర్గ రోడ్లకు నిధులు

## వితంతు మహిళలకు
# ఏపీ సర్కార్ గుడ్ న్యూస్

- కొత్త పింఛన్ల కోసం వేలాది మంది ఎదురుచూపులు
- కూటమి ప్రభుత్వం ఏర్పాటై 9 నెలలు అవుతున్నా
- కొత్త పింఛన్లు మంజూరు కాని వైనం
- 93వేల మంది వితంతువులకు మే నెల నుంచి
- కొత్త పింఛన్లు ఇవ్వనున్నామన్న మంత్రి కొండపల్లి


2



అమరావతి-నవభూమిబ్యూరో

ఆంధ్రప్రదేశ్‌లో కూటమి ప్రభుత్వం కొలువుదీరిన అనంతరం సామాజిక భద్రతా పింఛన్ల మొత్తాన్ని పెంచడంతో, వేలాది మంది అర్హులు పింఛన్ల మంజూరు కోసం నిరీక్షిస్తున్నారు. ప్రజాప్రతినిధులకు అందుతున్న విజ్ఞప్తుల్లో పింఛను దరఖాస్తులే అధికంగా ఉంటున్నాయి.
చంద్రబాబు నాయకత్వంలోని కూటమి ప్రభుత్వం ఏర్పడి తొమ్మిది నెలలు దాటినా, నూతన పింఛన్లు ఇంతవరకు మంజూరు కాలేదు. అనర్హుల తొలగింపు ప్రక్రియ మాత్రం కొనసాగుతోంది. దీంతో కొత్త పింఛన్లు మంజూరవుతాయనే ఆశతో


# ఎస్ఎల్‌బీసీలో 31వ రోజుకు చేరుకున్న రెస్క్యూ ఆపరేషన్.. సహాయక చర్యల్లో పురోగతి



**అచ్చంపేట-నవభూమి:** దోమలపెంట ఎస్ఎల్‌బీసీ టన్నెల్‌లో సహాయక చర్యలు నిరంతరాయంగా కొనసాగుతున్నాయి. రెస్క్యూ ఆపరేషన్ ఆదివారం 31వ రోజుకు చేరుకున్నది. టన్నెల్ ఆఫీస్ వద్ద జరిగిన సమీక్ష సమావేశంలో జిల్లా కలెక్టర్ బాదావత్ సంతోష్ ఉన్నతాధికారులతో టన్నెల్ లోపల చేపట్టాల్సిన చర్యలపై చర్చించారు. కలెక్టర్ మాట్లాడుతూ డీ-1, డీ-2 ప్రదేశాల్లో మట్టి తవ్వకాలు, డి-వాటరింగ్‌ను బయటకు పంపే ప్రక్రియ వేగంగా జరుగుతున్నాయని పేర్కొన్నారు. ప్రమాద ప్రదేశాన్ని మినహాయించి మిగిలిన ప్రాంతాల్లో సహాయక చర్యలు పూర్తిస్థాయిలో కొనసాగుతున్నాయని వివరించారు. సంఘటన జరిగిన నాటి నుంచి కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలకు చెందిన ఎన్‌డీఆర్ఎఫ్, ఎస్‌డీఆర్ఎఫ్, సింగరేణి మైన్స్ రెస్క్యూ, దక్షిణ మధ్య రైల్వే బృందాలు ప్రతికూల పరిస్థితుల్లో 24 గంటల పాటు శ్రమిస్తున్నాయని వెల్లడించారు. టన్నెల్ బోరింగ్ మెషిన్ (టీబీఎం) కత్తిరించిన భాగాలను తొలగిస్తూ, వాటర్ జెట్ ద్వారా బురదను తొలగిస్తున్నారు. ఎస్కవేటర్ల ద్వారా మట్టిని కన్వేయర్ బెల్ట్ ద్వారా బయటకు తరలిస్తున్నారు. ప్రమాద ప్రదేశం వరకు విద్యుత్, వెంటిలేషన్ పునరుద్ధరణ పూర్తయిందని జిల్లా కలెక్టర్ వెల్లడించారు. సహాయక బృందాలకు అవసరమైన వసతులు, ఆరోగ్య పరిరక్షణకు ప్రత్యేక చర్యలు తీసుకుంటున్నట్లు వివరించారు. ఈ సమీక్ష సమావేశంలో ఎన్‌డీఆర్ఎఫ్ అధికారులు డాక్టర్ హరీష్, ఎస్‌డీఆర్ఎఫ్, దక్షిణ మధ్య రైల్వే, అన్వి రోబోటిక్స్, జేపీ కంపెనీ ప్రతినిధులు పాల్గొన్నారు.



## తెలంగాణలో కోరలు చాస్తున్న క్షయ.. కొత్తగా 4,600 టీబీ కేసులు, లక్షణాలివే



**హైదరాబాద్-నవభూమి:** తెలంగాణలో క్షయ వ్యాధి క్రమంగా విస్తరిస్తోంది. వ్యాధి నిర్మూలనకు ప్రభుత్వం ప్రతి ఏడాది ప్రత్యేక కార్యక్రమాలతో ప్రజలను చైతన్య పరుస్తున్నా టీబీ కోరలు చాస్తుంది. రాష్ట్రంలో కొత్తగా 4,600 కేసులు వెలుగులోకి వచ్చాయి. వంద రోజుల టీబీ నిర్మూలన కార్యక్రమంలో భాగంగా చేపట్టిన క్షయ నిర్ధారణ పరీక్షల్లో కొత్త కేసులు వెలుగుచూశాయి. రాష్ట్రంలో కేసులు ఎక్కువగా ఉన్న 9 జిల్లాలను గుర్తించి.. అక్కడ ఆరు పోర్టబుల్ హ్యాండిల్డ్ ఏఐ ఎక్స్‌రే యంత్రాలను ఉపయోగించారు. ఇందులో కొత్త కేసులు వెలుగు చూడటం కలవరపాటుకు గురి చేస్తోంది.

**క్షయ వ్యాధి లక్షణాలు..**

కాగా, క్షయ వ్యాధి ట్యూబర్ కోలోసిస్ అనే సూక్ష్మక్రిమి వల్ల సంక్రమిస్తుంది. రెండు వారాలకు మించి తీవ్రమైన జ్వరం, దగ్గు, ఆకలి మందగించడం, బరువు తగ్గడం, ఎక్కువగా దగ్గినపుడు కఫంతోపాటు జీరలు పడినా క్షయ వ్యాధి లక్షణాలుగా డాక్టర్లు పేర్కొంటున్నారు. తక్షణమే పరీక్షలు చేసినట్లైతే వ్యాధి తీవ్రతను ఆరంభంలో కట్టడి చేయటానికి వీలుంటుంది. రోగ నిరోధక శక్తి తక్కువ గా ఉండే వారిలో ఈ వ్యాధి వేగంగా వ్యాపిస్తోంది. వ్యాధి సోకిన వారు సరైన పోషకాహారం, క్రమం తప్పకుండా మందులు వాడితే ఈజీగా నయం చేయవచ్చు. లేదంటే ఈ వ్యాధితో ప్రాణానికే ప్రమాదం.క్షయ వ్యాధి ఒకరి నుంచి మరొకరికి సంక్రమిస్తుంది. వ్యాధి సోకిన రోగి దగ్గు, తుమ్ము, ఉమ్మితో మరొకరికి వ్యాపించవచ్చు. రద్దీ ఉన్న ప్రదేశాల్లో క్రిములు చాలా సులభంగా ప్రవేశిస్తాయి. దీర్ఘకాలిక వ్యాధుల బారిన పడి మందులు వాడుతున్న వారిలో క్షయ వ్యాధి సులభంగా వ్యాప్తి చెందుతుంది. వ్యాధిగ్రస్తులు దగ్గినపుడు, తుమ్మినపుడు జాగ్రత్తలు పాటించకపోతే గాలి ద్వారా ఒకరి నుంచి మరొకరికి వేగంగా వ్యాప్తి చెందే అవకాశం ఉంది. సాధారణ వ్యక్తులకన్నా హెచ్ఐవీ వ్యాధిగ్రస్తులు ఎక్కువగా క్షయ వ్యాధి బారిన పడతారని డాక్టర్లు వెల్లడించారు. ఇక క్షయ వ్యాధిగ్రస్తులకు ప్రభుత్వం ఉచితంగా మందులు ఇస్తుంది. వాటిని క్రమం తప్పకుండా వాడాలని డాక్టర్లు సూచిస్తున్నారు. వ్యాధిగ్రస్తులు స్వచ్ఛందంగా ముందుకు వచ్చి రోగ నిర్ధారణ చేసుకుని చికిత్స తీసుకుంటే ఫలితం ఉంటుందని అంటున్నారు. ఎలాంటి ఆందోళనలకు గురికావాల్సిన అవసరం లేదని.. ముందుగా గుర్తిస్తే ప్రాణాల కాపాడుకోవచ్చునని చెబుతున్నారు.

## తెలంగాణ కొత్త రేషన్ కార్డులపై అప్డేట్.. మంత్రి పొన్నం కీలక ప్రకటన



**హైదరాబాద్-నవభూమి:** తెలంగాణలో కొత్త రేషన్ కార్డుల కోసం చాలా మంది ఎదురు చూస్తున్నారు. గత బీఆర్ఎస్ ప్రభుత్వ హయాంలో కార్డులు జారీ చేయకపోవటంతో.. కుటుంబాలు వేరు పడిన వారు, కొత్తగా పెళ్లిళ్లు చేసుకున్నవారు కొత్త రేషన్ కార్డుల కోసం ఆశగా చూస్తున్నారు. ఈ నేపథ్యంలో జనవరి 26న సీఎం రేవంత్ రెడ్డి రేషన్ కార్డుల జారీ ప్రక్రియను ప్రారంభించారు. ఇప్పటికే ప్రజాపాలన, ప్రజావాణి, మీ సేవ కేంద్రాల ద్వారా అర్హుల నుంచి అప్లికేషన్లు తీసుకున్నారు. ఇప్పటికే రాష్ట్రవ్యాప్తంగా కొన్ని గ్రామాల్లో పైలట్ ప్రాజెక్టుగా కార్డులను మంజూరు చేశారు. తాజాగా.. కొత్త రేషన్ కార్డులపై బీసీ, రవాణా శాఖ మంత్రి పొన్నం ప్రభాకర్ కీలక అప్డేట్ ఇచ్చారు. రాష్ట్రంలో త్వరలోనే అర్హులందరికీ కొత్త రేషన్ కార్డులు మంజూరు చేస్తామని చెప్పారు. పారదర్శకంగా అర్హులందరికీ కార్డులు జారీ చేసే బాధ్యతను తమ ప్రభుత్వం తీసుకుంటుందని చెప్పారు. ఉగాది నుంచి రేషన్ కార్డుల రేషన్ పంపిణీ మొదలు కాబోతుందని చెప్పారు హుస్నాబాద్ ఐవోసీ కార్యాలయంలో అధికారులతో సమీక్షా సమావేశాన్ని మంత్రి పొన్నం ప్రభాకర్ నిర్వహించారు. ఈ సమావేశంలో సిద్దిపేట, కరీంనగర్, హనుమకొండ జిల్లాల అదనపు కలెక్టర్లు, ఇతర అధికారులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా మాట్లాడిన మంత్రి పొన్నం నల్గొండలో సన్నబియ్యం ఇచ్చే పథకాన్ని కూడా ప్రారంభించనున్నట్లు చెప్పారు. రేషన్ కార్డులు ఉన్నవారికి సన్నబియ్యం ఇవ్వనున్నట్లు వెల్లడించారు. ప్రతి కుటుంబ సభ్యుడికి 6 కేజీల చొప్పున సన్నబియ్యం పంపిణీ చేస్తామన్నారు. ఇక వేసవిలో ప్రజలకు తాగునీటి ఇబ్బందులు రాకుండా చూడాలని మంత్రి అధికారులను ఆదేశించారు. ఎండాకాలంలో తాగునీటి సమస్య రాకుండా చర్యలు తీసుకోవాలన్నారు. వరి కోతలు జరుగుతున్నందున, కొనుగోలు కేంద్రాల్లో ఎలాంటి సమస్యలు లేకుండా చూడాలని అధికారులకు చెప్పారు. ఇందిరమ్మ ఇండ్ల ఎంపికలో పేదలకు ప్రాధాన్యత ఇవ్వాలన్నారు. అర్హులైన ప్రతి ఒక్కరికి సంక్షేమ పథకాలు అందాలని అన్నారు. గత బీఆర్ఎస్ ప్రభుత్వం రేషన్ కార్డులు ఇవ్వకుండా ప్రజల్ని ఇబ్బందులు పెట్టిందని.. అందుకే తాము అధికారంలోకి రాగానే కార్డులు మంజూరు చేస్తున్నట్లు చెప్పారు.

## సూర్యాపేటలో రోడ్డు ప్రమాదం.. ఒకే కుటుంబానికి చెందిన ముగ్గురు మృతి

**హైదరాబాద్-నవభూమి:** సూర్యాపేటలో ఘోర రోడ్డు ప్రమాదం జరిగింది. ఈ ఘటనలో ఒకే కుటుంబానికి చెందిన ముగ్గురు మృతి చెందారు. చివ్వెం మండలం బీబీగూడెం వద్ద రోడ్డు ప్రమాదం చోటు చేసుకున్నది. ఆర్టీసీ బస్సు-కారు ఢీకొట్టింది. ఈ ప్రమాదంలో దంపతులతో పాటు వారి ఎనిమిదేళ్ల కూతురు ప్రాణాలు కోల్పోయింది. మృతులను మహబూబాబాద్ జిల్లా తొర్రూరు మండలం కంతాయపాలెం గ్రామానికి చెందిన గడ్డం రవీందర్, రేణుక, రితికగా గుర్తించారు. ఘటనపై పోలీసులు కేసు నమోదు చేసి విచారణ జరుపుతున్నారు. ప్రమాదానికి సంబంధించి మరిన్ని వివరాలు తెలియాల్సి ఉంది.

# కేసీఆర్‌కు అక్కడ దొంగ నోట్ల ప్రింటింగ్ ప్రెస్ ఉంది..
## కేంద్ర మంత్రి సంచలన వ్యాఖ్యలు



**హైదరాబాద్-నవభూమి:** బీఆర్ఎస్ అధినేత, మాజీ సీఎం కేసీఆర్ మీద కేంద్ర హోంశాఖ సహాయ మంత్రి బండి సంజయ్ కుమార్ తీవ్ర వ్యాఖ్యలు చేశారు. ఆదివారం (మార్చి 23న) రోజున నాంపల్లిలోని బీజేపీ రాష్ట్ర కార్యాలయంలో మీడియాతో బండి సంజయ్ మాట్లాడారు. కేసీఆర్‌కు బీదర్‌లో దొంగనోట్ల ప్రిటింగ్ ప్రెస్ ఉందని సంచలన ఆరోపణలు చేశారు. బీదర్‌లోని ప్రెస్‌లో ప్రింటింగ్ చేసిన దొంగ నోట్లనే అసెంబ్లీ ఎన్నికల్లో పంచారని ఆరోపించారు. మరోవైపు.. బీఆర్ఎస్ ప్రభుత్వ హయాంలో తెలంగాణ అప్పుల పాలైందని బండి సంజయ్ విమర్శించారు. రూ.6 లక్షల కోట్ల అప్పు ఉందని ప్రభుత్వమే చెబుతోందని గుర్తుచేశారు. బీఆర్ఎస్ సర్కార్ నిర్వాకం వల్ల ప్రభుత్వ భూములు అమ్మితే గానీ ఉద్యోగులకు జీతాలు ఇచ్చే పరిస్థితి లేదని చెప్పుకొచ్చారు. అయితే.. కమీషన్లు ఇచ్చేవారికే ప్రభుత్వం బిల్లులు చెల్లిస్తోందని బండి సంజయ్ ఆరోపించారు. ఆ కమీషన్లను కూడా 15 నుంచి 18 శాతానికి పెంచారని బండి సంజయ్ ఆరోపించారు. మరోవైపు.. డీలిమిటేషన్‌కు వ్యతిరేకంగా దక్షిణాది రాష్ట్రాలు శనివారం (మార్చి 22న) రోజు చెన్నైలో భేటీ కావటంపై బండి సంజయ్ కీలక వ్యాఖ్యలు చేశారు. దేశానికి ఎక్కువ ఆదాయం దక్షిణాది రాష్ట్రాల నుంచే వెళ్తుందని.. అలాంటి రాష్ట్రాలకు డీలిమిటేషన్‌లో కేంద్రం ఎలా అన్యాయం చేస్తోందని దక్షిణాది రాష్ట్రాలు మాట్లాడుతున్నాయని గుర్తు చేశారు. అసలు దేశ జీడీపీకి, డీలిమిటేషన్?కు ఏం సంబంధమని బండి సంజయ్ ప్రశ్నించారు. డీలిమిటేషన్ పేరుతో లిక్కర్ దొంగలంతా ఒకే చోట చేరి దక్షిణాది పేరుతో డ్రామాలాడుతున్నారని బండి సంజయ్ కీలక ఆరోపణలు చేశారు.

రాష్ట్రంలో కాంగ్రెస్ 6 గ్యారంటీలపై ప్రజలను మోసం చేసిందని బండి సంజయ్ తీవ్ర స్థాయిలో మండిపడ్డారు. రాష్ట్రంలో ఇంకా 16 లక్షల మంది రైతులకు రుణమాఫీ కాలేదని తెలిపిన బండి సంజయ్.. ఇప్పటికే రుణమాఫీ పూర్తయ్యిందని అసెంబ్లీలో మంత్రి ప్రకటించడం సిగ్గుచేటని విమర్శించారు. మరోవైపు.. అసెంబ్లీ ఎన్నికల్లో ఉద్యోగులకు కాంగ్రెస్ పార్టీ చాలా హామీలిచ్చిందని బండి సంజయ్ గుర్తు చేశారు. ఉద్యోగులకు ఇచ్చిన హామీలు నెరవేర్చాలంటే రూ.8 వేల కోట్లు కావాలని పేర్కొన్నారు. కాంగ్రెస్ విధానాలు చూస్తుంటే మరో 3 నెలల తర్వాత జీతాలు ఇచ్చే పరిస్థితి కూడా కనిపించట్లేదంటూ ఎద్దేవా చేశారు. రైతులకు ఇచ్చిన హామీలు అమలుచేయకుండా మోసం చేస్తే పుట్టగతులుండవని బండి సంజయ్ హెచ్చరించారు. రైతులు తలుచుకుంటే ప్రభుత్వాలను మార్చేయగలరని బండి సంజయ్ చెప్పుకొచ్చారు.

## మహాలక్ష్మి ఉచిత బస్సు పథకం.. ఆర్టీసీకి కళ్లు చెదిరే లాభం



**హైదరాబాద్-నవభూమి:** తెలంగాణ ప్రభుత్వం మహిళల కోసం మహాలక్ష్మి ఉచిత బస్సు పథకం ప్రారంభించిన సంగతి తెలిసిందే. అసెంబ్లీ ఎన్నికల్లో ఇచ్చిన హామీ మేరకు.. అధికారంలోకి రాగానే ఈ పథకాన్ని సర్కార్ ప్రారంభించింది. 2023 డిసెంబరు 9 నుంచి ఆర్డినరీ, ఎక్స్‌ప్రెస్, సిటీ బస్సులు, మెట్రో ఎక్స్‌ప్రెస్ బస్సుల్లో మహిళలు, బాలికలు, ట్రాన్స్‌జెండర్లకు రాష్ట్ర ప్రభుత్వం ఉచిత ప్రయాణం కల్పిస్తోంది. వీరు ఆధార్ కార్డు చూపించి జీరో టికెట్ తీసుకొని రాష్ట్రవ్యాప్తంగా ఎక్కడి నుంచి ఎక్కడికైనా ఉచితంగా ప్రయాణం చేయవచ్చు. ఆ ఛార్జీల మొత్తాన్ని ఆర్టీసీకి ప్రభుత్వం చెల్లిస్తోంది.

అయితే ఈ పథకం అమల్లోకి వచ్చిన తర్వాత.. ఆర్టీసీలో ప్రయాణికుల సంఖ్య భారీగా పెరిగింది. గతంలో రోజువారీ ప్రయాణికుల సగటు 45.49 లక్షలు ఉండగా.. ఈ పథకం అమల్లోకి వచ్చిన తర్వాత 59.10 లక్షలకు చేరినట్లు ఆర్టీసీ అధికారులు తెలిపారు. అదనంగా 13.61 లక్షల మంది ప్రయాణిస్తున్నారు. గతంలో హైదరాబాద్ నగరంలో రోజుకూ 12 లక్షల మంది ప్రయాణిస్తే.. పథకం అమల్లోకి వచ్చిన తర్వాత ఆ సంఖ్య డబుల్ అయింది. గతంలో ఆర్టీసీ నష్టాల్లో ఉండగా.. మహాలక్ష్మి ఉచిత బస్సు పథకం అమల్లోకి వచ్చాక ఆర్టీసీకి గత రెండేళ్లుగా లాభాలు వస్తున్నాయి. ఈ మేరకు రవాణాశాఖ మంత్రి పొన్నం ప్రభాకర్ అసెంబ్లీలో కీలక ప్రకటన చేశారు. మహాలక్ష్మి ఉచిత బస్సు ప్రయాణం వల్ల ఆర్టీసీకి లాభాలు వచ్చాయన్నారు. పథకం అమలుతో గత, ప్రస్తుత ఆర్థిక సంవత్సరాల్లో ఆర్టీసీకి మంచి ఆదాయం వచ్చిందన్నారు. 2023-24లో రూ.104.11 కోట్ల లాభం రాగా.. 2024-25లో జనవరి నాటికే రూ.529.20 కోట్ల లాభం వచ్చిందని తెలిపారు. ఈ ఆర్థిక సంవత్సరం చివరి నాటికి రూ.709.29 కోట్లు వస్తాయని అంచనా వేస్తున్నామన్నారు. 2025-26లో ఏకంగా రూ.1,008.79 కోట్ల లాభం వస్తుందని భావిస్తున్నట్లు మంత్రి వెల్లడించారు. ఆర్టీసీ సాధించిన విజయాలు, భవిష్యత్తులో పెట్టుకున్న లక్ష్యాల గురించి ఆయన సభలో వివరించారు. రానున్న రోజుల్లో ఆర్టీసీ మరింత అభివృద్ధి చెందుతుందని ఆయన ఆశాభావం వ్యక్తం చేశారు.

# అమరావతికి మోదీ?

(1వపేజీ తరువాయి)ఎదురుచూస్తున్నారు.

ఏపీ ప్రభుత్వం మరో కీలక నిర్ణయం తీసుకుంది. రాజధాని అమరావతి పనులు తిరిగి ప్రారంభించే లా ఇప్పటికే కార్యాచరణ సిద్ధం అవుతోంది. అమరావతి పనుల రీ లాంఛ్ కోసం ప్రధాని మోదీని ఆహ్వానించాలని ఏపీ ప్రభుత్వం భావిస్తోంది. ఇదే సమయంలో చంద్రబాబు ప్రతిష్ఠాత్మకంగా భావిస్తున్న పీ4 కార్యక్రమం పైన తాజాగా నిర్ణయం తీసుకున్నారు. ఉగాది రోజున ఈ కార్యక్రమం ప్రారంభించేందుకు నిర్ణయించారు. ఈ కార్యక్రమం వెనుక చంద్రబాబు భారీ లక్ష్యాన్ని నిర్దేశించారు. భారీగా ఈ కార్యక్రమ నిర్వహణకు ఏర్పాట్లు చేస్తున్నారు. పీ4 కార్యక్రమం ఆరంభం ముఖ్యమంత్రి చంద్రబాబు పీ4 కార్యక్రమాన్ని ప్రతిష్ఠాత్మకంగా భావిస్తున్నారు. ఈ కార్యక్రమం ప్రారంభానికి అమరావతి వేదికగా నిలవనుంది. ఉగాది ముహూర్తంగా నిర్ణయించారు. ప్రభుత్వం, ప్రైవేట్, ప్రజల భాగస్వామ్యంతో పేదరికాన్ని నిర్మూలించడమే లక్ష్యంగా చంద్రబాబు ఈ విధానం అమలుకు శ్రీకారం చుట్టనున్నారు.

ఉగాది నాడు వెలగపూడి సచివాలయం వెనుక భాగంలో భారీ సభ ద్వారా ఈ కార్యక్రమం ప్రారంభానికి ఏర్పాట్లు జరుగుతున్నాయి. ఈ కార్యక్రమం కోసం రాష్ట్రం లోని ప్రతీ నియోజకవర్గం నుంచి 50 మంది పేదలను ఆహ్వానిస్తున్నారు. దాదాపు వెయ్యి మంది సమక్షంలో ఈ కార్యక్రమం నిర్వహించనున్నారు. కనక వర్షం అంటే ఇదే! అన్ని నియోజకవర్గాల నుంచి పీ4 కార్యక్రమం రూపకల్పనలో చంద్రబాబు సుదీర్ఘ కసరత్తు చేసారు. విధి విధానాలు ఖరారు అయ్యాయి. అట్టడుగున ఉన్న పేదల సాధికారతకు ప్రభుత్వం పీ4 కార్యక్రమాన్ని రూపొందించింది. సమాజంలో ఉన్నత స్థితిలో ఉన్న 10 శాతం మంది, అట్టడుగున ఉన్న 20 శాతం మంది పేదలను దత్తత తీసుకోవడం తో పాటుగా వారికి అండగా ఉంటూ పేదరిక నిర్మూలన దిశగా అడుగులు వేయటమే ఈ కార్యక్రమ అసలు లక్ష్యం. రాష్ట్ర వ్యాప్తంగా 40 లక్షల కుటుంబాలకు అండగా నిలిచేలా ఈ కార్యక్రమ రూపకల్పన చేస్తున్నారు. ఇప్పటికే ఈ పీ4 పాలసీ పైన ప్రజల నుంచి ప్రభుత్వం సూచనలు - సలహాలు స్వీకరిస్తోంది. www.swarnandhra.ap.gov.in/p4 వెబ్‌సైట్ అందుబాటులోకి తెచ్చింది.

## కాలుష్య నివారణకు విద్యుత్ వాహన పాలసీ

- 296 కోట్లతో రాష్ట్ర వ్యాప్తంగా 37 ఆటోమేటెడ్ టెస్టింగ్ స్టేషన్లు
- కేసీఆర్‌పై నర్సారెడ్డి పోరాటానికి సంపూర్ణ మద్దతు: మంత్రి పొన్నం

**తిమ్మాపూర్-నవభూమి:** కాలుష్య నివారణకు దేశంలోనే మొదటిసారిగా రాష్ట్రంలో విద్యుత్ వాహన పాలసీని తీసుకువచ్చామని మంత్రి పొన్నం ప్రభాకర్ తెలిపారు. కరీంనగర్ జిల్లా తిమ్మాపూర్‌లోని జిల్లా రవాణా శాఖ కార్యాలయ ప్రాంగణంలో జువ్వాడి చొక్కారావు ట్రాఫిక్ అవగాహన పార్కును మంత్రి ప్రారంభించారు. ఆటోమేటెడ్ టెస్టింగ్ స్టేషన్ భవన నిర్మాణానికి శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఏఐ టెక్నాలజీ ద్వారా వాహనాల ఫిట్‌నెసను నిర్ధారించేందుకు రూ.296కోట్లతో 37 ఆటోమేటెడ్ టెస్టింగ్ స్టేషన్లు ఏర్పాటు చేయనున్నట్లు తెలిపారు. నూతన స్క్రాప్ విధానం ద్వారా 15 సంవత్సరాలు దాటిన వాహనాల స్థానంలో కొత్తవి కొనుగోలు చేస్తే రాయితీ ఇస్తామన్నారు. కాగా కేసీఆర్‌పై గజ్వేల్ మాజీ ఎమ్మెల్యే నర్సారెడ్డి పోరాటానికి సంపూర్ణ మద్దతు ఇస్తున్నట్లు పొన్నం ప్రకటించారు.

నర్సారెడ్డి చేపట్టిన పాదయాత్ర నాలుగో రోజు మంత్రి మార్గం మధ్యలో సంఘీభావం తెలిపి, మాట్లాడారు.

గత బీఆర్ఎస్ ప్రభుత్వం, కేసీఆర్ నిర్ణయాలు, అమలు చేసిన పథకాలు, వివిధ శాఖల్లో చోటు చేసుకున్న అవినీతిపై విచారణ జరుగుతున్నట్లు తెలిపారు. సిద్దిపేట జిల్లా హుస్నాబాద్‌లో ఇందిరమ్మ ఇళ్ల లబ్ధిదారుల ఎంపిక పారదర్శకంగా జరగాలని మంత్రి అధికారులకు సూచించారు.

ఆయన హుస్నాబాద్‌లోని ఐకేపీ కార్యాలయంలో నియోజకవర్గ అభివృద్ధిపై ఆదివారం జరిగిన సమీక్షలో మాట్లాడారు. కాగా నర్సారెడ్డి, యూత్ కాంగ్రెస్ రాష్ట్ర ఉపాధ్యక్షులు ఆంక్షారెడ్డి చేపట్టిన పాదయాత్రకు శామీర్‌పేటలోనూ మంత్రి పొన్నం ప్రభాకర్ ఆదివారం మద్దతు తెలిపారు.



## కేసీఆర్‌కు అసెంబ్లీని
# ఫేజ్ చేసే దమ్ములేదు

**హనుమకొండ-నవభూమి:** కేసీఆర్ ప్రభుత్వం దేవాదుల ప్రాజెక్టును నిర్లక్ష్యం చేసిందని మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి విమర్శించారు. మాజీ సీఎం, బీఆర్ఎస్ అధినేత కేసీఆర్‌కు అసెంబ్లీని ఫేజ్ చేసే దమ్ములేదని అన్నారు. అందుకే చర్చలేని సమయంలో, బడ్జెట్ చదివే సమయంలో అసెంబ్లీకి వచ్చిపోతున్నారని చెప్పారు. ఇవాళ(మంగళవారం) హనుమకొండ లో మంత్రులు ఉత్తమ్ కుమార్ రెడ్డి, పొంగు లేటి శ్రీనివాస్‌రెడ్డి పర్యటించారు. పలు అభి వృద్ధి పనుల్లో మంత్రులు పాల్గొన్నారు. దేవాదుల ఫేస్-3 పంప్‌హౌస్‌ను మంత్రులు ఉత్తమ్ కుమార్ రెడ్డి, పొంగులేటి శ్రీనివాసరెడ్డి ప్రారంభించడానికి వచ్చారు. ఈ సందర్భంగా మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి మీడియాతో మాట్లాడారు. ఇవాళ రాష్ట్రంలో ఉన్న నీటి ఎద్దడికి కారణం కేసీఆరే అని తెలిపారు. కమీషన్ల కోసం,శిలా ఫలకాల కోసమే కొత్త ప్రాజెక్టులు తెచ్చారు.. దేవాదులను నిర్లక్ష్యం చేశారని మండిపడ్డారు. ఉమ్మడి వరంగల్ జిల్లాలో అనుకున్న దానికంటే రైతులు ఎక్కువ సాగుచేశారని తెలిపారు. రైతుల పంటలు ఎండిపోకుండా కాపాడే ప్రయత్నం చేస్తున్నామని చెప్పారు. బడ్జెట్ సమావేశాల కంటే రైతుల సమస్యలే ముఖ్యమని వచ్చామ న్నారు. ఎంత పొద్దుపోయినా పంపు ఆన్ చేసి వెళ్తామని అన్నారు. నాటి ప్రభుత్వం దేవాదుల పూర్తి చేసి ఉంటే రైతులకు ఈ స్థితి వచ్చేది కాదని తెలిపారు. అంచనా వ్యయం పెరగడానికి కూడా కేసీఆర్ నిర్లక్ష్యమే కారణమని అన్నారు. తాగునీరు, సాగునీరు సమస్యకు గత కేసీఆర్ సర్కారే కారణమని ఆగ్రహం వ్యక్తం చేశారు.

## ఇక విడదల రజని వంతు!

(1వపేజీ తరువాయి)రజినికి, చెరో రూ.పది లక్షలు చొప్పున విడదల మరది గోపి, ఎస్పీ జాషువాకు ఇచ్చినట్టు బాధితుడు ఫిర్యాదు చేశారు. దీంతో అధికార దుర్వినియోగం, అవినీతి వ్యవహారాలపై మాజీ మంత్రి విడదల రజినితోపాటు ఐపీఎస్ అధికారి జాషువాలపై కేసులు నమోదయ్యాయి. దీంతో వైసీపీలో మరో టెన్షన్ మొదలైంది.

## వైసీపీకి ఎమ్మెల్సీ గుడ్‌బై?

(1వపేజీ తరువాయి)చూసుకోవాలని చూస్తున్నారు. మరో వైపు చూస్తే ఆయన జనసేనలోకి వెళ్తారని ప్రచారం పెద్ద ఎత్తున వ్యాపిస్తోంది. ఆయన జిల్లాలో వైసీపీ తరపున గట్టిగా మాట్లాడుతున్నా అమరావతికి వెళ్తే మాత్రం టోన్ మారుతోందని అంటున్నారు. ఇటీవల బడ్జెట్ సెషన్ సందర్భంగా ఆయన జనసేన అధినేత పవన్ కళ్యాణ్ తో సన్నిహితంగా మెలగడంతో ఆయన రూట్ ఎటు వైపు అన్నది మరింతగా చర్చకు వస్తోంది.

## వితంతు మహిళలకు ఏపీ సర్కార్ గుడ్ న్యూస్

(1వపేజీ తరువాయి)ఎంతోమంది ఎదురుచూస్తున్నారు.

ఈ నేపథ్యంలో కొత్త పింఛన్ల మంజూరుకు సంబంధించి ఒక ముఖ్యమైన సమాచారం వెలువడింది. సెర్ప్ శాఖ మంత్రి కొండపల్లి శ్రీనివాస్ ఈ మేరకు కీలక ప్రకటన చేశారు. రాష్ట్రంలో 93 వేల మంది వితంతువులకు మే నెల నుంచి కొత్తగా పింఛన్లు ఇవ్వనున్నట్లు ఆయన తెలిపారు. విజయనగరం జిల్లా గంట్యాడ గ్రామంలో శనివారం ఆయన మీడియాతో మాట్లాడుతూ ఈ విషయాన్ని వెల్లడించారు. రాష్ట్రంలో కొత్తగా దాదాపు 5 లక్షల మంది పింఛన్‌లకు అర్హులుగా ఉన్నారని, వారందరికీ త్వరలోనే మంజూరు చేస్తామని ఆయన పేర్కొన్నారు.

## మంత్రి కోమటిరెడ్డికి బీఆర్ఎస్ షాక్

(1వపేజీ తరువాయి)కేటాయించలేదని, ఉప్పల్ ఎలివేటెడ్ కారిడార్‌కు ఎస్క్రో అకౌంట్ తెరవలేదంటూ మంత్రి ఇచ్చిన సమాధానం పూర్తిగా అవాస్తవమని విన్నవించారు. సభను తప్పుదోవ పట్టిస్తున్న మంత్రిపై తక్షణమే చర్యలు తీసుకోవాలని బీఆర్ఎస్ ఎమ్మెల్యేలు కోరారు. అందుకు సంబంధించిన ఆధారాలను స్పీకర్‌కు సమర్పించారు. కోమటిరెడ్డిపై సభా హక్కుల ఉల్లంఘన నోటీసును తక్షణమే అనుమతించాలని కోరారు. %ూశ్రీంశీ =ముః% ఆ హీరోకు సర్వస్వం అర్పించుకున్నా ...స్టార్ హీరో కూతురు మరోవైపు అసెంబ్లీలో అధికార, విపక్షాల మధ్య మరోసారి డైలాగ్ వార్ నడిచింది. రోడ్ల నిర్మాణం విషయంలో తాను అడిగిన ప్రశ్నకు మంత్రి సమాధానం సరిగా చెప్పలేదన్న హరీష్ రావు వ్యాఖ్యలకు.. కోమటిరెడ్డి వెంకటరెడ్డి కౌంటర్ ఇచ్చారు. పీపీపీ మోడల్‌లో రోడ్ల నిర్మాణ ప్రతిపాదనలు లేవని.. హైబ్రిడ్ అన్యూటీ మోడల్ లో ప్రభుత్వం, ప్రైవేట్ భాగస్వామ్యంతో రోడ్లు నిర్మిస్తుందని చెప్పారు. 100 శాతం నిధులను ప్రభుత్వమే చెల్లిస్తుందని వెల్లడించారు.

## తెలంగాణ స్పీకర్‌కు

(1వపేజీ తరువాయి)సుప్రీం నోటీసులుఆదేశించాలని కోరింది. విచారణ సందర్భంగా ప్రభుత్వం, అసెంబ్లీ కార్యదర్శి, 10 మంది ఎమ్మెల్యేలు, ఎన్నికల సంఘానికి సుప్రీంకోర్టు నోటీసులు జారీ చేసింది. ఈ నెల 22లోగా స్పందించాలని ఆదేశిస్తూ విచారణను 25వ తేదీకి వాయిదా వేసింది. అయితే, గడువు ముగిసినా తెలంగాణ స్పీకర్ స్పందించకపోవడంతో సుప్రీంకోర్టు తాజాగా మళ్లీ నోటీసులు జారీ చేసింది.

## ఉల్లంఘనుల లైసెన్సులు రద్దు

(1వపేజీ తరువాయి)అడిగిన ప్రశ్నకు పొన్నం ప్రభాకర్ బదులిచ్చారు. గత ప్రభుత్వం ఆర్టీసీ కార్మికుల సమస్యలు పట్టించుకోలేదని మండిపడ్డారు. కార్మికులు సమ్మె చేసినా నాటి బీఆర్ఎస్ ప్రభుత్వం ఎలాంటి కనికరం చూపలేదని విమర్శించారు. ఇలాంటి సమస్యలన్నీ పరిష్కరిస్తూ వస్తున్నామని అన్నారు. తెలంగాణ రాష్ట్రంతో పాటు హైదరాబాద్ నగర వ్యాప్తంగా ట్రాఫిక్ రద్దీని తగ్గించేందుకు రేవంత్ సర్కార్ పలు కీలక నిర్ణయాలు తీసుకుంటోంది. రోడ్డు ప్రమాదాలను తగ్గించేందుకు అడుగులు వేస్తోంది. ట్రాఫిక్ ఆంక్షలను ఉల్లంగించేవారిపట్ల కఠినంగా వ్యవహరించాలని చూస్తోంది.

## బీసీ నేతకే బీజేపీ పగ్గాలు!

(1వపేజీ తరువాయి)అప్పగించిన తరువాత చోటు చేసుకున్న పరిణామాలతో ఇప్పుడు మరింత అలర్ట్ అవుతోంది. అధ్యక్షుడితో పాటుగా పార్టీలో కీలక మార్పులకు సమాయత్తం అయినట్లు ఢిల్లీ వర్గాల సమాచారం. ఇక, పార్టీలో పలు జిల్లాల్లో నాయకుల మధ్య సమన్వయ లోపం ఉన్నట్లు పార్టీ గుర్తించింది. దీంతో, అందరినీ కలుపుకొని ముందుకెళ్లే నేతకు పార్టీ అధ్యక్ష బాధ్యతలు కేటాయించాలని డిసైడ్ అయింది. అధ్యక్షుడి ముదిరాజ్ వర్గానికి చెందిన ఎంపీ ఈటల రాజేందర్ పేరు ఖరారైనట్లు ప్రచారం సాగుతోంది. అయితే, ఈటెల రేపు ప్రకటన సమయంలో సీనియర్లు తుది ప్రయత్నాలు చేస్తున్నారు. అనూహ్యంగా మురళీధర్ రావు, డీకే అరుణ పేర్లు తెర మీదకు వచ్చాయి. కొత్త లెక్కలు కేంద్ర మంత్రిగా కిషన్ రెడ్డి.. అసెంబ్లీ ఫ్లోర్ లీడర్ గా ఏలేటి మహేశ్వర్ రెడ్డి ఉండటంతో ఇప్పుడు రెడ్డి వర్గానికి అవకాశం ఉండదనే అభిప్రాయం వినిపిస్తోంది. దీంతో, బీసీ వర్గానికే అధ్యక్ష పదవి ఖాయమైనా.. రేసులో ఉన్న సీనియర్లకు ఎలాంటి బాధ్యతలు అప్పగిస్తారనేది పార్టీలో ఉత్కంఠ పెంచుతోంది. ఇదే సమయంలో కేంద్రమంత్రి బండి సంజయ్ కీలక వ్యాఖ్యలు చేశారు. బీఆర్ఎస్ చీఫ్ కేసీఆర్ కు బీదర్‌లో దొంగ నోట్లు ముద్రించే ప్రింటింగ్ ప్రెస్ ఉందంటూ ఆరోపణలు గుప్పించారు. తాను బీజేపీ అధ్యక్ష రేసులో లేనన్నారు. ఇస్తే వద్దనని స్పష్టం చేశారు. అధ్యక్షుడిగా ఇప్పటికే తానేంటో నిరూపించుకున్నానని తెలిపారు. కొంత మంది వ్యక్తులు కాబోయే అధ్యక్షుడు తామే అంటూ ప్రచారం చేసుకుంటున్నారని.. ఇలా ప్రచారం చేసుకోవడం పార్టీ క్రమశిక్షణకు వ్యతిరేకమని సంజయ్ చెప్పుకొచ్చారు. దీంతో.. ఇప్పుడు బీజేపీ అధ్యక్ష విషయంలో బీజేపీ తుది నిర్ణయం పైన ఉత్కంఠ పెరుగుతోంది.

## త్వరలో ఎస్ఎల్‌బీసీ పునః ప్రారంభం

**పాలకవీడు-నవభూమి:** ఎల్ఎస్‌బీసీ దుర్ఘటనతో పనులు నిలిచాయని, త్వరలోనే ఎస్ఎల్‌బీసీ పనులను తిరిగి ప్రారంభిస్తామని నీటిపారుదల శాఖ మంత్రి ఉత్తమ్‌కుమార్‌రెడ్డి తెలిపారు. ఉమ్మడి నల్లగొండ జిల్లాలో పెండింగ్ ప్రాజెక్టులన్నీ పూర్తిచేస్తామని చెప్పారు. సూర్యాపేట జిల్లా పాలకవీడు మండలం జాన్‌పహాడ్ దర్గాలో మంత్రి కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డి, నల్లగొండ ఎంపీ రఘువీర్‌రెడ్డి, ఉమ్మడి నల్లగొండ జిల్లా కాంగ్రెస్ ఎమ్మెల్యేలతో కలిసి ఆదివారం ప్రత్యేక ప్రార్థనల్లో పాల్గొన్న అనంతరం డెక్కన్ సిమెంట్ కర్మాగారంలో నిర్వహించిన మీడియా సమావేశంలో ఆయన మాట్లాడారు. డిండి ప్రాజెక్టు పనులు వేగవంతం చేస్తామన్నారు.

## రైలు పట్టాల వద్ద చిక్కుకున్న ఎస్‌యూవీ.. ఢీకొట్టిన రైలు

**న్యూఢిల్లీ-నవభూమి:**సెంట్రల్ ఇండస్ట్రియల్ సెక్యూరిటీ ఫోర్స్ (సీఐఎస్ఎఫ్) సిబ్బంది ఒక ఎస్‌యూవీలో రైల్వే క్రాసింగ్ వద్ద రైలు పట్టాలు దాటేందుకు ప్రయత్నించారు. ఆ వాహనం రైలు పట్టాల వద్ద చిక్కుకున్నది. ఇంతలో అటుగా వచ్చిన రైలు ఆ ఎస్‌యూవీని ఢీకొట్టింది. అయితే అందులో ఉన్న ముగ్గురు సీఐఎస్ఎఫ్ సిబ్బంది క్షణాల్లో ఆ వాహనం నుంచి బయటపడ్డారు. ఈ వీడియో క్లిప్ సోషల్ మీడియాలో వైరల్ అయ్యింది. రాజస్థాన్‌లోని గంగానగర్ జిల్లాలో ఈ సంఘటన జరిగింది. మార్చి 21న సూరత్‌గఢ్ సూపర్ థర్మల్ పవర్ ప్లాంట్‌లో



విధులు నిర్వహించే సీఐఎస్ఎఫ్‌కు చెందిన ముగ్గురు సిబ్బంది పెట్రోలింగ్ కోసం ఎస్‌యూవీలో బయలుదేరారు.కాగా, రైల్వే క్రాసింగ్ వద్ద మలుపు తిరిగిన ఆ వాహనం రైలు పట్టాల వద్దకు చేరుకున్నది. అక్కడ అది చిక్కుకుపోయింది. ఇంతలో అటుగా వచ్చిన రైలు ఆ ఎస్‌యూవీని ఢీకొట్టి కొంతదూరం ఈడ్చుకెళ్లింది.మరోవైపు ముందుగానే అప్రమత్తమైన సీఐఎస్ఎఫ్ సిబ్బంది ఆ వాహనం నుంచి దూకేశారు. దీంతో వారు ప్రాణాలతో బయటపడ్డారు. ఆ ప్రాంతంలోని సీసీటీవీలో రికార్డైన ఈ వీడియో క్లిప్ సోషల్ మీడియాలో వైరల్ అయ్యింది.

## స్టాలిన్ ఉచ్చులో కమలం విలవిల !



**చెన్నై- నవభూమి:** రాజకీయాలు అంటే అట్లాగే ఉంటాయి. ఉన్నది లేనట్లుగా లేనిది ఉన్నట్లుగా చేయడమే రాజకీయం. ఈ విద్యలో ఆరి తేరిన వారే అందలాలు అందుకుంటారు. ఇదిలా ఉంటే తమిళనాడు సీఎం ఎంకే స్టాలిన్ బీజేపీ మీద మోడీ ప్రభుత్వం మీద విమర్శలు చేస్తున్నారు అని ఇదంతా రాజకీయంగా మామూలే అని అనుకుంటున్నారు కానీ ఆయన ఏకంగా సౌత్ స్టేట్స్ లీడర్స్ ని ఒక చోట చేర్చి మోడీతో ఢీ కొడతారని అసలు ఊహించలేదు. ఏకంగా నలుగురు సీఎంలు స్టాలిన్ మీటింగ్ కి వచ్చారు. అదే విధంగా ఒక ఉప ముఖ్యమంత్రి. ఒక ప్రధాన రాష్ట్రంలో ప్రతిపక్ష నేతతో పాటు కీలక నేతలు అంతా హాజరయ్యారు. అలా వారిని అందరినీ చేర్చి దక్షిణాదికి బీజేపీ అన్యాయం చేస్తోంది అని ఎలుగెత్తిచాటారు స్టాలిన్.అంతటితో ఆయన ఊరుకోలేదు. హైదరాబాద్ లో రెండో విడత మీటింగ్ అన్నారు. ప్రజలలోకి ఈ ఇష్యూని తీసుకుని పోవడానికి బహిరంగ సభను కూడా నిర్వహిస్తామని స్పష్టం చేశారు. దాంతో దక్షిణాదిన బలపడడానికి కమలం పార్టీ గత కొన్నాళ్ళుగా చేస్తున్న ప్రయత్నాలకు విఘాతం కలుగుతుంది అన్న ఆందోళన అయితే బీజేపీలో మొదలైంది. ఏపీలో ఎన్డీయేను స్థాపించిన బీజేపీ క్రమంగా తెలంగాణా మీదుగా తమిళనాడులోనూ పట్టు సాధించాలని చూస్తోంది. అయితే స్టాలిన్ అండ్ కో ఇపుడు చాటి చెబుతున్నట్లుగా సీట్లూ నిధులు అధికారాలు అన్ని విషయాలలో దక్షిణాదికి తీరని అన్యాయం కేంద్రంలోని బీజేపీ చేస్తోంది అంటే అది జనంలోకి వెళ్తే ఇబ్బందే అని భావిస్తోంది. మరీ ముఖ్యంగా ఇవన్నీ సున్నితమైన అంశాలు. దాంతో బీజేపీ ఆలస్యంగా అయినా మేలుకుంది. స్టాలిన్ మీద గట్టిగా తగులుకుంటోంది. ఆయనది అవినీతి కుటుంబ పాలన అంటోంది. లిక్కర్ స్కాం అని అంటోంది. ఎన్నికల స్టంట్ అంటోంది లేని దానిని తెచ్చి ఇష్యూ చేశారని కేంద్ర మంత్రి కిషన్ రెడ్డి ఘాటుగా విమర్శించారు. దక్షిణాదికి కేంద్రం అన్యాయం చేయదని కూడా ఆయన స్పష్టం చేశారు. స్టాలిన్ లిక్కర్ స్కాం తమ రాష్ట్రంలో జరిగింది అన్న దానికి సమాధానం చెప్పాలని డిమాండ్ చేశారు. అదే విధంగా ఇతర కీలక నేతలు అంతా కూడా స్టాలిన్ మీద మండిపడుతున్నారు. స్టాలిన్ తన రాజకీయం కోసం బీజేపీని బదనాం చేస్తున్నారు అని కూడా ఫైర్ అవుతున్నారు. అయితే ఇండియా కూటమిలో ఇపుడు స్టాలిన్ ధీటైన నేతగా కనిపిస్తున్నారు. బీజేపీకి వ్యతిరేకంగా ఆయన దక్షిణాదిన కూటమిని కడుతున్నారు. దాంతో ఉత్తరాదిన తన ప్రాబల్యాన్ని నూరు శాతం విస్తరించుకున్న బీజేపీకి ఇక మిగిలింది దక్షిణాది మాత్రమే. అక్కడే ఆ పార్టీ ఆశలు మెండుగా ఉన్నాయి. పవన్ చరిష్మాతో చంద్రబాబు వంటి ఉద్ధండ నేత సహకారంతో బీజేపీని ఇంకా బలోపేతం చేసుకోవాలని ఆ పార్టీ చూస్తోంది. ఇపుడు బీజేపీ ఆశలకు విఘాతం కలిగేలా స్టాలిన్ మార్క్ పాలిటిక్స్ ఉండడంతో కమలనాధులకు మింగుడు పడడం లేదని అంటున్నారు. దక్షిణాదికి అన్యాయం చేయమని పదే పదే బీజేపీ పెద్దలు చెప్పుకోవాల్సిన అవసరం ఏర్పడుతోంది. అయితే డీలిమిటేషన్ ఏ విధంగా చేస్తారు అన్నది బీజేపీ ఇప్పటికే స్పష్టంగా చెప్పడం లేదని దక్షిణాది పార్టీల నేతలు అంటున్నారు. అదే సమయంలో జీఎస్టీ పన్నుల విషయంలో దక్షిణాది రాష్ట్రాలకు అన్యాయం జరిగిందా లేదా అని అంటున్నారు. ఈ రకమైన చర్చ కనుక మరింతగా ముదిరితే అసలుకే ఎసరు వస్తుంది అన్నది కమలానికి తెలుసు అంటున్నారు. అయితే బీజేపీ స్టాలిన్ మీద కానీ ఆ మీటింగుకు వెళ్ళి వచ్చిన వారి మీద కానీ విమర్శలు చేస్తే ఉపయోగం లేదని అంటున్నారు. బీజేపీ చేయాల్సింది ఏమైనా ఉంది అంటే సౌత్ కి అన్యాయం జరగకుండా తన చర్యల ద్వారానే ప్రజల విశ్వాసం పొందాలని అంటున్నారు.

## బోర్డర్‌లో ఏఐ రోబోలు.. ఏమేమి చేస్తాయంటే..?

**న్యూఢిల్లీ-నవభూమి:**అంతర్జాతీయ సరిహద్దుల వద్ద నిత్యం సైన్యం పహారా కాస్తుందనే సంగతి తెలిసిందే. అయితే... ఇకపై బోర్డర్ దగ్గర భద్రతను నిర్వహించడానికి అస్సాంలోని గువాహటి ఇండియన్ ఇనిస్టిట్యూట్ ఆఫ్ టెక్నాలజీ (ఐఐటీ) పరిశోధకులు అధునాతన రోబోలను అభివృద్ధి చేశారని అధికారులు తెలిపారు. ఈ రోబోలు ఏ స్థాయిలో పెర్ఫార్మ్ చేస్తాయనేది వెల్లడించారు. బోర్డర్ లో సెక్యూరిటీ కోసం అస్సాంలోని ఐఐటీ పరిశోధకులు అధునాతన రోబోలను అభివృద్ధి చేశారు. అత్యంత సవాళ్లతో కూడిన అంతర్జాతీయ సరిహద్దులను నిరంతరం పర్యవేక్షించడానికి ఈ ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్ (ఏఐ) ఆధారిత రోబోలు అద్భుతంగా పనిచేస్తాయని.. ఈ ఏఐ ఆధారిత నిఘాతో చాలా ప్రయోజనాలు ఉంటాయని తెలిపారు. భర్తపై భార్య పోలీసులకు ఫిర్యాదు! ఐఐటీలోని డీఏ స్పాటియో రోబోటిక్ లాబొరేటరీ ప్రైవేట్ లిమిటెడ్ అనే స్టార్టప్ అభివృద్ధి చేసిన ఈ రోబోలు రక్షణ పరిశోధన, అభివృద్ధి సంస్థ నుంచి గుర్తింపు పొందినట్లు తెలుస్తోంది. భారత సైన్యం ఇప్పటికే ఈ నిఘా వ్యవస్థ కోసం ఫీల్డ్ ట్రయల్స్ నిర్వహిస్తున్నట్లు అధికారులు తెలిపారు. ఈ సందర్భంగా స్పందించిన డీఏ స్పాటియో రోబోటిక్ లాబొరేటరీ ప్రైవేట్ లిమిటెడ్ సీఈఓ అర్నబ్ కుమార్ బర్మాన్... మాన్యువల్ పెట్రోలింగ్ పై ఆధారపడే సంప్రదాయ భద్రతా చర్యలకు భిన్నంగా ఈ రోబోలు స్వయంప్రతిపత్త వ్యవస్థను కలిగి ఉంటాయని అన్నారు. ఇవి అన్ని వాతవరణ పరిస్థితుల్లో సమర్థవంతంగా పనిచేస్తాయని తెలిపారు. అంతర్జాతీయ సరిహద్దుల్లో దుండగులు డ్రోన్లను పంపడం, చొరబాట్లకు ప్రయత్నించడం వంటివి చేసినప్పుడు ఈ రోబోల సెన్సార్లు వెంటనే గుర్తిస్తాయని.. అలర్ట్ చేస్తాయని అర్నబ్ కుమార్ తెలిపారు. నావిగేషన్, ఏఐ ఆధారిత నిఘాతో కూడిన ఈ వ్యవస్థ సరిహద్దు రక్షణ, కీలకమైన మౌలిక సదుపాయాల నిఘా విప్లవాత్మక మార్పు కానుందని అన్నారు. ఇదే సమయంలో... జాతీయ, అంతర్జాతీయ భద్రత విషయంలో ఎదురవుతున్న సవాళ్లను ఎదుర్కోవడానికి ఏఐ ఆధారిత అత్యాధునిక నిఘా పరికరాలను అభివృద్ధి చేయాలనేది తమ లక్ష్యమని పేర్కొన్నారు.

## దేవుడిగా చెప్పుకునే పాస్టర్.. ఒక వ్యక్తితోపాటు మహిళపై దాడి

**చండీగఢ్-నవభూమి:** తనను దేవుడిగా చెప్పుకునే పాస్టర్ తన సిబ్బందిపై దాడి చేశాడు. ఒక వ్యక్తితోపాటు మహిళపై పలు వస్తువులు విసిరేశాడు. వారి చెంపలపై కొట్టాడు. ఈ వీడియో క్లిప్ సోషల్ మీడియాలో వైరల్ అయ్యింది. పంజాబ్‌లోని జలంధర్‌లో ఈ సంఘటన జరిగింది. తనను తాను దైవంగా చెప్పుకునే పాస్టర్ బజిందర్ సింగ్ 'ది చర్చ్ ఆఫ్ గ్లోరీ అండ్ విజ్డమ్'కు నేతృత్వం వహిస్తున్నాడు. తనను తాను 'ప్రవక్త బజిందర్'గా పిలుచుకునేవాడు.కాగా, గత నెలలో బజిందర్ సింగ్ తన కార్యాలయంలో రెచ్చిపోయాడు. అక్కడున్న సిబ్బందిపై ఆగ్రహం వ్యక్తం చేశాడు. తొలుత ఒక వ్యక్తిపై పలు వస్తువులు విసిరేశాడు. ఆ తర్వాత అతడి వద్దకు వెళ్లి చెంపపై కొట్టాడు.మరోవైపు ఒక బాబుతో ఉన్న మహిళను బజిందర్ సింగ్ హెచ్చరించాడు. ఆమెతో దురుసుగా మాట్లాడాడు.

## ఫుడ్ వద్దు.. డ్రగ్స్ కావాలి.. ప్రియుడి సాయంతో నేవీ అధికారిని చంపిన భార్య జైల్లో డిమాండ్



**న్యూఢిల్లీ-నవభూమి:**మీరట్ మర్చంట్ నేవీ అధికారి సౌరభ్ రాజ్‌పుత్ హత్యోదంతం దేశవ్యాప్తంగా సంచలన రేపుతోంది. ఈ కేసులో రోజుకో కొత్త విషయాలు వెలుగుచూస్తున్నాయి. వివాహేతర సంబంధానికి అడ్డుగా ఉన్నాడని, ప్రియుడి సాయంతో భర్తను అతికిరాతకంగా హత్యచేసిన భార్య.. శవాన్ని 15 ముక్కలుగా కోసి డ్రమ్ములో వేసి సిమెంట్‌తో సీల్ చేసిన సంగతి తెలిసిందే. ప్రస్తుతం పోలీస్ కస్టడీలో ఉన్న నిందితురాలు ముస్కాన్, ఆమె ప్రియుడు సాహిల్‌కు సంబంధించి మరిన్ని విస్తుగొలిపే విషయాలను పోలీసులు వెల్లడించారు. డ్రగ్స్‌కు బానిసలుగా మారిన ఇద్దరూ.. జైల్లో ఆహారం తినకుండా తమకు గంజాయి, మత్తు ఇంజెక్షన్లు కావాలని అడుగుతున్నారని పేర్కొన్నారు. అరెస్టైనప్పటి నుంచి డ్రగ్స్ దొరక్కపోవడంతో విచిత్రంగా ప్రవర్తిస్తున్నారని చెప్పారు. తరచూ గంజాయి కోసం డిమాండ్ చేస్తున్నారని వివరించారు.జైలుకు వచ్చిన రోజు నుంచే నిందితుల ఆరోగ్యం క్రమంగా క్షీణించడం మొదలైందని అధికారులు తెలిపారు. దీంతో సాహిల్‌ను చికిత్స కోసం ఆస్పత్రికి తరలిస్తే.. అక్కడ నానా హంగామా చేసి.. గందరగోళం సృష్టించాడన్నారు. గంజాయి ఇవ్వాలని డిమాండ్ చేసినట్టు చెప్పారు. వారి మానసిక స్థితి సరిగా లేకపోవడం వల్ల తోటి ఖైదీలపై దాడి చేసే ప్రమాదం ఉండటంతో వేరుగా ఉంచినట్లు చెప్పారు. ముస్కాన్, ఆమె ప్రియుడు రోజూ డ్రగ్స్ ఇంజెక్షన్లు తీసుకున్నట్టు గుర్తించామని.. అవి లేకపోవడంతో పిచ్చిగా ప్రవర్తిస్తున్నారని పేర్కొన్నారు. సౌరభ్ హత్య సమయంలోనూ సాహిల్ డ్రగ్స్ మత్తులోనే ఉన్నట్లు భావిస్తారు. ఈ నేపథ్యంలో వారికి జైలులోని డీ అడిక్షన్ సెంటర్‌లో చికిత్స అందిస్తున్నట్లు తెలిపారు. ఉత్తర ప్రదేశ్ మీరట్‌కు చెందిన సౌరభ్ రాజ్‌పుత్ మర్చెంట్ నేవీలో పనిచేస్తూ.. 2016లోప్రేమించిన ముస్కాన్ రస్తోగిని వివాహం చేసుకున్నాడు. అయితే ఆమెతోనే ఎక్కువ సమయం గడపాలనే ఉద్దేశంలో ఉద్యోగాన్ని సైతం వదులుకున్నాడు. దీంతో ఇరు కుటుంబాల మధ్య గొడవలు వచ్చాయి. అది భరించలేకపోయిన సౌరభ్ తన భార్యను తీసుకుని అద్దె ఇంటికి వెళ్లిపోయాడు. భార్యను చాలా ప్రేమగా చూసుకున్నాడు. వీరి అన్యోన్య దాంపత్యానికి ప్రతీకగా 2019లో ఓ పాప కూడా పుట్టింది.తన భర్త స్నేహితుడు సాహిల్‌తో ముస్కాన్‌కు ఏర్పడిన పరిచయం వివాహేతర సంబంధానికి దారితీసింది. ఇది తెలిసిన సౌరభ్ భార్యకు విడాకులు ఇవ్వాలనుకున్నాడు. కానీ కుమార్తె జీవితం నాశనం అవ్వడం ఇష్టం లేక భార్యతోనే కలిసి ఉంటున్నాడు. ఈ క్రమంలో 2023లో మళ్లీ నేవీ ఉద్యోగంలో చేరాడు. దీంతో ముస్కాన్‌కు మరింత స్వేచ్ఛ దొరికింది. అయితే, తన కుమార్తె పుట్టిన రోజుకోసం భర్త రావడంతో అతడు అడ్డుగా ఉన్నాడని భావించింది. ప్రియుడితో కలిసి అతి దారుణంగా హత్య చేసి.. శవాన్ని ముక్కలుగా కోసి.. డ్రమ్ములో వేసి సీల్ చేసింది.

## అమెరికాలో కాల్పులు.. భారత్‌కు చెందిన తండ్రీకూతుళ్లు మృతి



**న్యూఢిల్లీ-నవభూమి:**అమెరికాలో దారుణం చోటుచేసుకుంది. డిపార్ట్‌మెంటల్ స్టోర్‌లో ఓ దుండగుడు జరిపిన కాల్పుల్లో భారత్‌కు చెందిన తండ్రీకూతుళ్లు ప్రాణాలు కోల్పోయారు. వర్జీనియాలో గురు వారం జరిగిన ఈ ఘటన ఆలస్యంగా వెలుగులోకి వచ్చింది. వర్జీనియాలోని అకోమాక్ కౌంటీలో డిపార్ట్‌మెంటల్ స్టోర్‌లోకి తుపాకితో చొరబడిన ఆగంతకుడు.. విచక్షణారహితంగా కాల్పులు జరిపినట్టు పోలీసులు తెలిపారు. దుకాణం తెరిచిన కొద్దిసేపటికే లోపలికి దూరిన నిందితుడు.. అక్కడ వర్కర్లపై కాల్పులకు పాల్పడ్డాడు. ఈ కాల్పుల్లో గుజరాత్‌కు చెందిన ప్రదీప్ పటేల్ (56), అతడి కుమార్తె ఊర్మి తీవ్రంగా గాయపడ్డారు. ప్రదీప్ ఘటనా స్థలిలోనే మృతిచెందాడని చెప్పారు. తీవ్రగాయాలతో ఆసుపత్రిలో చికిత్స పొందుతూ ఊర్మి చనిపోయినట్టు పేర్కొన్నారు. నిందితుడు ఫ్రేజర్ దేవన్ వార్టన్ (44)ను అదుపులోకి తీసుకున్నట్టు తెలిపారు.గురువారం ఉదయం మద్యం కొనేందుకు డిపార్ట్‌మెంటల్ స్టోర్‌కు వెళ్లిన నిందితుడు.. ముందురోజు రాత్రి ఎందుకు మూసేశారని ప్రశ్నించాడు. అనంతరం తన వెంట తెచ్చుకున్న తుపాకితో ప్రదీప్ పటేల్, ఊర్మిపై కాల్పులు జరిపాడు. గుజరాత్‌లోని మెహసనా జిల్లాకు చెందిన ప్రదీప్ పటేల్.. తన భార్య హన్స్‌బెన్, కుమార్తె ఊర్మితో కలిసి ఆరేళ్ల కిందట అమెరికాకు వెళ్లారు. అక్కడ తన బంధువులకు చెందిన డిపార్ట్‌మెంటల్ స్టోర్‌లో పనిచేస్తున్నారు.వారి బంధువు పరేశ్ పటేల్ స్థానిక మీడియాతో మాట్లాడుతూ.. 'మా సోదరుడి భార్య, ఆమె తండ్రి షాపులో పనులు చేసుకుంటుండగా ఒకరు వచ్చి కాల్పులు జరిపాడు.. ఏం జరిగిందో నాకు తెలియదు.. ' అని అన్నారు. హతుడు ప్రదీప్ పటేల్‌కు మరో ఇద్దరు కుమార్తెలు ఉన్నారని, వారిలో ఒకరు అహ్మదాబాద్, ఇంకొకరు కెనడాలో ఉన్నారని చెప్పారు.నిందితుడ్ని అదుపులోకి తీసుకున్న పోలీసులు.. అతడిపై ఫస్ట్-డిగ్రీ మర్డర్, ఆయుధ చట్టం సహా ఇతర సెక్షన్ల కింద కేసు నమోదుచేశారు. కాగా, ఈ ఘటన అమెరికాలోని భారతీయులను దిగ్భ్రాంతికి గురిచేసింది. కొద్ది నెలల కిందట నార్త్ కరోలినాలోని కన్వీనియస్ స్టోర్‌లో భారత సంతతికి చెందిన మైనాక్ పటేల్ (36)ను దోపిడీకి వచ్చిన ఓ దుండుగుడి చేతిలో ప్రాణాలు కోల్పోయిన విషయం తెలిసిందే.

## జడ్జి న్యాయమూర్తి నివాసంలో కాలిన నగదు వీడియో విడుదల

### ఆ డబ్బుతో తనకు సంబంధం లేదన్న ఢిల్లీ హైకోర్టు జడ్జి



**న్యూఢిల్లీ-నవభూమి:** ఢిల్లీ హైకోర్టు న్యాయమూర్తి యశ్వంత్ వర్మ అధికార నివాసంలో మార్చి 14న హోలీ రోజున జరిగిన అగ్నిప్రమాదంలో డబ్బుల మూటలు కాలినట్లు ఆరోపణలు వచ్చాయి. స్టోర్ రూమ్‌లో కాలిన డబ్బుకు సంబంధించిన ఫొటోలు, వీడియో క్లిప్‌ను శనివారం రాత్రి సుప్రీంకోర్టు విడుదల చేసింది. వీటితో పాటు సంబంధిత నివేదికను కూడా సుప్రీంకోర్టు వెబ్‌సైట్‌లో అందుబాటులో ఉంచింది. సుప్రీంకోర్టు ప్రధాన న్యాయమూర్తి సంజీవ్ ఖన్నా ఆధ్వర్యంలో ఈ సంఘటనపై అంతర్గత దర్యాప్తు జరుగుతున్నది. ఈ వివాదం నేపథ్యంలో జస్టిస్ యశ్వంత్ వర్మకు న్యాయపరమైన విధులు అప్పగించవద్దని ఢిల్లీ హైకోర్టు ప్రధాన న్యాయమూర్తి డీకే ఉపాధ్యాయను సుప్రీంకోర్టు ప్రధాన న్యాయమూర్తి ఆదేశించారు.కాగా, కాలిన డబ్బుతో తనకు ఎలాంటి సంబంధం లేదని ఢిల్లీ హైకోర్టు న్యాయమూర్తి యశ్వంత్ వర్మ స్పష్టం చేశారు. తనను కించపరిచేందుకు ఉద్దేశపూర్వకంగా జరిగిన కుట్రగా ఆయన ఆరోపించారు. కాలిన నగదు ఫొటోలు, వీడియో క్లిప్ ప్రామాణికతను ఆయన ప్రశ్నించారు. ప్రభుత్వం తనకు కేటాయించిన నివాసంలోని స్టాఫ్ క్వార్టర్స్‌కు సమీపంలో ఉన్న స్టోర్ రూమ్‌లో మంటలు చెలరేగాయని అన్నారు. పాత ఫర్నీచర్, గృహోపకరణాలు, తోట పనికి వినియోగించే వస్తువులు ఉంచే స్టోర్ రూమ్ అని తెలిపారు. తాళం వేయని ఈ స్టోర్ రూమ్‌కు తన నివాసానికి నేరుగా అనుసంధానం లేదని చెప్పారు.మరోవైపు తాను, తన భార్య మధ్యప్రదేశ్‌లోని భోపాల్‌కు వెళ్లినప్పుడు ఆ రోజు రాత్రి వేళ ఆ స్టోర్ రూమ్‌లో అగ్నిప్రమాదం జరిగిందని ఢిల్లీ హైకోర్టు న్యాయమూర్తి యశ్వంత్ వర్మ తెలిపారు. తన కుమార్తె, వృద్ధురాలైన తల్లి ఆ సమయంలో ఇంట్లో ఉన్నట్లు చెప్పారు. ఆ స్టోర్ రూమ్‌లో మంటలు చెలరేగడంతో తన కుమార్తె, ప్రైవేట్ సెక్రటరీ అగ్నిమాపక శాఖకు సమాచారం ఇచ్చినట్లు తెలిపారు. మంటలను ఆర్పినప్పుడు తన కుటుంబ సభ్యులు, సిబ్బంది దూరంగా ఉన్నారని చెప్పారు. ఆ సమయంలో అక్కడ ఎలాంటి నగదు కనిపించలేదని అన్నారు.కాగా, తాను గానీ, తన కుటుంబ సభ్యులు గానీ ఎప్పుడూ ఆ స్టోర్ రూమ్‌లో డబ్బులను నిల్వ చేయలేదని ఢిల్లీ హైకోర్టు న్యాయమూర్తి యశ్వంత్ వర్మ తెలిపారు. అలాగే కాలిన కరెన్సీ అవశేషాలు ఏవీ ఫైర్ సిబ్బంది తమకు చూపించలేదని చెప్పారు. ఒకవేళ అంత పెద్ద నగదును నిజంగా రికవరీ చేసి ఉంటే దాని గురించి తమకు ఎందుకు చెప్పలేదని ప్రశ్నించారు. తమ నివాసం నుంచి వేరుగా ఉన్న స్టోర్‌రూమ్‌లో డబ్బుల మూటలు కాలినట్లుగా వచ్చిన ఆరోపణలు నిరాధారమైనవి, అశాస్త్రీయమైనవి అని ఆయన ఖండించారు.

## భార్యా, ముగ్గురు పిల్లలపై బీజేపీ నేత కాల్పులు..



**న్యూఢిల్లీ-నవభూమి:**భార్య, ముగ్గురు పిల్లల్లపై ఓ బీజేపీ నేత దారుణంగా కాల్పులు జరిపాడు. ఆపై ఆయనే నేరుగా పోలీసులకు ఫోన్ చేసి కుటుంబ సభ్యులను కాల్చినట్లు వివరించాడు. షాకైన పోలీసులు హుటాహుటిన రంగంలోకి దిగారు. వారు వచ్చే సరికి ఓ కుమారుడు, కుమార్తె ప్రాణాలు కోల్పోగా.. భార్య, మరో కుమారుడు కొన ప్రాణాలతో కొట్టుమిట్టాడుతున్నారు. విషయం గుర్తించిన పోలీసులు వారిని వెంటనే ఆస్పత్రికి తరలించారు. ప్రస్తుతం చికిత్స పొందుతున్న వారి పరిస్థితి విషమంగా ఉన్నట్లు వైద్యులు చెబుతుండగా.. పోలీసులు బీజేపీ నేతను అదుపులోకి తీసుకున్నారు. ఆ పూర్తి వివరాలు మీకోసం.ఉత్తర ప్రదేశ్‌లోని సహారాన్ పూర్ జిల్లా సంగతేడ గ్రామానికి చెందిన బీజేపీ కార్యవర్గ సభ్యుడు యోగేష్ రోహిల్లా శనివారం రోజు దారుణానికి పాల్పడ్డారు. ఎవరూ ఊహించని విధంగా.. ఇంట్లోనే భార్యా, ముగ్గురు పిల్లలపై తుపాకీతో కాల్పులు జరిపారు. దీంతో వారంతా అక్కడికక్కడే కుప్పకూలిపోగా చనిపోయారని భావించిన అతడు పోలీసులకు ఫోన్ చేశాడు. భార్య, ముగ్గురు పిల్లలపై కాల్పులు జరిపానని వివరించాడు. యోగేష్ రోహిల్లా చెప్పిందంతా విని షాక్ అయిన పోలీసులు.. ఆయన ఇంటికి వెళ్తే అసలు విషయం తెలుస్తుంది కదా అని అక్కడకు వెళ్లారు. ఈక్రమంలోనే ఒక కుమారుడు, 11 ఏళ్ల వయసు కల్గిన కుమార్తె ప్రాణాలు కోల్పోయి కనిపించారు. వారిద్దరి మృతదేహాలు రక్తపు మడుగులో పడి ఉండగా... భార్య, మరో కుమారుడు కొన ప్రాణాలతో కొట్టుమిట్టాడుతున్నారు. దీంతో పోలీసులు వెంటనే వారిని ఆస్పత్రికి తరలించారు. అలాగే చనిపోయిన కుమార్తె, కుమారుడి మృతదేహాలను.. పోస్టుమార్టం నిమిత్తం స్థానిక ప్రభుత్వాసుపత్రికి పంపించారు. ఆపై యోగేష్ రోహిల్లాను అరెస్ట్ చేసి.. ఆయన కాల్పులు జరిపేందుకు ఉపయోగించిన తుపాకీని స్వాధీనం చేసుకున్నారు.

### 'రోజంతా నైటీ వేసుకోమంటున్నాడు'...

## భర్తపై భార్య పోలీసులకు ఫిర్యాదు!



**గుజరాత్-నవభూమి:**గుజరాత్ లోని అహ్మదాబాద్ లోగల జుహాపురాకు చెందిన 21 ఏళ్ల ఓ మహిళ.. తన భర్త, అత్తమామలు వేధింపులకు పాల్పడుతు న్నారని ఫిర్యాదు చేసింది. ఇంట్లో ఉన్నప్పుడు రోజంతా నైటీ ధరించాలని భర్త బలవంతం చేస్తున్నాడని.. తాను ఎప్పుడు పడుకోవాలో, ఎప్పుడు నిద్రలేవాలో ఆయనే డిసైడ్ చేస్తున్నారని ఫిర్యాదులో పేర్కొంది! 2023 మే నెలలో సౌదీ అరేబియాలో ఆ మహిళకు, ఓ డాక్టర్ కు వివాహం అయ్యింది. వివాహం తర్వాత ఆ మహిళ బాపునగర్ కు వెళ్లింది. అక్కడ భర్త, అత్తమామలతో నివసిస్తుంది! ఈ క్రమంలో తన భర్త డాక్టర్ అని, తాగుడుకు బాగా బానిసైపోయాడని, మాటలతో దూషించాడని ఆమె ఆరోపించింది. ఈ సమయంలో అత్తమామలకు అతని ప్రవర్తనపై ఫిర్యాదు చేస్తే... వారు కూడా అతనికే మద్దతు ఇచ్చి, మరింత దుర్భాషలాడటం ప్రారంభించారని ఆమె ఆరోపించారు. తాను ఎప్పుడు నిద్రపోవాలి, ఎప్పుడు లేవాలి అన్నీ ఆయనే నియంత్రిస్తున్నా డని.. ఆయన పడుకునే ముందు అతని కాళ్లకు మసాజ్ చేయాల్సి వస్తోందని కూడా ఆమె పేర్కొంది. ఈ క్రమంలో... గత ఏడాది మే నెలలో ఫ్యామిలీ అంతా కాశ్మీర్ కు వెళ్లి వచ్చిన తర్వాత పరిస్థితి మరింత దిగజారిందని.. ఆ ట్రిప్ తర్వాత తాను తన పుట్టింటికి తిరిగి వచ్చేసినట్లు తెలిపారు. ఈ సమయంలో మధ్యవర్తిత్వం కోసం ప్రయత్నించినప్పటికీ ఆమె భర్త రాజీకి ప్రయత్నించలేదని ఆమె ఆరోపించారు. దీంతో... తాజాగా ఆమె వెజల్పూర్ పోలీసులకు ఫిర్యాదు చేశారు. ఈ నేపథ్యంలో ఆమె చేసిన ఆరోపణలపై అధికారులు దర్యాప్తు చేస్తున్నారు. అయితే... ఆమె భర్త నుంచి కానీ, ఆ ఫ్యామిలీ మెంబర్స్ నుంచి కానీ ఎలాంటి ప్రకటనలు వెలువడలేదు!

## కూలిన 120 అడుగుల ఎత్తైన రథం.. ఒకరు మృతి, పలువురికి గాయాలు



**బెంగళూరు-నవభూమి:** ఊరేగింపు సందర్భంగా 120 అడుగుల ఎత్తైన రథం కూలింది. ఈ సంఘటనలో ఒకరు మరణించగా పలువురు గాయపడ్డారు. ఈ వీడియో క్లిప్ సోషల్ మీడియాలో వైరల్ అయ్యింది. కర్ణాటకలోని బెంగళూరు రూరల్ జిల్లాలో ఈ సంఘటన జరిగింది. అనేకల్‌లోని హుస్కూర్‌లో శనివారం మద్దురమ్మ జాతర జరిగింది. ఈ సందర్భంగా వంద అడుగులకుపైగా ఎత్తైన రెండు రథాలను ఆలయ నిర్వాహకులు తయారు చేయించారు.కాగా, ఊరేగింపు సందర్భంగా రెండు రథాలను తాళ్ల సహాయంతో భక్తులు లాగారు. అయితే ఈదురు గాలుల వల్ల120 అడుగుల ఎత్తైన రథం అదుపుతప్పి ఒక పక్కకు కూలిపోయింది. ఈ ప్రమాదంలో ఒక వ్యక్తి మరణించాడు. పలువులు గాయపడ్డారు. పలు వాహనాలు కూడా ధ్వంసమయ్యాయి.మరోవైపు పోలీసులు, అధికారులు సహాయక చర్యలు చేపట్టారు. గాయపడిన వారిని హాస్పిటల్‌కు తరలించి చికిత్స అందించారు. మృతుడ్ని తమిళనాడులోని హొసూర్‌కు చెందిన లోహిత్‌గా గుర్తించారు. ఎత్తైన రథం కూలిన సంఘటనపై పోలీసులు దర్యాప్తు చేస్తున్నారు. మరోవైపు ఈ వీడియో క్లిప్ సోషల్ మీడియాలో వైరల్ అయ్యింది.

## తాలిబాన్ నాయకుడికి స్వేచ్ఛ... ట్రంప్ సంచలన నిర్ణయం ఎందుకంటే..?



**అమెరికా-నవభూమి:**అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ ఇప్పటికే ఎన్నో సంచలన నిర్ణయాలు తీసుకొన్న సంగతి తెలిసిందే. ఇందులో కొన్ని ప్రపంచ దేశాలకు షాకిస్తే.. కొన్ని అమెరికా పౌరులకూ షాకిచ్చాయని చెబుతారు. ఈ సమయంలో తాలిబాన్ కీలక నాయకుడి విషయంలో అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ సంచలన నిర్ణయం తీసుకున్నాడు. అమెరికా అధ్యక్షుడిగా రెండోసారి బాధ్యతలు తీసుకున్న అనంతరం డొనాల్డ్ ట్రంప్ సంచలన నిర్ణయాలు తీసుకొంటున్న సంగతి తెలిసిందే. ఈ క్రమంలో.. ఆ జాబితాలో మరో నిర్ణయం చేరింది. ఇందులో భాగంగా... తాలిబాన్ కీలక నాయకుడికి ట్రంప్ స్వేచ్ఛను ప్రసాదించారు. గతంలో అతడిపై ప్రకటించిన క్యాష్ రివార్డును ఎత్తివేశారు. వివారాల్లోకి వెళ్తే... తాలిబాన్ కీలక నాయకుడు సిరాజుద్దీన్ హక్కానీపై గతంలో 10 మిలియన్ డాలర్ల బహుమతిని అమెరికా ప్రకటించింది. ఎవరైనా సరే అతడిని పట్టిచ్చినా.. లేదా, అతడు ఎక్కడున్నాడనే సమాచారాన్ని తెలియజేసినా ఈ రివార్డు దక్కించుకోవచ్చని తెలిపింది. అయితే... తాజాగా ఆ రివార్డును ట్రంప్ సర్కార్ ఎత్తేసింది. ఈ సందర్భంగా.. తమ చెరలో ఉన్న దేశస్తుడిని విడుదల చేసిన నేపథ్యంలో ట్రంప్ ఈ నిర్ణయం తీసుకున్నారు. ఈ విషయాన్ని ఆఫ్ఘనిస్తాన్ హోం మంత్రిత్వ శాఖ అధికార ప్రతినిధి అబ్దుల్ మతీన్ ఖనీ తెలిపారు.వాస్తవానికి 2008లో ఆఫ్ఘన్ రాజధాని కాబుల్ లోని సెరెనా హోటల్ లో అమెరికా పౌరుడు డేవిడ్ హెస్లాతో పాటు ఆరుమంది మృతికి హక్కానీ ప్రధాన సూత్రధారి. ఆ తర్వాత అతన్ని హిట్ లిస్ట్ లో చేర్చింది అమెరికా. ఈ నేపథ్యంలో.. రెండేళ్లుగా అమెరికా చెరలో మగుతున్న అమెరికా పౌరుడు జార్జ్ గ్లెజ్మాన్ ను రిలీజ్ చేసినట్లు ఆఫ్గన్ ప్రభుత్వం తెలిపింది. గత వారమే అతనికి విముక్తి కల్పించినట్లు పేర్కొంది. దీని తర్వాత సిరాజుద్దీన్ పై విధించిన నగదు బహుమతిని అమెరికా ఎత్తేసింది. ఈ చర్చలకు ఖతర్ మధ్యవర్తిత్వం వహించగా.. జార్జ్ ని విడిపించడానికి రంగంలోకి దిగిన ట్రంప్.. హక్కానీ విషయంలో ఈ కీలక నిర్ణయం తీసుకున్నారు.

## పేలిన ఏసీ కంప్రెసర్.. ఇద్దరు పిల్లలు, మహిళతో సహా నలుగురు మృతి


**చండీగఢ్-నవభూమి:**ఒక ఇంట్లో ఏసీ కంప్రెసర్ పేలింది. ఈ ప్రమాదంలో ఇద్దరు పిల్లలు, మహిళతో సహా నలుగురు మరణించారు. ఒక వ్యక్తి తీవ్రంగా గాయపడ్డాడు. పోలీసులు, ఫైర్ సిబ్బంది అక్కడకు చేరుకున్నారు. మంటలను ఆర్పివేశారు. హర్యానాలోని ఝజ్జర్ జిల్లాలో ఈ సంఘటన జరిగింది. బహదూర్‌గఢ్‌లోని అద్దె ఇంట్లో ఒక కుటుంబం నివసిస్తున్నది. శనివారం సాయంత్రం ఆ ఇంట్లో ఉన్న ఏసీ కంప్రెసర్ పేలింది. ఈ సంఘటనలో మహిళ, పదేళ్ల వయస్సున్న ఇద్దరు పిల్లలు, ఒక వ్యక్తి మరణించారు. మరో వ్యక్తికి కాలిన గాయాలయ్యాయి. ఈ పేలుడు శబ్దానికి స్థానికులు భయాందోళన చెందారు. వెంటనే పోలీసులు, ఫైర్ సిబ్బందికి సమాచారం ఇచ్చారు. కాగా, పోలీసులు, ఫైర్ సిబ్బంది సంఘటనా స్థలానికి చేరుకున్నారు. ఆ ఇంట్లో చెలరేగిన మంటలను ఆర్పివేశారు. మరణించిన నలుగురి మృతదేహాలను పోస్ట్‌మార్టం కోసం ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. గాయపడిన వ్యక్తిని కూడా హాస్పిటల్‌కు తరలించి చికిత్స అందిస్తున్నారు. ఈ సంఘటనపై పోలీసులు కేసు నమోదు చేశారు.

## అన్నామలైకి రాష్ట్రం కంటే పార్టీయే ఎక్కువా..?

**న్యూఢిల్లీ-నవభూమి:** నియోజవర్గాల పునర్విభజనపై తమిళనాడు సీఎం ఎంకే స్టాలిన్ అధ్యక్షతన జరిగిన జాయింట్ యాక్షన్ కమిటీ సమావేశంపై బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు అన్నామలై చేసిన వ్యాఖ్యలు వివాదాస్పదమయ్యాయి. అన్నామలై వ్యాఖ్యలపై కర్ణాటక ఉప ముఖ్యమంత్రి డీకే శివకుమార్ స్పందించారు. అన్నామలై రాష్ట్రానికి కాకుండా తన పార్టీకి విధేయుడిగా ఉన్నారని విమర్శించారు. ఆదివారం విలేకరులతో మాట్లాడుతూ ఆయన ఈ వ్యాఖ్యలు చేశారు. స్టాలిన్ నేతృత్వంలో జేఏసీ సమావేశం జరుగుతున్న సమయంలో పార్టీ నేతలతో కలిసి అన్నామలై నిరసన వ్యక్తం చేశారు. కేరళ, కర్ణాటక రాష్ట్రాలపై ఆరోపణలు చేశారు. నియోజకవర్గాల పునర్విభజనతో దక్షిణాది రాష్ట్రాలకు నష్టం జరుగుతుందంటూ అనవసర రాద్ధాంతం చేస్తున్నారని



విమర్శించారు. దాంతో అన్నామలైకి రాష్ట్ర విషయాల కంటే ప్రధాని మోదీ, హోంమంత్రి అమిత్‌షాలు ముఖ్యమని విమర్శించారు. శనివారం జేఏసీ సమావేశంలో స్టాలిన్ మాట్లాడుతూ.. దక్షిణాది రాష్ట్రాలకు పార్లమెంటు స్థానాలు తగ్గించడం ద్వారా రాష్ట్రాల ప్రాతినిధ్యాన్ని కుదించేందుకు అనుమతిస్తే.. మాతృదేశంలోనే రాజకీయ అధికారంలేని పౌరులుగా మారిపోతామని హెచ్చరించారు. తమ పోరాటం పునర్విభజనకు వ్యతిరేకం కాదని, న్యాయంగా నియోజకవర్గాల పునర్విభజన జరగాలని కోరుకుంటున్నామని చెప్పారు.



## నిధులు అక్కర్లేని హామీలైనా అమలు చేయరేం?

మార్చి 12 నుండీ 2025-26 సంవత్సరానికి బడ్జెట్ సమావేశాలు ప్రారంభమయ్యాయి. మార్చి 19న ఈ ఆర్థిక సంవత్సరానికి రాష్ట్ర బడ్జెట్ అసెంబ్లీలో ప్రవేశపెట్టాలని ప్రభుత్వం ఇప్పటికే నిర్ణయించింది. గత దశాబ్ద కాలంగా పాలన పేరుతో ఇప్పటి వరకూ నడుస్తున్న ట్రెండ్ ఏమిటంటే, రాష్ట్ర ముఖ్యమంత్రి మనసులో ఏ అంశాలకు ప్రాధాన్యత ఉందో అవే ప్రభుత్వ పాలనా ఎజెండాగా మారతాయి. ప్రభుత్వంపై రాజకీయ పట్టు కలిగిన కొందరు క్యాబినెట్ మంత్రుల ఆలోచనలు కూడా ప్రభుత్వ ఎజెండాలో ప్రవేశించవచ్చు. అంతే తప్ప పేద ప్రజల తక్షణ అవసరాలు, ఎన్నికల సందర్భంగా పార్టీ ప్రజల ముందు పెట్టిన మేనిఫెస్టో అంశాలు ప్రభుత్వ ఎజెండాలోకి రావు. గత అసెంబ్లీ ఎన్నికల సందర్భంగా కాంగ్రెస్ పార్టీ 'అభయ హస్తం' పేరుతో ఇచ్చిన ఎన్నికల మేనిఫెస్టోలో ఎన్నో అంశాల అమలుకు పెద్దగా బడ్జెట్ కేటాయింపులు కూడా అవసరం లేదు. కానీ ప్రభుత్వం ఏర్పడి పద్నాలుగు నెలలు దాటినా అవి ఇప్పటివరకూ చర్చకు కూడా రాలేదు. పౌర సమాజ ప్రతినిధులు కొన్ని అంశాలను చర్చకు పెట్టినా, అవి ఇంకా ఆచరణకు నోచుకోలేదు. మేనిఫెస్టో మొదటి అధ్యాయంలో ఇచ్చిన హామీ ఒకటి: "పౌర సేవల హక్కుల చట్టాన్ని తీసుకువచ్చి, ప్రజా ఫిర్యాదుల స్వీకరణ కొరకు ఒక సమగ్రమైన పోర్టల్‌ను ఏర్పాటు చేసి, ఫిర్యాదులను నిర్ణీత సమయంలో పారదర్శకంగా పరిష్కరిస్తాం. ప్రజా ఫిర్యాదుల కొరకు ఒక టోల్ ఫ్రీ నంబర్‌ను అందుబాటులోకి తీసుకువస్తాం". ఈ హామీ ఇప్పటి వరకూ అమలులోకి రాలేదు. రాష్ట్ర రాజధానిలో 'ప్రజావాణి' పేరుతో ఒక ప్రక్రియ నడుస్తున్నా, అది ఇంకా పూర్తి స్థాయిలో ప్రజలకు ఉపయోగపడేలా రూపొందలేదు. గ్రామ, మండల స్థాయిలో ఫిర్యాదుల స్వీకరణ, సమస్యల పరిష్కారం అంశంలో ఇప్పుడే పైలట్ ప్రాజెక్టు ఆదిలాబాద్ జిల్లాలో మొదలైంది. అనేక మంది పౌర సమాజ కార్యకర్తలు ఇందులో చురుకుగా పాల్గొంటున్నారు. ఈ జిల్లాలో వచ్చిన అనుభవాల నుండీ రాష్ట్ర స్థాయిలో 'ప్రజావాణి' వ్యవస్థను మెరుగుపరచాలన్నది ప్రభుత్వ ఆలోచన. ఈ ప్రక్రియ ఎంత సజావుగా ముందుకు వెళుతుందో ఇప్పుడే చెప్పలేం. మేనిఫెస్టోలో హామీ ఇచ్చినట్లుగా టోల్ ఫ్రీ నంబర్ అందుబాటులోకి తేవడం వల్ల ప్రజలు తమ బాధలు, సమస్యలు చెప్పుకునేందుకు ఒక వెసులుబాటు వస్తుంది. ప్రభుత్వం ఈ వైపు త్వరగా దృష్టి సారించాలి. దీనికి బడ్జెట్‌లో నిధుల ఖర్చు కూడా ఎక్కువ ఉండదు. ఆరు గ్యారంటీలలో మరో అంశం బడ్జెట్‌లో నిధుల కేటాయింపుతో సంబంధం లేకుండా అమలు చేయవచ్చు. వివిధ జిల్లాలలో, హైదరాబాద్ మహానగరంలో వేలాది ఎకరాల ప్రభుత్వ భూములు ఉన్నాయి. ఇదే సమయంలో రాష్ట్రంలో వేలాది పేద కుటుంబాలు కనీస ఇంటి స్థలం లేక ఇబ్బంది పడుతున్నాయి. ఆయా జిల్లాలలో పేదలు ఇంటి స్థలాల కోసం ఇప్పటికే దరఖాస్తు చేసుకుని ఎదురు చూస్తున్నారు. ఇంటి స్థలం ఉంటే కానీ, ప్రభుత్వం ఇందిరమ్మ గృహ నిర్మాణ పథకం క్రింద ఇల్లు మంజూరు చేయదు. కాబట్టి ప్రభుత్వం తక్షణమే పూనుకుని, ఆయా జిల్లాలలో ఉన్న ప్రభుత్వ భూముల నుండీ కొంత భాగాన్ని, ముందుగా స్థానికంగా దరఖాస్తు చేసుకున్న అర్హులైన పేద కుటుంబాలకు ఇంటి స్థలంగా కేటాయించాలి. రెవెన్యూ, గ్రామ పంచాయితీ, మున్సిపల్ శాఖల సమన్వయంతో ఈ పని పూర్తిచేయవచ్చు. ప్రస్తుతం దీనికి బడ్జెట్ నుండీ నిధుల కేటాయింపు అవసరం లేదు. స్థలాల కేటాయింపు పూర్తయ్యాక అక్కడ ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణం ప్రారంభించవచ్చు. పారిశ్రామికాభివృద్ధి పేరుతో రైతుల నుండీ వందల ఎకరాల భూమి లాక్కుని పారిశ్రామిక వేత్తలకు కట్టబెట్టడానికి పరుగులు పెడుతున్న ప్రభుత్వం పేద కుటుంబాలకు ఇళ్ల స్థలం ఇవ్వడానికి కూడా అదే వేగంతో పనిచేయాలి. కాంగ్రెస్ పార్టీ వరంగల్ డిక్లరేషన్‌లో హామీ ఇచ్చినట్లుగా%-% లాభసాటి వ్యవసాయమే లక్ష్యంగా తెలంగాణ వాతావరణ పరిస్థితులకు అనువుగా, నూతన వ్యవసాయ విధానం, పంటల ప్రణాళిక వెంటనే తయారు చేయవచ్చు. వ్యవసాయ, ఉద్యాన, పశు సంవర్ధక, మత్స్య, మార్కెటింగ్ శాఖలకు, రాష్ట్రంలో వ్యవసాయ, అనుబంధ రంగాల యూనివర్సిటీలకు ఉమ్మడిగా ఈ బాధ్యత అప్పగించవచ్చు. అగ్రికల్చర్ యూనివర్సిటీని ఇందుకు నోడల్ ఏజెన్సీగా పెట్టవచ్చు. ఈ సంస్థలు, రైతు సంఘాలు, రైతు సహకార సంఘాల భాగస్వామ్యంతో రూపొందించే నివేదికలను వచ్చే ఖరీఫ్ నుండీ అమలు చేయవచ్చు. దీనికి బడ్జెట్‌లో తక్షణమే నిధుల కేటాయింపు అవసరం లేదు. హైదరాబాద్ యూత్ డిక్లరేషన్‌లో నిరుద్యోగ నిర్మూలన అంశం క్రింద "ప్రభుత్వ రాయితీలు పొందిన ప్రైవేట్ కంపెనీలలో తెలంగాణ యువతకు 75శాతం రిజర్వేషన్ కల్పన" అనే హామీ ఉంది. ఇది మంచి హామీ. కానీ ఆచరణలోకి రాలేదు. గత ఏడాదిగా రాష్ట్రంలోకి తరలివస్తున్న పరిశ్రమల గురించి రోజూ ముఖ్యమంత్రి, మంత్రులు అట్టహాసంగా ప్రకటిస్తున్నారు కానీ, వస్తున్న ప్రైవేట్ పెట్టుబడిదారులు స్థానికంగా యువతకు ఉద్యోగాలు కల్పిస్తున్నారా లేదా అనేది చూడడం లేదు. చేవెళ్ల ఎస్.సి. ఎస్.టి డిక్లరేషన్‌లో 5వ అంశంగా ఒక హామీ ఉంది: "బీఆర్ఎస్ ప్రభుత్వం గుంజుకున్న ఎస్సీ, ఎస్టీల అసైన్డ్ భూములను తిరిగి అసైనీలకే అన్ని హక్కులతో పునరుద్ధరిస్తాం. ప్రజా ప్రయోజనార్థం భూసేకరణ చట్టం 2013 ప్రకారం భూములను సేకరించినప్పుడు, అసైన్డ్ భూములకు పట్టా భూములతో సమానంగా పరిహారం అందిస్తాం". నిజానికి ఇవి విప్లవాత్మక హామీలు. గత ఏడాదిగా వీటిని అమలు చేసి ఉంటే గ్రామీణ ప్రాంతాలలో కాంగ్రెస్ పార్టీకి మంచి ఆదరణ లభించేది. ముఖ్యంగా బీఆర్ఎస్ ప్రభుత్వం గుంజుకున్న అసైన్డ్ భూములను ఆయా కుటుంబాలకు వెనక్కు ఇవ్వడం అద్భుతమైన ప్రతిపాదన. ఇప్పటికైనా రాష్ట్ర ప్రభుత్వం అందుకు పూనుకోవాలి. ఈ అంశంలో ఇచ్చిన రెండవ హామీ కూడా ముఖ్యమైనదే. ప్రస్తుత కాంగ్రెస్ ప్రభుత్వం ఈ హామీని మర్చిపోయి, 2013 చట్టం ప్రకారం కాకుండా, కేసీఆర్ తెచ్చిన అన్యాయమైన 2017 భూసేకరణ చట్టం ప్రకారం ఆయా జిల్లాలలో భూములను సేకరించడానికి నోటిఫికేషన్లు ఇస్తున్నది. అవసరమైన, అనివార్య స్థితిలో మాత్రమే 2013 భూ సేకరణ చట్టం ప్రకారం నోటిఫికేషన్లు ఇచ్చి ప్రజాభిప్రాయ సేకరణ చేపట్టాలి. మేనిఫెస్టోలో మద్యపాన విధానం అంశం క్రింద "బెల్టు షాపులను రద్దు చేస్తాం. మత్తు బానిసలకు ప్రతి జిల్లా ఆసుపత్రిలోనూ పునరావాస కేంద్రాలు ఏర్పాటు చేస్తాం" అని ఇచ్చిన హామీలను కూడా ప్రభుత్వం మర్చిపోయింది. ప్రభుత్వం చిత్తశుద్ధితో ఈ హామీలను అమలు చేస్తే బెల్టు షాపులు నాశనమై మద్యం అమ్మకాలు తగ్గి ప్రభుత్వానికి కొంత ఎక్సైజ్ పన్ను ఆదాయం తగ్గవచ్చు. కానీ రాష్ట్రంలో లక్షలాది కుటుంబాలు ఆర్థికంగా కోలుకుంటాయి. నిజానికి ఈ హామీలను అమలు చేయడానికి బడ్జెట్‌లో ప్రత్యేక నిధుల కేటాయింపు అవసరం లేదు.

# 'క్షయ' క్షయం అయ్యేదెప్పటికి?




క్షయ ప్రపంచవ్యాప్తంగా లక్షలాది మందిని నాశనం చేస్తూ తీవ్రమైన ఆరోగ్య, సామాజిక, ఆర్థిక నష్టాలను కలిగిస్తోంది. డాక్టర్ రాబర్ట్ కోచ్ అనే శాస్త్రవేత్త 24 మార్చ్ 1882లో క్షయ వ్యాధికి కారణమయ్యే బాక్టీరియంను కనుగొని ప్రకటించిన రోజును పురస్కరించుకొని మార్చ్ 24వ తేదిని ప్రపంచ క్షయ వ్యాధి దినోత్సవంగా ప్రతీ సంవత్సరం ఒక్కో థీమ్ తో ప్రపంచ వ్యాప్తంగా జరుపుకుంటారు. ' అవును! మనం క్షయని అంతం చేయగలం! ' అనేది ఈ సంవత్సరం థీమ్. ఇది క్షయని అంతం చేయడానికి స్థానిక, జాతీయ, అంతర్జాతీయ స్థాయిలో కొనసాగుతున్న ప్రయత్నాలను ప్రతిబింబించడానికి బలమైన నిబద్ధతను ప్రోత్సహించడానికి అవకాశాన్ని అందిస్తుంది. ప్రస్తుత భౌగోళిక రాజకీయ వాతావరణంలో అంతర్జాతీయ నిధులు తగ్గడం మూలాన 2030 నాటికి దీనిని అంతం చేయాలనే ప్రపంచ లక్ష్యాల సాధనకు ముప్పు కలిగిస్తుంది కాబట్టి బలమైన నిబద్ధత చాలా కీలకం.

**వ్యాధి సోకే తీరు:**

క్షయ వ్యాధి మైకోబాక్టీరియం ట్యూబర్క్యులోసిస్ అనే బ్యాక్టీరియ వల్ల వస్తుంది. ఇది తరచుగా ఊపిరితిత్తులను ప్రభావితం చేస్తుంది. ఊపిరితిత్తుల క్షయ ఉన్న వ్యక్తి దగ్గినప్పుడు, తుమ్మినప్పుడు, ఉమ్మివేసినప్పుడు ఆరోగ్యకరమైన వ్యక్తికి సోకుతుంది. ఇది గాలి ద్వారా వ్యాపిస్తుంది. ఇన్ఫెక్షన్ సోకడానికి వ్యాధి కారక సూక్ష్మక్రిములను మాత్రమే పీల్చాలి. ఇది ఊపిరితిత్తులకు సంబంధించినదైనా చర్మము నుండి మెదడు వరకు శరీరంలో ఏ భాగానికైనా ఈవ్యాధి వచ్చే అవకాశం ఉంది. క్షయవ్యాధి సోకని శరీరావయవాలు క్లోమము, థైరాయిడ్ గ్రంథి, జుట్టు.

**నివారణ:**

2035 నాటికి ప్రపంచవ్యాప్తంగా క్షయ మహమ్మారిని అంతం చేయాలనే లక్ష్యంతో 2014 నుండి ప్రపంచ ఆరోగ్య సంస్థ ప్రయత్నిస్తుంది. 2015తో పోలిస్తే




మరణాల సంఖ్యను 2035 నాటికి 95% తగ్గించడం, 2015తో పోలిస్తే క్షయ సంభవం రేటులో 2035 నాటికి 90% తగ్గింపు, 2035 నాటికి వ్యాధి కారణంగా విపత్కర ఖర్చులను ఎదుర్కొంటున్న ప్రభావిత కుటుంబాలు జీరోకి తగ్గించే లక్ష్యంగా ఈ సంస్థ పెట్టుకుంది. వ్యాధి నివారణకు అధిక ప్రమాదం ఉన్నవారిని పరీక్షించడం, కేసులను ముందస్తుగా గుర్తించడం, చికిత్స చేయడం బాసిల్లస్ కాల్మెట్-గ్యురిన్ (బిసిజి) టీకాలు వేయడం వంటివి ఉంటాయి. వ్యాధి చికిత్సకు చాలా కాలం పాటు బహుళ యాంటీబయాటిక్స్ ఉపయోగించడం అవసరం.

**ప్రపంచ పరిస్థితి:**

ప్రతి సంవత్సరం సుమారు ఒక కోటి మంది ప్రజలు క్షయవ్యాధి బారిన పడుతున్నారు. 15 లక్షలు మంది మరణిస్తున్నారు. ఇది ప్రపంచంలోని అంటు వ్యాధులతో మరణించే జబ్బులలో అగ్ర స్థానంలో ఉంది. ఈ వ్యాధి ఎక్కువగా మధ్య ఆదాయ దేశాలలో కనిపిస్తుంది. భారతదేశం 26%, ఇండోనేషియా 10%, చైనా 6.8%, ఫిలిప్పీన్స్ 6.8%, పాకిస్తాన్ 6.3% క్షయలో వాటాను కలిగి ఉన్నాయి. ప్రపంచ క్షయ భారంలో 56శాతం ఈ ఐదు దేశాలలో ఉండడం గమనార్హం. ప్రపంచ ఆరోగ్య సంస్థ గ్లోబల్ క్షయ నివేదిక 2024 ప్రకారం 192 దేశాలలో 2023లో 82 లక్షల మంది ప్రజలు క్షయతో బాధపడుతున్నారు. 2022లో వీరి సంఖ్య 75 లక్షలుగా ఉంది. 1995 నుండి ఇప్పటి వరకు నమోదైన గణాంకాలలో ఇదే అత్యధికం. 2023లో 12 లక్షల 50 వేల మరణాలు నమోదు అయ్యాయని అంచనా వేయబడింది. ఇది 2022లో 13 లక్షల 20 వేల కంటే కొంచెం తక్కువగా ఉంది. సంవత్సరానికి లక్ష జనాభాకు నమోదైన కొత్త కేసులును సంభవం రేటు అంటారు. ఈ రేటు 2020 నుండి 2022 మధ్య 3.9% పెరిగింది. వ్యాధి వచ్చిన వారిలో 55 శాతం మంది పురుషులు, 33 శాతం మంది మహిళలు,12 శాతం మంది పిల్లలు, యువకులు ఉన్నారు. కొత్త కేసులు ఐదు ప్రధాన ప్రమాద కారకాల వల్ల సంభవిస్తున్నాయి. అవి పోషకాహార లోపం, హెచ్ఐవి ఇన్ఫెక్షన్, మద్యపాన రుగ్మతలు, ధూమపానం, మధుమేహం.

**మనదేశ పరిస్థితి:**

2023 లో భారతదేశంలో 27 లక్షల క్షయ కేసులు నమోదయ్యాయని అంచనా. అందులో 25.1 లక్షల మందికి వ్యాధి నిర్ధారణ అయి చికిత్స ప్రారంభించారు. మన దేశంలో ఈ వ్యాధి కేసులు 2015లో లక్ష జనాభాకు 237 కేసుల నుండి 2023లో 195 కి తగ్గింది. ఇది ఈ కాలంలో 17.7% తగ్గుదలను ప్రతిబింబిస్తుంది. 2015లో 72% చికిత్స కవరేజ్ 2023లో 89% కి పెరిగింది. నిర్ధారణ కాని లేదా చికిత్స చేయని కేసుల అంతరాన్ని గణనీయంగా తగ్గింది.

జాతీయ కార్యక్రమాలు:

సెప్టెంబర్ 2022లో కేంద్రం ప్రారంభించిన ముక్త్ భారత్ అభియాన్ క్షయవ్యాధికి వ్యతిరేకంగా పోరాటంలో సమాజ ప్రమేయం, యాజమాన్యాన్ని బలోపేతం చేయడంలో కీలకమైన అడుగు పడింది. భారత ప్రభుత్వం చూపిన బలమైన రాజకీయ నిబద్ధతకు అనుగుణంగా జాతీయ క్షయవ్యాధి నిర్మూలన కార్యక్రమం (ఎంటీఇపి) క్షయ నిర్మూలన కోసం జాతీయ వ్యూహాత్మక ప్రణాళిక (ఎన్ఎస్పి)ను అమలు చేస్తోంది. లక్ష్యాలు, విజయాల మధ్య ఎన్ఎస్పి అంతరాన్ని తగ్గించడంలో 2017 నుండి 2025 మధ్యలో గణనీయమైన పురోగతిని సాధించింది. క్షయ నిర్మూలన దిశగా పోరాటంలో వేగాన్ని నిలబెట్టడానికి రాబోయే సంవత్సరాల్లో వివిధ రకాల జోక్యాలను అమలు చేస్తున్నారు. వాటిలో కొన్నింటిని చూస్తే

వయోజన బిసిజి టీకాపై అధ్యయనాలు నిర్వహించడం, కొత్త, తక్కువ చికిత్సా విధానాలతో సహా క్షయ నివారణ చికిత్స ను విస్తరించి వేగంగా పెంచడం, సమగ్ర రికార్డింగ్, రిపోర్టింగ్ విధానాలతో పాటు క్షయ ఉన్నట్లు అనుమానించబడిన అందరి వ్యక్తులకు మాలిక్యులర్ డయాగ్నస్టిక్ పరీక్షకు ప్రాప్యతను పెంచడం, "ఆయుష్మాన్ ఆరోగ్య మందిర్లకు" క్షయ సేవలను వికేంద్రీకరించడం లాంటివి ఉన్నాయి. కోవిడ్ 19 మహమ్మారి తరువాత మనదేశం ఎంటీఇపి ద్వారా క్షయ నిర్మూలనకు తన ప్రయత్నాలను ముమ్మరం చేసింది. ఇది జాతీయ వ్యూహాత్మక ప్రణాళిక 2017%-%25తో అనుసంధానించబడిన ఎన్ఎస్పి కార్యక్రమం. 2023లో కీలక విజయాలలో దాదాపు 1.89 కోట్ల కఫం స్మెర్ పరీక్షలు, 68.3 లక్షల న్యూక్లియిక్ యాసిడ్ యాంప్లిఫికేషన్ పరీక్షలు ఉన్నాయి. ఇవి అన్ని ఆరోగ్య సంరక్షణ స్థాయిలలో రోగ నిర్ధారణకు ప్రాప్యతను విస్తరించడానికి ప్రోగ్రామ్ యొక్క నిబద్ధతను ప్రతిబింబిస్తాయి. ని-క్షయ్ పోషణ్ యోజన కింద ప్రత్యక్ష ప్రయోజన బదిలీ ద్వారా దాదాపు 1 కోటి మంది లబ్ధిదారులకు దాదాపు రూ. 2,781 కోట్లు పంపిణీ చేయడం ద్వారా క్షయ రోగులకు ఆర్థిక సహాయం అందింది . చికిత్స మద్దతుదారులు, ఆశా వర్కర్లు ఈ కార్యక్రమాన్ని ప్రజల్లోకి తీసుకు వెళ్తున్నారు.

**తీసుకోవలసిన జాగ్రత్తలు:**

చేతులను శుభ్రంగా, తరచుగా కడగాలి. దగ్గినప్పుడు మోచేయి నోటిని రుమాలతో కప్పుపోవాలి.

వ్యాధి ఉన్న వ్యక్తులతో సన్నిహిత సంబంధాలకు దూరంగా ఉండాలి. వ్యాధికి వైద్యుడు సూచించిన మందులన్నింటినీ సరిగ్గా తీసుకోవాలి.

**సానుకూల ఫలితాలు:**

మనదేశం సమగ్ర క్షయ నిర్మూలన విధానం సానుకూల ఫలితాలను చూపుతోంది. వివిధ రంగాల భాగస్వామ్యాలు, వినూత్న సంరక్షణ పరిష్కారాలు, సమాజ నిరంతర ప్రాధాన్యతతో 2025 నాటికి క్షయ రహిత దేశంగా మారే లక్ష్యాన్ని చేరుకోవడానికి మంచి పురోగతి ఉంది. ఈ పురోగతి ప్రపంచ ఆరోగ్య చొరవలకు దేశం యొక్క నిబద్ధతను, జాతీయ స్థాయిలో ఈ వ్యాధిని ఎదుర్కోవడంలో సహకార, వినూత్న రోగి కేంద్రీకృత ఆరోగ్య సంరక్షణ వ్యూహాల శక్తిని నొక్కి చెబుతుంది.

**-జనక మోహన రావు దుంగ**
**8247045230**

# వాతావరణ హెచ్చరికలో దేశాల మధ్య అంతరాలను మూసేద్దాం



మన దేశంలో చూస్తే గోవా, మహారాష్ట్రలో ఫిబ్రవరిలో మొట్ట మొదటి వడగాలులను నమోదు చేశాయి, భారత వాతావరణ శాఖ ప్రకారం శీతాకాలంలో (జనవరి-ఫిబ్రవరి) మొదటిసారి వడగాలులు సంభవించాయి. మార్చి 15, 2025న ఒడిశాలోని బౌధ్ భారతదేశంలో అత్యధిక ఉష్ణోగ్రతను నమోదు చేసింది. తీవ్రమైన వేడి కొనసాగింది, మార్చి 16న బౌధ్ 43.6 డిగ్రీల సెల్సియస్, ఝార్సుగూడ 42 డిగ్రీలు, బోలంగీర్ 41.7 డిగ్రీల సెల్సియస్ నమోదైంది. ఇక 2025 సంవత్సరంలో ప్రపంచ వ్యాప్తంగా భూమిపై మంచు తుఫానులు , చల్లని గాలులు , కరువులు , వేడి తరంగాలు , అడవి మంటలు , వరదలు , సుడిగాలులు, ఉష్ణమండల తుఫానులు వంటి అనేక వాతావరణ సంఘటనలు గణనీయమైన ప్రభావాన్ని చూపాయి. వాతావరణం అనేది ప్రపంచవ్యాప్తంగా ప్రజల జీవితాలు, ఆర్థిక వ్యవస్థలు, పర్యావరణ వ్యవస్థలను నేరుగా ప్రభావితం చేస్తుంది. మన వాతావరణంలో మార్పులు మరింత తీవ్రమైన వాతావరణ సంఘటనలకు దారితీస్తున్నాయి. వేగంగా తీవ్రతరం అవుతున్న ఉష్ణమండల తుఫానులు, వినాశకరమైన వర్షపాతం, తుఫానులు, వరదలు, ప్రాణాంతక కరువులు, అడవి మంటలు అధికమవుతున్నాయి. సముద్ర మట్టాలు పెరుగుతున్నాయి. జనసాంద్రత కలిగిన తీర ప్రాంతాలు తీరప్రాంత ఉప్పెన, సముద్ర అలల ప్రభావాలకు గురవుతున్నాయి.

**ముఖ్య పాత్ర పోషిస్తున్న డబ్ల్యుఎంఒ:**

ప్రపంచ వాతావరణ దినోత్సవం ప్రతి సంవత్సరం మార్చి 23న నిర్వహించబడుతుంది. వాతావరణంలో చోటు చేసుకుంటున్న మార్పులకు సంబంధించి వాతావరణంపై అధ్యయనం చేసేందుకు 1950 మార్చి 23న, 180 దేశాల సభ్యత్వంతో ప్రపంచ వాతావరణ సంస్థ ప్రారంభించబడింది. 75 సంవత్సరాలకు పైగా డబ్ల్యుఎంఒ వాతావరణ వ్యవస్థ శాస్త్రంలో ప్రపంచంలో ముఖ్య పాత్రను పోషిస్తుంది. ఆ సంస్థ ఏర్పడిన రోజును ప్రపంచ వాతావరణ దినోత్సవంగా నిర్ణయించబడింది. ఐక్యరాజ్య సమితి ఆధ్వర్యంలో ప్రతి సంవత్సరం ఈ దినోత్సవం జరుపబడుతుంది. ప్రకృతి సహజ ఆవసాలపై వాతావరణ మార్పులు చూపే ప్రభావం గురించి ప్రజలకు అవగాహన కలిగించడంకోసం ఈ దినోత్సవ ఉద్దేశ్యం. వాతావరణ నమూనాలను అంచనా వేయడంలో, వాతావరణ మార్పులను పర్యవేక్షించడంలోను, ప్రకృతి వైపరీత్యాలకు సిద్ధం చేయడంలోను, వాతావరణశాస్త్ర కీలక పాత్రను ఈ రోజు నొక్కి చెబుతుంది. వాతావరణ మార్పులు, విపరీతమైన వాతావరణ సంఘటనలు, పెరుగుతున్న సముద్ర మట్టాలు వంటి ప్రపంచ సవాళ్లను పరిష్కరించడంలోనూ వాతావరణ శాస్త్రం ఉపయోగపడుతుంది.

**ముందస్తు హెచ్చరిక వ్యవస్థ:**

2024 అత్యంత వేడి సంవత్సరం అని డబ్ల్యుఎంఒ ఇటీవల నిర్ధారించింది. సంక్లిష్ట పరస్పర చర్యలను అర్థం చేసుకోవడం, అంచనా వేయడం కోసం ప్రభావవంతమైన ముందస్తు హెచ్చరిక వ్యవస్థలను ఏర్పాటుచేసుకోవడం చాలా అవసరం. వాతావరణ హెచ్చరిక కేంద్రాల ఖచ్చితమైన వాతావరణ సూచన, ముందస్తు హెచ్చరిక వ్యవస్థలు ప్రజలను అప్రమత్తం చేస్తాయి. ఇది వారి జీవనోపాధి అల్లకల్లోలం కాకుండా కాపాడుతుంది. మానవ ప్రేరిత వాతావరణ మార్పు మరింత తీవ్రమైన వాతావరణ పరిస్థితులకు దారితీస్తున్నందున, ప్రభావవంతమైన బహుళ ప్రమాద ముందస్తు హెచ్చరిక వ్యవస్థల అవసరం గతంలో కంటే చాలా ముఖ్యమైనది. రాబోయే తుఫానులు, వరదలు లేదా కరువుల గురించి ప్రజలను హెచ్చరించే, సహాయక చర్యలను అందించే వ్యవస్థలు విలాసవంతమైనవి కావు. కానీ జీవితాలను రక్షించే, ఆర్థిక నష్టాలను తగ్గించే, పెట్టుబడిపై దాదాపు పది రెట్లు రాబడిని అందించే ఖర్చుతో కూడుకున్న సాధనాలు. ముందస్తు హెచ్చరికల వలన ఈ సమస్యలను పూర్తిగా పరిష్కరించలేకపోయినా చాలా వరకూ నష్టాన్ని నివారించవచ్చు. ముందస్తు హెచ్చరిక వ్యవస్థలు ఇప్పటికే మరణాల సంఖ్యను తగ్గించడంలో సహాయపడ్డాయి. ప్రమాదకర వాతావరణం, నీరు లేదా వాతావరణ సంఘటనల వల్ల కలిగే నష్టాలను తగ్గించాయి.

**అంతరాలు మూసేయాలి:**

వాతావరణ ప్రమాదాలు పెరుగుతున్న కొద్దీ వీటి ఆవశ్యకత పెరుగుతూనే ఉంది. అయితే అత్యాధునిక సాంకేతికతతో ముందస్తు హెచ్చరిక వ్యవస్థలు ఏర్పాటు చేయాలంటే ప్రపంచంలో కొన్ని దేశాలకు మాత్రమే సాధ్యం అవుతుంది. అల్ప ఆదాయ దేశాలు ఈ వ్యవస్థలు నిర్మించుకోలేవు. ఇది ప్రపంచ దేశాల మధ్య అంతరాలను సృష్టిస్తుంది. కానీ అన్ని దేశాల ప్రజల ప్రాణాలను కాపాడటం, జీవనోపాధిని రక్షించడం, సమాజ స్థితిస్థాపకతను బలోపేతం చేయడం లాంటివి అన్ని దేశాల ఉమ్మడి బాధ్యత. దీని కొరకై ఈ అంతరాలను తగ్గించడం లేదా మూసివేయవలసిన అవసరం ఎంతైనా ఉంది. అందువలన ఏడాది ఇతివృత్తంగా "ముందస్తు హెచ్చరిక అంతరాన్ని కలిసి మూసివేయడం"గా తీసుకోవడం జరిగింది. ముందస్తు హెచ్చరిక వ్యవస్థలను పెంపొందించడంలో ప్రపంచ సహకార ప్రాముఖ్యతను ఈ థీమ్ నొక్కి చెబుతుంది. ముందస్తు హెచ్చరిక అంతరాన్ని కలిసి తగ్గించడం ద్వారా, మనం సురక్షితమైన, మరింత స్థితిస్థాపకంగా ఉండే ప్రపంచాన్ని నిర్మించగలము.

**ఎంహెచ్ఇడబ్ల్యూఎస్ 2024 నివేదిక:**

బహుళ ప్రమాద ముందస్తు హెచ్చరిక వ్యవస్థల ప్రపంచ స్థితి ( గ్లోబల్ స్టేటస్ ఆఫ్ మల్టీ హజార్డ్ ఎర్లీ వార్నింగ్ సిస్టమ్స్- ఎంహెచ్ఇడబ్ల్యూఎస్) 2024 నివేదిక ప్రకారం 2015 నుండి ప్రపంచం అత్యధిక స్థాయిలో ముందస్తు హెచ్చరిక కవరేజీని నివేదించింది. తక్కువ సమగ్రమైన ఎంహెచ్ఇడబ్ల్యూఎస్ ఉన్న దేశాలు విపత్తు సంబంధిత మరణాల నిష్పత్తిని కలిగి ఉన్నాయని, ఇది 'గణనీయమైన' నుండి 'సమగ్ర' కవరేజ్ ఉన్న దేశాల కంటే దాదాపు ఆరు రెట్లు ఎక్కువగా ఉందని, దాదాపు నాలుగు రెట్లు ఎక్కువ విపత్తు ప్రభావిత వ్యక్తులను కలిగి ఉన్నాయని నివేదించింది. 2024 నాటికి 108 దేశాలు బహుళ ప్రమాద ముందస్తు హెచ్చరిక వ్యవస్థలకు కొంత సామర్థ్యాన్ని కలిగి ఉన్నాయని తెలిపాయి. ఇది 2015లో 52 దేశాల కంటే రెట్టింపు కంటే ఎక్కువ. అందరికీ ముందస్తు హెచ్చరికలు అనేది 2027 చివరి నాటికి ప్రజల్ ప్రాణాలను రక్షించే ముందస్తు హెచ్చరిక వ్యవస్థల ద్వారా భూమిపై ఉన్న ప్రతి ఒక్కరినీ ప్రమాదకరమైన వాతావరణం, నీరు లేదా వాతావరణ సంఘటనల నుండి రక్షించేలా చేయాలని అంతర్జాతీయ నివేదికలు స్పష్టం చేస్తున్నాయి.

**ప్రధానమైనవి నాలుగు:**

అందరికీ ముందస్తు హెచ్చరికల వ్యవస్థ అందుబాటులోనికి తేవడానికి నాలుగు విషయాలు ప్రధానమైనవి. అవి ఒకటి విపత్తు ప్రమాద పరిజ్ఞానం కలిగి ఉండాలి. రెండు ప్రమాదాల గుర్తింపు, పరిశీలనలు, పర్యవేక్షణ, విశ్లేషణ మరియు అంచనా వేయగలగాలి. మూడు హెచ్చరిక సమాచారాన్ని వ్యాప్తి చేయగలగాలి. నాలుగు ప్రతిస్పందించడానికి సంసిద్ధత కలిగి ఉండాలి. అయితే అంచనా సామర్థ్యాలు గణనీయంగా అభివృద్ధి చెందినప్పటికీ, పరిశీలన నెట్‌వర్క్‌లు, అంచనా ఖచ్చితత్వం, అధిక-నాణ్యత వాతావరణ, జలసంబంధమైన డేటాను పొందడంలో అంతరాలు అలాగే ఉన్నాయి. అభివృద్ధి చెందుతున్న దేశాలలో జాతీయ వాతావరణ జలసంబంధమైన సేవలను బలోపేతం చేయడం వాతావరణ అనుకూలతకు మాత్రమే కాదు, ఇది ప్రపంచ స్థితిస్థాపకత, భద్రత ఆర్థిక స్థిరత్వానికి కూడా అవసరం.

**2030 కల్లా సాధించాలి:**

' అన్ని దేశాలలో వాతావరణ సంబంధిత ప్రమాదాలు, ప్రకృతి వైపరీత్యాలకు స్థితిస్థాపకత, అనుకూల సామర్థ్యాన్ని బలోపేతం చేయడంబీ వాతావరణ మార్పు చర్యలను జాతీయ విధానాలు, వ్యూహాలు, ప్రణాళికలలో సమగ్రపరచడంబీ వాతావరణ మార్పుల తగ్గింపు, అనుసరణ, ప్రభావ తగ్గింపు ముందస్తు హెచ్చరికపై విద్య, అవగాహన పెంచడం, మానవ సంస్థాగత సామర్థ్యాన్ని మెరుగుపరచడం చేయాలని'

యుయన్ సుస్థిర అభివృద్ధి లక్ష్యాల్లో పదమూడవది తెలుపుతుంది. 2030 కల్లా ఇవి సాధించాల్సిన అవసరం ప్రపంచ దేశాల అన్నింటి మీద ఉంది.

**-కింజరాపు అమరావతి**
**ఫోన్: 82472 86357**

# రమజాన్ చివరి రోజుల సదాచరణలు

భక్తి



పవిత్ర రమజాన్ చివరి దినాల్లో ఆచరించబడే ఆరాధనల్లో షబేఖద్ర్ బేసిరాత్రుల జాగరణ , ఏతెకాఫ్ , ఫిత్రా ప్రధానమైనవి. చివరి బేసిరాత్రుల్లో విరివిగా ఆరాధనలు చేసి షబేఖద్ర్ ను పొందే ప్రయత్నం చేయాలి. ఈఒక్కరాత్రి ఆరాధన వెయ్యి నెలలకన్నా శ్రేష్ఠమని పవిత్ర ఖురాన్ చెబుతోంది. అంటే షుమారు 83 సం. రాల 4 నెలల ఆరాధన కన్నా అధికమన్నమాట. మానవుడి సగటు జీవితకాలంకన్నా ఎక్కువ. అలాగే ఏతెకాఫ్ కూడా చాలా గొప్పఆరాధనే. చివరి పదిరోజులు మసీదులోనే ఒక పక్కన చిన్నపరదా ఏర్పాటు చేసుకొని ఏకాంతంగా దైవారాధనలో గడపాలి. నమాజులు, జిక్ర్ , దైవనామ స్మరణ, పవిత్ర గ్రంథ పారాయణం, హదీసు గ్రంథాలు తదితర ధార్మిక ఆచరణలు తప్ప, ఏవిధమైన ప్రాపంచిక కార్యకలాపాలు చేయకూడదు. మానవ సహజ అవసరాలకు తప్ప మసీదునుండి అనవసరంగా బయటికి వెళ్ళకూడదు. ఏతెకాఫ్ ద్వారా దైవంతో



బంధం పటిష్టమవుతుంది. దైవప్రేమ, దేవుని సామీప్యత ప్రాప్తమవుతుంది. అలాగే ఈరోజుల్లో ఫిత్రాలు కూడా చెల్లించాలి. ఫిత్ర్ అంటే శాబ్దిక అర్థం ఉపవాసవిరమణ అన్నమాట. 'సదఖయే ఫి త్ర్' అంటే రోజా విరమణకు సంబంధించిన దానం అనిఅర్థం. ధార్మిక పరిభాషలో 'సదఖయే ఫిత్ర్ ' అంటే ఉపవాస దీక్షలు పాటించేటప్పుడు జరిగిన లోపాలకు , పొరపాట్లకు పరిహారంగా రమజాన్ నెలలో విధిగా చెల్లించవలసిన దానం అన్నమాట. రోజాలు విధిగా నిర్ణయించిన నాటినుండే ఫిత్రాలుకూడా తప్పనిసరిగా చెల్లించాలని ముహమ్మద్ ప్రవక్త (స) ఆదేశించారు.

ఫిత్రా దానంగా ఒక 'సా ' అంటే పావు తక్కువ రెండు శేర్లుఆహార దినుసులు పేదసాదలకు ఇవ్వాలి. మారిన కాలాన్ని , నేటి పరిస్థితుల్ని దృష్టిలో ఉంచుకొని ఏ రూపంలో ఐనా ఇవ్వవచ్చు. ఫిత్రాలవల్ల రెండురకాల లాభాలున్నాయి. ఒకటి - ,రోజాలను ఎంత నిష్టగా పాటించినా , మానవ సహజ బలహీనత వల్ల ఏవో చిన్నచిన్న పొరపాట్లు జరుగుతూనే ఉంటాయి. వాటికి పరిహారంగా ఈ ఫిత్రాలు ఉపయోగపడతాయి. వీటివల్ల రోజాలు పవిత్రతను, పరిపూర్ణతను సంతరించుకొని స్వీకారభాగ్యానికి నోచుకుంటాయి. రెండు-, ఫిత్రాలవల్ల సమాజంలోని పేద , బలహీనవర్గాలకు కాస్తంత ఆర్థిక వెసులుబాటు కలుగుతుంది. తద్వారా వారుకూడా పండుగను ఆనందోత్సాహాలతో జరుపుకోగలుగుతారు. ఈకారణంగానే ప్రవక్త మహనీయులు ఫిత్రాదానాన్ని,' నిరుపేదల భృతి ' అన్నారు. అందుకే ఫిత్రాదానాలను ఉపవాసులకే పరిమితం చేయకుండా, పరిధిని విస్తరించారు. ఉపవాసం ఉన్నా లేకపోయినా అందరూ ఫిత్రా చెల్లించాలని చెప్పారు. కుటుంబంలో ఎంతమంది ఉంటే , వారందరి తరఫున కుటుంబ యజమాని ఫిత్రా చెల్లించాలి. పండుగ నమాజు కంటే ముందు జన్మించిన శిశువు తరఫునకూడా తల్లిదండ్రులు ఫిత్రా చెల్లించాలి. పండుగ కంటే ముందే ఈ బాధ్యత నేరవేర్చుకోవాలి . కొన్ని రోజుల ముందు చెల్లిస్తే లబ్ధిదారులు పండుగ సామగ్రి కొనుక్కోవడానికి వీలుగా ఉంటుంది. పండుగ సంతోషంలో అందరినీ భాగస్వాములను చేయడమే అసలు ఉద్దేశ్యం. అల్లాహ్ అందరికీ రమజాన్ చివరి దశకాన్ని సద్వినియోగం చేసుకునే సద్బుద్ధిని ప్రసాదించాలని కోరుకుందాం.

**- ముహమ్మద్ ఉస్మాన్ ఖాన్**

## తైలంతో తరగని అందం



సౌందర్య చికిత్సల్లో తైలాలది ప్రత్యేక స్థానం. ఏ తైలాన్ని ఎలా వాడుకోవాలో తెలుసుకుని మసలుకుంటే, తరగని అందాన్ని సొంతం చేసుకోవచ్చు.

గ్రీన్ టీ ఆయిల్: గ్రీన్ టీ ఆకులు, ఆలివ్ ఆయిల్‌ను ఒక జాడీలో వేసుకుని, ఎండచొరబడని, చల్లని ప్రదేశంలో నెల రోజుల పాటు ఉంచితే, గ్రీన్ టీ ఆయిల్ సిద్ధమవుతుంది. ఈ నూనె వెంట్రుకలకు తేమను అందించి, మృదువుగా మార్చి, ఆరోగ్యమైన పెరుగుదలకు తోడ్పడుతుంది. పొడి చర్మం తేమ సంతరించుకోవాలంటే గ్రీన్ టీ నూనెను ముఖానికి పూసుకుని మర్దన చేయాలి.

పసుపు నూనె: కొబ్బరి నూనెకు పసుపు ముద్దను కలిపి, చిన్న మంట మీద ఉడికించాలి. చల్లారిన తర్వాత సీసాలో నిల్వ చేసుకుని ఉపయోగించుకోవాలి. ఈ నూనెతో ముఖం మీద మచ్చలు మటుమాయమవుతాయి. మంగు మచ్చలు కూడా తొలగిపోతాయి. వయసు పైబడే ఛాయలు అదుపులోకి వస్తాయి. నల్లబడిన పెదవులు గులాబీ రంగులోకి మారతాయి.

క్యారట్ ఆయిల్: నచ్చిన నూనెలో క్యారెట్ ముక్కలను వేసి, నూనె రంగు మారే వరకూ చిన్న మంట మీద ఉడికించి, చల్లార్చి సీసాలో నిల్వ చేసుకోవాలి. ఈ నూనె కుదుళ్లకు పూసుకుంటే వెంట్రుకలు పెరుగుతాయి.

# అపరాధా? బాధితురాలా?





ఉగ్రవాద సానుభూతిపరురాలిగా ముద్ర, వీసా రద్దు, వెంటపడుతున్న ప్రభుత్వ ఏజెన్సీలు... ఊపిరి సలపనివ్వనంత వేగంగా తరుముతున్న సంఘటనల నేపథ్యంలో... భారతీయ విద్యార్థిని రంజనీ శ్రీనివాసన్ స్వీయ బహిష్కరణ విధించుకొని, అమెరికా నుంచి కెనడాకు పరుగులెత్తారు. ఆమె అపరాధి అని చట్ట సంస్థలు చెబుతూంటే... తను బాధితురాలినంటున్నారు రంజని. వీటిలో నిజం ఏదైనా... ప్రస్తుతం ఆమె భవిష్యత్తు అనిశ్చితిలో ఉంది.

థ్రిల్లర్ సినిమాను తలపిస్తున్న రంజనీ శ్రీనివాసన్ కథలో తాజా పరిణామాల వెనుక... ఓ ఫ్లాష్‌బ్యాక్ ఉంది. పాలస్తీనాకు అనుకూలంగా న్యూయార్క్‌లోని కొలంబియా యూనివర్సిటీ విద్యార్థులు కొందరు నిరుడు ఏప్రిల్‌లో ఆందోళనలు చేపట్టి, క్యాంప‌స‌లోని హామిల్టన్ హాల్‌ను తమ ఆధీనంలోకి తీసుకున్నారు. తమతో ఘర్షణకు దిగిన ఆందోళనకారులను పోలీసులు అరెస్ట్ చేశారు. రంజనిని కూడా యూనివర్సిటీ మైదానం సమీపంలో అదుపులోకి తీసుకున్నారు. "నేను ఆ ఆందోళనలో పాల్గొనలేదు. క్యాంప‌స‌లోని నా స్నేహితులను కలుసుకొని, తిరిగి నా అపార్ట్‌మెంట్‌కు వెళ్తూ వీధుల్లో ఉన్న నిరసనకారుల మధ్య చిక్కుకున్నాను. నన్ను అన్యాయంగా అరెస్ట్ చేశారు. ఆ నిరసనలకు నాకు ఏ సంబంధం లేదు" అని ఆమె స్పష్టం చేశారు. కాగా, ట్రాఫిక్‌కు అంతరాయం కలిగించారని, సంఘటన స్థలం నుంచి వెళ్ళిపోవాలని హెచ్చరించినా పట్టించుకోలేదనీ ఆరోపిస్తూ రెండు సమన్లను పోలీసులు ఆమెకు జారీ చేశారు. అయితే ఆ కేసును న్యాయస్థానం డిస్మిస్ చేసింది. క్రిమినల్ రికార్డుల్లో కూడా ఆ వివరాలు నమోదు కాలేదని రంజని చెబుతున్నారు. హామిల్టన్ హాల్‌ను విద్యార్థులు ఆక్రమించిన సంఘటనతో రంజనికి సంబంధం లేకపోవచ్చు కానీ... అంతకుముందు కొన్ని ఆందోళనల్లో ఆమె పాల్గొన్నారు. గాజాలో మానవ హక్కుల ఉల్లంఘన జరుగుతోందంటూ సోషల్ మీడియాలో వచ్చిన కొన్ని పోస్టుల్ని షేర్ చెయ్యడం, లైక్ చెయ్యడంతో పాటు... 2023లో పాలస్తీనా విముక్తికి మద్దతుగా 'సొసైటీ ఆఫ్ ఆర్కిటెక్చరల్ హిస్టారియన్స్' విడుదల చేసిన బహిరంగ లేఖ మీద సంతకం కూడా చేశారు. ఈ విషయాలను ఆమె తరఫు న్యాయవాదులు సైతం ధ్రువీకరించారు.

**ఆ వివరాలు దాచినందుకు...**

తమిళనాడుకు చెందిన రంజని 2016లో హార్వర్డ్ యూనివర్సిటీలో గ్రాడ్యుయేట్ విద్యార్థిగా ఎఫ్-1 వీసాపై అమెరికాకు వచ్చారు. ప్రస్తుతం కొలంబియా యూనివర్సిటీలో... అర్బన్ ప్లానింగ్‌లో డాక్టోరల్ డిగ్రీ చేస్తున్నారు. హామిల్టన్ హాల్ కేసు నుంచి తనకు విముక్తి లభించిన కొద్ది రోజులకు స్టూడెంట్ వీసాను ఆమె పునరుద్ధరించుకున్నారు. తదనంతరం అధికారంలోకి వచ్చిన ట్రంప్ ప్రభుత్వం... కొలంబియా యూనివర్సిటీలో పాలస్తీనా అనుకూల విద్యార్థుల మీద చర్యలకు శ్రీకారం చుట్టింది. ఈ ఏడాది మార్చి 5న రంజని వీసాను 'యుఎస్ డిపార్ట్‌మెంట్ ఆఫ్ స్టేట్' రద్దు చేసింది. "చెన్నైలోని యుఎస్ కాన్సులేట్ నుంచి నాకు ఒక ఇ-మెయిల్ వచ్చింది. నా వీసా రద్దు గురించి తెలియజేస్తూ నన్ను 'వీసాకు అనర్హురాలుగా చేసే కొత్త సమాచారం' వెలుగులోకి వచ్చిందని తెలిపింది" అని చెప్పారు రంజని. తన స్టూడెంట్ వీసాను పునరుద్ధరించుకొనే సమయంలో... పాత అరెస్టు, రెండు సమన్ల గురించి ప్రస్తావించకుండా దాచినందుకు, హింసను, ఉగ్రవాదాన్ని ప్రోత్సహిస్తున్నందుకు ఆమె వీసాను రద్దు చేస్తున్నట్టు 'యుఎస్ డిపార్ట్‌మెంట్ ఆఫ్ హోమ్‌ల్యాండ్ సెక్యూరిటీ' ఒక ప్రకటన జారీ చేసింది. ఆమెపై ఉగ్రవాదులకు అనుకూలవాదిగా ముద్ర వేస్తూ, నిషేధిత ఉగ్రవాద సంస్థ హమాసకు మద్దతుగా కార్యకలాపాల్లో పాల్గొన్నట్టు పేర్కొంది. గందరగోళానికి గురైన రంజని... యూనివర్సిటీలోని అంతర్జాతీయ విద్యార్థుల కేంద్రం ప్రతినిధులను కలిశారు. ఆమె అమెరికాలో ఉన్నంతకాలం విద్యను కొనసాగించవచ్చని వారు తెలిపారు. రెండు రోజుల అనంతరం... కొలంబియా యూనివర్సిటీ నుంచి ఆమెకు ఒక ఇ-మెయిల్ వచ్చింది. ఆమె వీసాను రద్దు చేసినట్టు అధికారిక సమాచారం అందిందనీ, ఈ క్రమంలో యూనివర్సిటీ నుంచి ఆమెను తొలగిస్తున్నామనీ, విద్యార్థినిగా ఆమెకు ఇచ్చిన వసతిని ఖాళీ చేయాలని అందులో పేర్కొన్నారు.

**జీవితం తల్లకిందులు...**

ఒకవైపు ఇవి కొనసాగుతూండగా.. మరోవైపు మార్చి 7న రంజని నివసిస్తున్న అపార్ట్‌మెంట్‌కు ముగ్గురు ఫెడరల్ ఇమ్మిగ్రేషన్ ఏజెంట్లు వచ్చారు. రంజనితో కలిసి అక్కడ నివసిస్తున్న మరో విద్యార్థినితో తాము పోలీసులమని చెప్పారు. గుర్తింపు కార్డులు చూపించాలని ఆమె కోరడంతో వాళ్ళు కొద్దిసేపు వాదించి వెళ్ళిపోయారు. ఆ సమయంలో రంజని ఆ అపార్ట్‌మెంట్‌లోనే ఉన్నారు. పరిస్థితి అర్థం చేసుకున్న ఆమె తక్షణం ఆ నివాసాన్ని ఖాళీ చేసి, వేరే మిత్రుల దగ్గర తలదాచుకున్నారు. మరికొన్ని గంటల్లోనే హమాస్ మద్దతుదారుడిగా పేరుపడిన మరో విద్యార్థి మహమ్మద్ ఖలీల్‌ను ఇమ్మిగ్రేషన్ అధికారులు అరెస్ట్ చేశారు. పలుసార్లు రంజని అపార్ట్‌మెంట్‌కు ఫెడరల్ ఏజెంట్లు వస్తూనే ఉన్నారు. తదుపరి వంతు తనదేనని గ్రహించిన రంజని... ప్రభుత్వం రూపొందించిన 'సిబిపి యాప్'ను ఆశ్రయించారు. అమెరికాలో అనుమతి లేకుండా ఉంటున్నవారు చట్టపరమైన చర్యలను ఎదుర్కోవడానికి ముందే... స్వీయ బహిష్కరణ (సెల్ఫ్ డిపోర్ట్)ను ఎంచుకొని, స్వచ్ఛందంగా అమెరికా వదిలి వెళ్ళడానికి ఈ యాప్ వీలు కలిగిస్తుంది. దాన్ని ఉపయోగించుకున్న రంజని... కెనడాకు పయనమయ్యారు. జ్యుడీషియల్ వారెంట్‌తో ఆమె అపార్ట్‌మెంట్‌కు వెళ్ళిన అధికారులకు ఈ సంగతి ఆలస్యంగా తెలిసింది.

ఆ తరువాత... న్యూయార్క్‌లోని లాగార్డియా విమానాశ్రయం నుంచి ఆమె నిష్క్రమిస్తున్న దృశ్యాలను అధికారులు మీడియాకు విడుదల చేశారు. ఇది జరిగిన రెండు రోజుల తరువాత ఒక ఆంగ్ల పత్రికకు రంజని ఇంటర్వ్యూ ఇస్తూ "అక్కడ వాతావరణం చాలా ఉద్రిక్తంగా, ప్రమాదకరంగా కనిపించింది. అందుకే వేగంగా నిర్ణయం తీసుకున్నాను. అయిదేళ్ళ నుంచి కొలంబియా యూనివర్సిటీలో చదువుతున్నాను. ఈ ఏడాది డిగ్రీ పూర్తి చెయ్యాల్సి ఉంది. ఇదంతా నేను తప్పు చెయ్యడంవల్ల జరిగింది కాదు, నా అభిప్రాయాలను స్వేచ్ఛగా వ్యక్తపరిచే హక్కును ఉపయోగించుకోవడం వల్ల జరిగింది.

ఇప్పుడు నేను బాధితురాలిని. నా వీసాను రద్దు చెయ్యడంతో నా జీవితం తల్లకిందులయింది. డిగ్రీ పూర్తి చేస్తాననే ఆశ కనిపించడం లేదు. అంతా అనిశ్చితిగా ఉంది" అని చెప్పారు. '37 ఏళ్ళ రంజని భవిష్యత్తులో ఏం చెయ్యబోతున్నారు? స్వదేశానికి తిరిగి వస్తారా?' అనే ప్రశ్నలకు... ప్రస్తుతానికి ఆమె దగ్గర కూడా స్పష్టమైన సమాధానాలు లేవు.

# పాఠకులు నాతో ప్రయాణం చేస్తారు



శాస్త్రీయ అంశాలను అందరికీ అర్థమైయ్యే సులభమైన భాషలో చెప్పటం చాలా కష్టం. ముఖ్యంగా గురుత్వాకర్షణ శక్తి వంటి అంశాలను సులభతరంగా చెప్పటం చాలా కష్టం. ఇలాంటి కష్టమైన విషయాన్ని తనదైన రీతిలో పాఠకుల ముందుకు తీసుకువచ్చిన శాస్త్రవేత్త బ్రిటన్‌కు చెందిన క్లాడా రమ్. ఆమె రాసిన 'ది బ్యూటీ ఆఫ్ ఫాలింగ్: ఏ లైఫ్ ఇన్ పర్‌సూట్ ఆఫ్ గ్రావిటీ' పుస్తకం ప్రపంచవ్యాప్తంగా సంచలనం సృష్టిస్తోంది.

ఈ పుస్తకం సామాన్య పాఠకులకు ఒక ప్రయాణం లాంటిది. నేను ఒక సిద్ధాంతం గురించి చెబితే వారు వినటమనేది జరుగుతూనే ఉంటుంది. కానీ దీనిలో పాఠకులు కూడా నాతో పాటే ప్రయాణం చేస్తారు. తమ చుట్టూ ఉన్న ప్రపంచాన్ని తమదైన దృష్టికోణం నుంచి చూస్తారు. అనుభూతి పొందగలుగుతారు.‌స్త్రవేత్తలు రెండు రకాలుగా ఉంటారు. కొందరు సిద్ధాంతాలను ప్రతిపాదిస్తారు. కొందరు ప్రయోగాలు చేస్తారు. భౌతికశాస్త్ర పరిశోధనా రంగంలో మహిళల సంఖ్య చాలా తక్కువ. దీనికి కొన్ని కారణాలు ఉన్నాయి. డిగ్రీ స్థాయిలో చాలా మంది మహిళలు భౌతికశాస్త్రాన్ని చదువుతారు. యూనివర్సిటీకి వచ్చే సమయానికి వీరి సంఖ్య గణనీయంగా తగ్గిపోతుంది. ఇక పరిశోధన రంగంలోకి వచ్చే మహిళలు ఇంకా తక్కువగా ఉంటారు. ఇక్కడ ఇంకో విషయాన్ని కూడా చెప్పాలి. సైన్స్ అనేది చాలా క్లిష్టమైన విషయం కాదు. సిద్ధాంతాలను రాతిపై రాసి చెక్కరు. ఇదే విధంగా శాస్త్రవేత్తలనగానే- కళ్లజోడు పెట్టుకొని గంభీరంగా ఉండరు. ఇలాంటి రకరకాల అభిప్రాయాలు తొలగిపోతే సైన్స్‌కు చాలా మంచి జరుగుతుంది. అందుకే నేను పుస్తకాన్ని రాశాను. దీనిని చదివిన తర్వాత సైన్స్‌పై వారికి ఉన్న దృష్టికోణం మారుతుందని భావిస్తున్నాను.

గురుత్వాకర్షణ శక్తి మనకు స్వేచ్ఛను ఇస్తుంది. ఒక క్షణం గురుత్వాకర్షణ శక్తే లేదనుకుందాం. అప్పుడు మనందరం ఎలా ఉండేవాళ్లం? తేలుతూ ఉండేవాళ్లం. ఎలా అయినా స్వేచ్ఛగా వెళ్లే శక్తి ఉండేది. ఈ స్వేచ్ఛను నేను వ్యక్తిగతంగా కూడా కోరుకుంటాను. ఇక్కడ ఒక ఆసక్తికరమైన విషయం చెబుతాను. చాలా మంది నన్ను... "మీరు ఈ విశ్వంపై ఎందుకు పరిశోధన చేస్తున్నారు? గురుత్వాకర్షణపై మీకున్న ఆసక్తి ఏమిటి?" అని అడుగుతూ ఉంటారు. నాకు విశ్వం.. గురుత్వాకర్షణ శక్తి కాకుండా మిగిలిన విషయాలన్నీ చాలా సంక్లిష్టంగా అనిపిస్తాయి. ఉదాహరణకు బయాలజీని తీసుకుందాం. దీనిలో ప్రతి విషయం ఒక దానిపై మరొకటి ఆధారపడి ఉంటుంది. ఒక విషయాన్ని అధ్యయనం చేయాలంటే మిగిలిన వాటి గురించి కూడా తెలుసుకోవాలి. గురుత్వాకర్షణ విషయంలో ఇలాంటి సమస్య ఉండదు. ఇది మన విశ్వానికి సంబంధించిన మౌలికమైన అంశం. దీనిపై పరిశోధనవల్ల అనేక లోతుపాతులు తెలుసుకోగలు గుతాను. ఉదాహరణకు మీరు ఒక విమానాన్ని నడుపుతున్నారనుకుందాం. విమానం ఇంజిన్‌ను స్టార్ట్ చేసే ముందు ఆలోచనలు ఒకలా ఉంటాయి. ఒక్కసారి ఆకాశంలోకి వెళ్లిన తర్వాత మొత్తం దృష్టంతా ఆకాశంపైనే ఉంటుంది. ఇతర ఆలోచనలు ఏమి రావు.

గతంలో మన సమాజంలో శాస్త్రవేత్తలకు ప్రత్యేకమైన స్థానం ఉండేది. ఇప్పుడు ప్రాధాన్యత తగ్గుతూ వస్తోంది. దీనికి కారణం ఎక్కువమంది ప్రజలకు దీర్ఘకాలిక పరిశోధనలకు ఉన్న అవసరంపై అవగాహన లేకపోవటమే! ఈ రోజు మానవుడు భూమిపై సురక్షితంగా నివసించటానికి అనేక లక్షల సంవత్సరాల పరిశోధనల ఫలితాలే కారణం. ఇప్పుడు అలాంటి పరిశోధనలు జరగకపోతే ఆ ప్రభావం భవిష్యత్ తరాలపై పడుతుంది. అది చాలా ప్రమాదకరం కూడా! మన జీవనశైలిని మెరుగుపరిచే కొత్త కొత్త టెక్నాలజీలు, అప్లికేషన్లు రావాలంటే... ప్రాథమిక స్థాయిలో కొన్ని పరిశోధనలు జరగాలి. అవి జరగకపోతే భవిష్యత్ కుంటుపడుతుంది.

# ఆమె అడుగులే.. ఆర్థిక పాఠాలు

సక్సెస్‌దీని రెసిపీ ఒక్కొక్కరికీ ఒక్కోలా ఉంటుంది. రుచీ అంతే ఎవరిది వారికే! వ్యక్తులు ప్రయాణించిన మార్గాలు, ఎదుర్కొన్న ఒడుదొడుకులు, ఎక్కిన మెట్లు పాకాన్ని పక్వానికి తెస్తాయి. నలుగురితోనూ 'వారెవ్వా!' అనిపిస్తాయి. విజయానికి కావలసిన ఈ దినుసులన్నీ దండిగా ఉన్న నిండు జీవితం రాధికా గుప్తది. పుట్టుకతోనే మెడ విరిగిన చిన్నారి ఆమె. కష్టపడి చదివినా ఉద్యోగాల్లో ఎన్నో తిరస్కారాలు. ఆత్మహత్య ఆలోచనల నుంచి అతి పిన్న వయసు సీఈఓల్లో ఒకరిగా అయ్యే దాకా సాహసోపేతంగా సాగిన జీవితం ఆమెది. ప్రస్తుతం ఎడెల్‌వీస్ మ్యూచువల్ ఫండ్ సంస్థ సీఈఓగా, షార్క్‌ట్యాంక్ కార్యక్రమానికి జడ్జిగా జనానికి సుపరిచితురాలైన రాధిక ప్రయాణం ఆద్యంతం స్ఫూర్తిమంతం!

సోషల్ మీడియా యుగంలో జనానికి చేరువైన వ్యాపారవేత్తల్లో ఎడెల్‌వీస్ సీఈఓ రాధికా గుప్త ఒకరు. మార్కెట్ ట్రెండ్స్‌ను గమనిస్తూ పెట్టుబడి పాఠాలు, ఆర్థిక సలహాలు, సూచనలు అందిస్తుంటారామె. అమెరికాలాంటి దేశాల్లో అధ్యక్ష మార్పు సహా రకరకాల కారణాల వల్ల తీవ్ర ఒత్తిడిలో కొనసాగుతున్న స్టాక్ మార్కెట్ గురించీ, అందులో సిప్‌లు



చేసేవారికి సంబంధించీ ఇటీవల ఆమె చెప్పిన మాటలకు మంచి స్పందన వచ్చింది. ఇలా సందర్భానుసారంగా జనంలో ధైర్యాన్ని నింపడమే కాదు, తనకు తానూ జీవితంలో ఎంతో ధైర్యంగా ముందుకెళ్లారామె. అసలు ఉద్యోగానికే పనికిరాదన్న రంగంలోనే రాణించి నేడు 45 వేల కోట్ల రూపాయల విలువైన సంస్థకు మేనేజింగ్ డైరెక్టర్ కమ్ సీఈఓగా పనిచేస్తున్నారు. తిరస్కారాలు ఎదుర్కొన్న చోటే పురస్కారాలు అందుకున్నారు. అలాగని ఆమె ఏ వ్యాపారవేత్తల కుటుంబం నుంచో వచ్చారనుకుంటే మనం పొరబడ్డట్టే. మామూలు కుటుంబం నుంచి వచ్చిన ఆమె, స్వయంకృషితో ఏ స్థాయికైనా చేరొచ్చు అన్నదానికి ఉదాహరణగా నిలిచారు.

**మధ్యతరగతి నుంచే..**

రాధికా గుప్త తండ్రి భారత విదేశాంగ శాఖలో ఉన్నత స్థాయి ఉద్యోగి. వృత్తి రీత్యా ఆయన రకరకాల దేశాలు తిరుగుతూ ఉండేవారు. రాధిక పుట్టే సమయానికి ఆయన పాకిస్థాన్‌లో ఉన్నారు. ప్రసవ సమయంలో సమస్యలు తలెత్తడంతో రాధిక మెడ విరిగిపోయి పుట్టారు. దీని కారణంగా ఆమె తల వంకరగా కనిపిస్తూ ఉంటుంది. కన్ను కూడా కాస్త మెల్లగానే ఉంటుంది. ఈ రూపురేఖల పరంగా చిన్ననాటి నుంచీ ఎన్నో వెక్కిరింతలు ఎదుర్కొన్నారామె. అయితే అవేమీ ఆమెను చదవకుండా ఆపలేకపోయాయి. ఎప్పుడూ తరగతిలో ఆమే ముందు. ఇక, ఆమె తండ్రికి పాకిస్థాన్ నుంచి న్యూయార్క్‌కి బదిలీ అవ్వడంతో అక్కడి పాఠశాలలో చేరారు. తర్వాత నైజీరియాలోని ఓ ఇంటర్నేషనల్ స్కూల్‌లో చదువుకున్నారు. ఈ బడిలో అపర కుబేరులు, వ్యాపారవేత్తల పిల్లలు చదివేవారు. వారికి గుర్రం సవారీ, ఈతలాంటి హాబీలుండేవి. దీంతో తనకంటూ ఓ హాబీ ఉండాలని రాధిక భావించేవారు. అయితే ఇలాంటి అభిరుచులు ఖరీదైన వ్యవహారం. మధ్యతరగతి కుటుంబాల్లో చదువుతో పాటు వీటికీ డబ్బులు కట్టడం కాస్త కష్టమే! కానీ తనకూ ఏదో ఒక హాబీ కావాలని ఇంట్లో వాళ్లను తరచూ అడగడంతో 'ఎంచక్కా పేకాట ఆడుకుందాం..' అన్నారు అమ్మానాన్న. దీంతో వాళ్లతో కూర్చుని ఆడుతూ అందులో నైపుణ్యం సాధించారు. అది ఓ సందర్భంలో ఆమె ఎదుగుదలకు సాయపడింది. ప్లస్ టూ తర్వాత అమెరికాలోని పెన్సిల్వేనియా యూనివర్సిటీ నుంచి కంప్యూటర్ సైన్స్ విభాగంలోనూ, ఆర్థిక శాస్త్రంలోనూ డిగ్రీ పట్టాలు అందుకున్నారు.

**ఏడుసార్లు తిరస్కరణ**

గొప్ప విద్యాలయాల నుంచి పెద్ద చదువులు పూర్తిచేసినా ఉద్యోగాల విషయంలో కంపెనీలు రాధికకు ప్రాధాన్యం ఇవ్వలేదు. చదువు పూర్తవుతూనే క్యాంపస్‌కి వచ్చిన ఒకటీ రెండూ కాదు 7 కంపెనీలు ఆమెను తిరస్కరించాయి. అసలే చిన్నప్పటినుంచి వెక్కిరింతలు ఎదుర్కొని సున్నితంగా మారిన ఆమె మనసు ఈ పరిణామంతో కుంగుబాటుకు గురైంది. 19వ అంతస్తులో ఉన్న ఆమె ఈ కిటికీ నుంచి దూకేస్తా అంటూ అరవడంతో స్నేహితురాలు కాపాడింది. తర్వాత మానసిక చికిత్సకూ వెళ్లారు రాధిక. ఆ తర్వాత హాజరైన ఓ ఇంటర్వ్యూ ఆమె జీవితాన్ని మలుపు తిప్పింది. ప్రముఖ ఆర్థిక సేవల సంస్థ మెకెన్జీలో ఇంటర్వ్యూ అది. చదువు కాకుండా మీకేం వచ్చు అన్న ప్రశ్న ఎదురైందక్కడ. నిజానికి ఆమెకు డిగ్రీలో చేరేప్పుడూ ఇదే సమస్య ఎదురైంది. దీంతో రాధిక తనకొచ్చిన పేకాట గురించే ఉన్నది ఉన్నట్టు చెప్పారు. ఆ ఉన్నతాధికారి ఈ ఆటలో అమెరికా టోర్నమెంట్ స్థాయి క్రీడాకారిణి కావడంతో ఇంటర్వ్యూ మొత్తం దాని గురించే సాగింది. రాధిక ఆ ఉద్యోగానికి ఎంపికయ్యారు. తర్వాత వాల్‌స్ట్రీట్‌లోనూ కొంత కాలం పనిచేశారు.

**స్ఫూర్తి నింపాలని..**

మాంద్యం సమయంలో రాధిక భారత్‌కి వచ్చి, తన ఇద్దరు స్నేహితులతో కలిసి 2009లో 'ఫోర్‌ఫ్రంట్ క్యాపిటల్ మేనేజ్‌మెంట్' అనే సంస్థను ప్రారంభించారు. ఆ స్నేహితుల్లో ఒకరైన నళిన్ మనోజ్ ఆ తర్వాతి కాలంలో ఆమె జీవిత భాగస్వామి అయ్యారు. వీళ్లు స్థాపించిన సంస్థకు మంచి పేరు రావడంతో ఎడెల్‌వీస్ సంస్థ దీన్ని కొనుగోలు చేసింది. రాధికకు కీలక పదవిని కట్టబెట్టింది. కొద్ది రోజుల్లోనే మంచి పనితీరుతో ఆమె ఆ సంస్థకు సీఈవో స్థాయికి చేరుకున్నారు. అప్పటికి ఆమె వయసు 33 ఏండ్లు మాత్రమే. భారత్‌లో చిన్న వయసులో సీఈవోలైన కొద్దిమందిలో ఒకరామె. తాను ఎదుర్కొన్న ఎత్తుపల్లాల ఆధారంగా ఔత్సాహిక వ్యాపారవేత్తలకు సలహాలు ఇవ్వడం అంటే ఆమెకు ఇష్టం. దాంతోనే స్టార్టప్‌లకు ఫండింగ్ చేసే ప్రముఖ టీవీ షోషార్క్‌ట్యాంక్‌కున్యాయనిర్ణేతగానూ చేరారు. ఉద్యోగం- వ్యక్తిగత జీవితం, పొదుపు-మదుపుల గురించి సోషల్ మీడియా వేదికగా అభిప్రాయాలు పంచుకుంటూ వార్తల్లో నిలుస్తుంటారు. అంతేకాదు, వైకల్యం కారణంగా న్యూనతకు గురయ్యే వారిలో ఆత్మవిశ్వాసాన్ని నింపేందుకు 'లిమిట్‌లెస్' పేరిట తన జీవిత విశేషాలతో ఓ పుస్తకాన్ని తీసుకొచ్చారు. నిజమైన జీవితాలకు మించిన స్ఫూర్తి పాఠాలు ఇంకేం ఉంటాయి చెప్పండి!

# విద్యార్థికి వెయ్యి రూపాయలు



ఒకప్పుడు మన చదువులన్నీ ప్రభుత్వ బళ్లలోనే సాగిపోయాయి. ఇప్పుడు ఉన్నత స్థానాల్లో ఉన్న పెద్దలు కూడా చాలావరకు ప్రభుత్వ పాఠశాల విద్యార్థులే! అయితే, ప్రస్తుతం ప్రైవేటు బడులు రాజ్యమేలుతున్నాయి. పిల్లలకు మంచి మార్కులు రావాలని తల్లిదండ్రులు ఆశపడుతున్నారు. ప్రభుత్వ బడి కన్నా.. ప్రైవేటులోనే వ్యక్తిగత శ్రద్ధ ఎక్కువగా ఉంటుందని భావిస్తున్నారు. దీంతో పల్లెల్లోనూ ప్రైవేటు స్కూళ్లు వెలుస్తున్నాయి. కొన్నిచోట్ల ప్రభుత్వ బడులలో మౌలిక సదుపాయాలు కరువై, విద్యార్థులు లేక వెలవెలబోతున్నాయి. కర్ణాటక రాష్ట్రం బెళగావి జిల్లా అడహట్టి గ్రామంలో ప్రభుత్వ పాఠశాలదీ ఇదే పరిస్థితి. ఇది అక్కడ ప్రధానోపాధ్యాయుడిగా పనిచేస్తున్న సిద్ధమల్ల ఖోట్‌ను కలవరపరిచింది. తన పర్యవేక్షణలోని పాఠశాలలో పిల్లల సంఖ్య తగ్గుముఖం పట్టడం ఆయన్ను బాధించింది.

ఈ క్రమంలో పిల్లల నమోదు పెంచడానికి ఆయన ఓ స్ఫూర్తిదాయకమైన చొరవ ప్రదర్శిస్తున్నారు. తమ బడిలో కొత్తగా చేరే ప్రతి విద్యార్థి పేరుమీదుగా ఓ వెయ్యి రూపాయలు ఫిక్స్‌డ్ డిపాజిట్ చేస్తున్నారు. అదీ తన సొంత ఖాతాలోంచి కావడం విశేషం. ఇది పద్దెనిమిదేండ్లకు మెచ్యూర్ అవుతుంది. చిన్నమొత్తమే అయినప్పటికీ ఈ చొరవ తల్లిదండ్రులు తమ పిల్లలను ప్రభుత్వ పాఠశాలకు పంపించడానికి ఆసక్తి చూపేలా చేస్తున్నది.

అడహట్టిలో 2005లో ఈ పాఠశాల మొదలైంది. 7వ తరగతి వరకు బోధన సాగుతుంది. 2015 వరకు అన్ని తరగతులకూ కలిపి 70 మంది విద్యార్థులు ఉంటే ఎక్కువ. ఆ తర్వాత ఉపాధ్యాయులు లేకపోవడం, మౌలిక వసతుల కొరత కారణంగా 2023 నాటికి ఈ సంఖ్య 18కి పడిపోయింది. బడి మూతపడే స్థితికి చేరుకుంది.ఇలాంటి స్థితిలో 2023 జూలైలో సిద్ధమల్ల ఖోట్ ఇక్కడికి హెడ్మాస్టర్‌గా వచ్చారు. స్థానికులు తమ పిల్లలను ప్రభుత్వ పాఠశాలకు పంపించేలా చేయడానికి ప్రయత్నాలు మొదలుపెట్టారు. నగదు డిపాజిట్ ప్రోత్సాహంతోపాటు నెలనెలా క్విజ్ పోటీలు నిర్వహిస్తున్నాడు. విజేతలకు బహుమతులు ప్రదానం చేస్తున్నాడు. దీనికితోడు ఆ గ్రామ యువకులు పోటీ పరీక్షలకు సన్నద్ధం కావడానికి తనవంతు సహకారం అందిస్తున్నాడు. ఎండకాలం సెలవుల్లో పిల్లల చదువుకు బ్రేక్ పడకుండా, వచ్చే ఏడాది పాఠాలను ముందే చెప్పడానికి చొరవ చూపుతున్నాడు. దాతల విరాళాలతో బడిలో మౌలిక సదుపాయాలు పెంచే ప్రయత్నమూ మొదలుపెట్టాడు. "గతేడాది మా బడిలో ఒకటో తరగతిలో ఇద్దరే పిల్లలు చేరారు. ఈ ఏడాది తొమ్మిది మంది చేరారు. డిపాజిట్ చేస్తున్నది చిన్నమొత్తమే అయినప్పటికీ కొద్దిమందినైనా నా ప్రయత్నం కదిలించింది. కుటుంబసభ్యులు కూడా నా ప్రయత్నాన్ని మెచ్చుకుంటున్నారు" అని సిద్ధమల్ల ఖోట్ సంతృప్తి చెందుతాడు.

# వరుస గర్భస్రావాలకు అడ్డుకట్ట ఎలా

సాధారణంగా గర్భస్రావాన్ని నివారించడం కోసం కొందరు మహిళలకు గర్భసంచి ముఖద్వారం దగ్గర సర్వైకల్ స్టిచ్ అవసరమవుతుంది. 16 వారాల తర్వాత గర్భస్రావం అయిన సందర్భాల్లో, 24 వారాల లోపు కాన్పు జరిగిపోతున్న సందర్భాల్లో, ఉమ్మనీరు కోల్పోతున్న సందర్భాల్లో, సర్విక్స్ ప్రాంతంలో సర్జరీలు జరిగి ఉన్న సందర్భాల్లో, గర్భం దాల్చిన 12 నుంచి 24 వారాల మధ్య ఈ కుట్టు వేస్తారు. అయితే మీ విషయంలో గర్భం నిలవడం కోసం గర్భసంచికి కుట్టు వేసినా గర్భస్రావం అయిందని అంటున్నారు.కాబట్టి ఇలాంటి సందర్భాల్లో ట్రాన్స్ అబ్డామినల్ సర్‌క్లేజ్ చేయవలసి ఉంటుంది. పొట్ట మీద చిన్న గాటు పెట్టి, ల్యాప్రోస్కోపీ ద్వారా ఈ చికిత్స చేయడం జరుగుతుంది. అయితే వరుస గర్భస్రావాలు జరుగుతున్న మహిళలకు గర్భం దాల్చక ముందే ఈ చికిత్స చేయాలి. కానీ మీరు ఇప్పటికే గర్భం దాల్చి ఉన్నారు కాబట్టి 12 వారాల స్కాన్ తర్వాత అబ్డామినల్ సర్‌క్లేజ్ వేయించుకోవచ్చు. అందుకు ఎంతో నైపుణ్యం అవసరమవుతుంది. అందుకు నిపుణులైన వైద్యులను ఆశ్రయించాలి. సర్‌క్లేజ్ వేయించుకున్న గర్భిణులకు సాధారణ ప్రసవం సాధ్యపడదు. తప్పనిసరిగా సిజేరియన్ చేయవలసి వస్తుంది. ట్రాన్స్ అబ్డామినల్ సర్‌క్లేజ్ వల్ల గర్భం నిలిచే అవకాశం వెజైనల్ సర్‌క్లేజ్ కంటే మెరుగ్గా ఉంటుంది.



నవభూమి
www.navabhoomi.in
www.epaper.navabhoomi.in





## గ్రామల్లో కంటే, మెట్రో నగరాల్లో ఆరోగ్య బీమాకు ఎక్కువ



**న్యూఢిల్లీ-నవభూమి:**ప్రస్తుత కాలంలో ఆరోగ్య బీమా ప్రీమియం విలువలో అనూహ్య పెరుగుదల నమోదైంది. ఈ కారణంగా చాలా మంది తమ నగరవాసులు ప్రస్తుత పాలసీలను రద్దు చేసుకోవడానికి లేదా ఇతర బీమా సంస్థలకు మారడానికి ప్రయత్నస్తున్నారు. అయితే, ఈ పెరిగిన ప్రీమియం మొత్తం మీరు నివసించే నగరంపై కూడా ఆధారపడి ఉంటుందని నిపుణులు చెబుతున్నారు. అంటే, మీరు మెట్రో నగరంలో నివసిస్తే, చిన్న పట్టణంలో ఉన్నవారి కంటే ఎక్కువ ప్రీమియం చెల్లించాల్సి వస్తుంది. అవును మీరు విన్నది నిజమే. మీ ఆరోగ్య బీమా ప్రీమియంను నిర్ణయించే సమయంలో మీ వయస్సు, ఆరోగ్య పరిస్థితి లేదా భీమా పాలసీకి సంబంధించి మాత్రమే కాకుండా, మీ నివాస ప్రాంతం కూడా చాలా కీలక పాత్ర పోషిస్తుందని నిపుణులు అంటున్నారు. భీమా సంస్థలు భవిష్యత్తులో వచ్చే ఆరోగ్య సంరక్షణ ఖర్చుల అంచనాలు, క్లెయిమ్‌లు, వైద్య సేవల ఖర్చులను బట్టి ఈ ప్రీమియం మొత్తాన్ని నిర్ణయిస్తాయని అంటున్నారు. వీటిలో ఒక ముఖ్యమైన అంశం నివాస ప్రాంతం. నిపుణుల ప్రకారం, నగరం ఒక ప్రధాన అంశంగా ఉంటుంది.

జోన్‌ల వర్గీకరణ..భారతదేశంలో బీమా సంస్థలు అన్ని నగరాలను వేర్వేరు జోన్‌లుగా వర్గీకరిస్తాయి. ఈ జోన్‌ల వర్గీకరణ ఆధారంగా ఆరోగ్య బీమా ప్రీమియంను నిర్ణయిస్తారు. దీని ప్రకారం చూస్తే ఢిల్లీ, ముంబై, కోల్‌కతా, చెన్నై, హైదరాబాద్ వంటి మెట్రో నగరాల్లో నివసించే వ్యక్తి, పల్లెటూరులో లేదా చిన్న పట్టణంలో ఉన్న వ్యక్తికంటే చాలా ఎక్కువ ప్రీమియం చెల్లించాల్సి వస్తుంది.


## హైదరాబాద్‌లో సెరా యూనిట్ రూ.300 కోట్లతో ఏర్పాటు చేస్తున్న సంస్థ



**హైదరాబాద్ - నవభూమి:** తైవాన్‌కు చెందిన సెరా నెట్‌వర్క్స్ మరో భాగస్వామితో కలిసి హైదరాబాద్‌కు సమీపంలో కొంగరకలాన్ వద్ద నెలకొల్పిన ఈ-సిటీలో భారీ ఎలక్ట్రానిక్స్ ఉత్పత్తుల తయారీ యూనిట్‌ను నెలకొల్పడానికి ముందుకొచ్చింది. రూ.300 కోట్ల పెట్టుబడితో ఏర్పాటు చేయతలపెట్టిన ఈ యూనిట్‌తో 2 వేల మందికి పైగా ఉద్యోగ అవకాశాలు లభించనున్నాయి.

రాష్ట్ర ఐటీ, పరిశ్రమల శాఖ మంత్రి దుద్దిళ్ల శ్రీధర్ బాబు సూచనలకు అనుగుణంగా ప్రస్తుతం తైవాన్‌లో పర్యటనలో ఉన్న అధికారుల బృందం ఈ యూనిట్ ఏర్పాటుపై అవగాహన ఒప్పందం కుదిరింది. టీజీఐఐసీ ఎండీ విష్ణువర్ధన్ రెడ్డి ఆధ్వర్యంలో తైవాన్ వెళ్ళిన అధికారులతో సెరా నెట్‌వర్క్స్, హైదరాబాద్‌కు చెందిన రిసొల్యూట్ అప్లయెన్సెస్ తొలుత భాగస్వామ్య ఒప్పందం చేసుకున్నాయి. ఈ రెండు సంస్థలు ఈ -సిటీలో ప్రభుత్వం కేటాయించిన 10 ఎకరాల్లో అత్యాధునిక డాటా సెంటర్ స్విచ్చులు, 5జీ టెక్నాలజీకి సంబంధించిన పరికరాలతో పాటు, ఇతర ఎలక్ట్రానిక్ విడిభాగాలను ఉత్పత్తి చేయనున్నాయి.

## ఇందుకే రిటైల్ ఇన్వెస్టర్లు నష్టపోతున్నారు: మోతీలాల్ ఆస్వాల్



**హైదరాబాద్ - నవభూమి:** రిటైల్ ఇన్వెస్టర్లలో అధిక శాతం మంది షార్ట్ టర్మ్ ట్రేడింగ్‌పై దృష్టి పెట్టడం ఆందోళనకరమని మార్కెట్ నిపుణుడు, మోతీలాల్ ఆస్వాల్ ఫైనాన్షియల్ సర్వీసెస్ లిమిటెడ్ సంస్థ ఎమ్‌డీ, సీఈఓ మోతీలాల్ ఆస్వాల్ అన్నరు. నానాటికీ ఒడిదుడుకులు ఎక్కువవుతున్న భారతీయ స్టాక్ మార్కెట్లలో ఇలాంటి వారు నష్టాలు ఎదుర్కొంటున్నారని అన్నారు. స్టాక్‌మార్కెట్ తీరుతెన్నులపై జాతీయ మీడియా ఏర్పాటు చేసిన కార్యక్రమంలో ఆయన ఈ వ్యాఖ్యలు చేశారు. మ్యూచువల్ ఫండ్స్ లేదా స్టాక్లలో దీర్ఘకాలిక పెట్టుబడులు పెట్టిన వారే ఎక్కువగా లాభాలు పొందారని మోతీలాల్ అన్నారు. అయితే, ఇలాంటి వారి సంఖ్య భారత్‌లో స్వల్పమని ఇది చాలా ఆందోళనకరమని అన్నారు. “మార్కెట్ మౌలిక సూత్రాలను ప్రజలు మర్చిపోయారు. ఇక్కడ సరైన సమయంలో సరైన కంపెనీలు లేదా ఫండ్స్‌లో దీర్ఘకాలిక పెట్టుబడులతో మాత్రమే డబ్బులు సంపాదించొచ్చు. జనాలు చాలా మంది ట్రేడర్లుగా మారిపోయారు. ఇదే అతి పెద్ద సమస్య” అని మోతీలాల్ అభిప్రాయపడ్డారు. రిటైల్ ఇన్వెస్టర్ల సంఖ్య పెరుగుతుండటంపై కూడా ఆయన పలు కీలక వ్యాఖ్యలు చేశారు. ప్రస్తుతం 26 శాతం భారతీయ కుటుంబాలకు స్టాక్ మార్కెట్‌లో నేరుగా పెట్టుబడులు పెట్టాయని అన్నారు. కానీ కొత్తగా పెట్టుబడి పెట్టేవారందరూ దీర్ఘకాలిక పెట్టుబడి లక్ష్యాలకంటే సత్వర ఆర్జనపై దృష్టి పెడుతున్నారని అన్నారు. తమకు అంతగా తెలియని కంపెనీల్లో పెట్టుబడులతో స్పెక్యులేటివ్ ట్రేడింగ్‌కు పాల్పడుతూ చాలా సందర్భాల్లో నష్టాల పాలవుతున్నారని అన్నారు. ఇక వచ్చే రెండేళ్లల్లో మార్కెట్ వృద్ధి 10 నుంచి 15 శాతానికి పరిమితం అవుతుందని కూడా ఆయన అంచనా వేశారు. ఇటీవల కాలంలో తీవ్ర ఒడిదుడుకులకు లోనైన మార్కెట్లు మెల్లగా కోలుకుంటున్న విషయం తెలిసిందే. భారతీయ మార్కెట్లలో హెచ్చుతగ్గులు ఇటీవల కాలంలో ఎక్కువవుతున్నాయని అయన అన్నారు. భౌగోళిక రాజకీయ పరిణామాలతో పాటు సోషల్ మీడియాలో తప్పుడు సమాచారం వేగంగా వ్యాప్తి కావడం కూడా ఈ పరిస్థితి కారణమని అనినారు. ఒడిదుడుకుల మాట ఎలా ఉన్నప్పటికీ భారత ఆర్థిక వ్యవస్థ, స్టాక్ మార్కెట్ పునాదులు మాత్రం పటిష్ఠంగా ఉన్నాయని స్పష్టం చేశారు.

## ఈఎంఐ చెల్లించలేదా..?

**న్యూఢిల్లీ-నవభూమి:**అప్పును అర్థవంతంగా వినియోగించుకోవడంతోపాటు నిర్దేశిత గడువులోగా తిరిగి చెల్లించడమూ ముఖ్యమే. రుణగ్రహీతలు నెలవారీ వాయిదాల (ఈఎంఐ) ను క్రమం తప్పకుండా చెల్లించాలి. ఈఎంఐ చెల్లింపు జాప్యమైనా, విఫలమైనా మీ క్రెడిట్ స్కోర్‌కు గండి పడుతుంది. భవిష్యత్‌లో మళ్లీ అప్పు పుట్టడం కష్టమవుతుంది. ఎందుకంటే, బ్యాంకులు, ఇతర ఆర్థిక సంస్థలు ఎవరికైనా రుణం ఇచ్చే ముందు ఆ వ్యక్తి పరపతి స్థాయిని క్రెడిట్ స్కోర్, క్రెడిట్ హిస్టరీ ఆధారంగానే మదిస్తాయి. తర్వాతే ఆ వ్యక్తికి రుణం ఇవ్వాలా..? వద్దా..? అని నిర్ణయం తీసుకుంటాయి. అంతేకాదు, రుణంపై ఎంత వడ్డీ వసూలు చేయాలనేది మీ క్రెడిట్ స్కోర్‌పైనే ఆధారపడి ఉంటుంది.

**క్రెడిట్ స్కోర్‌పై ప్రభావమెంత?**

ఈఎంఐ చెల్లింపు 30 రోజుల పాటు జాప్యమైతే మీ క్రెడిట్ స్కోర్ 90-100 పాయింట్ల మేర, ఒక్కోసారి అంతకుపైగా తగ్గే ప్రమాదం ఉంది. అంతేకాదు, ఆ జాప్య లావాదేవీ మీ క్రెడిట్ హిస్టరీలో ఓ మరకగా మిగిలిపోతుంది. ఒక్క తప్పు భవిష్యత్‌లో మళ్లీ మీకు రుణం లభించడాన్ని దుర్లభంగా మార్చవచ్చు. అలాగే, ఈఎంఐ చెల్లింపులో విఫలమైతే, ఆనక ఆలస్య రుసుము చెల్లించాల్సి ఉంటుంది. ఈఎంఐ చెల్లింపుల్లో తరచుగా విఫలమైతే, రుణదాత ఆలస్య రుసుము విధించడంతో పాటు వడ్డీ రేటును కూడా పెంచే అవకాశాలుంటాయి. ఈఎంఐ చెల్లింపులను పూర్తిగా నిలిపివేస్తే, రుణదాత నుంచి న్యాయపరమైన చర్యలను ఎదుర్కోవాల్సి ఉంటుంది. ఒకవేళ మీరు తనఖా రుణం తీసుకుంటే, తాకట్టులో ఉన్న ఇళ్లు లేదా వాహనాన్ని రుణదాత జప్తు చేసుకోవచ్చు.

**15 రోజులకోసారి స్కోర్ అప్‌డేట్**

ఇంతక్రితం క్రెడిట్ బ్యూరో రికార్డులు నెలకోసారి అప్‌డేట్ అయ్యేవి. ఈ ఏడాది జనవరి 1 నుంచి రికార్డులను 15 రోజులకోసారి అప్‌డేట్ చేయాలని ఆర్‌బీఐ ఆదేశించింది. తద్వారా రుణగ్రహీతల కార్యకలాపాలు, వారి రుణ నిర్వహణ సమాచారం మరింత వేగంగా అప్‌డేట్ అవుతూ వస్తోంది. అంటే, మీరు ఈఎంఐ చెల్లించడంలో ఏమాత్రం జాప్యమైనా ఆ సమాచారం మీ క్రెడిట్ హిస్టరీలో వెంటనే రికార్డు అవుతుంది. తత్ఫలితంగా మీ స్కోర్ కూడా తగ్గుతుంది.

**చెల్లింపు జాప్యమైతే ఏం చేయాలి?**

ఆకస్మిక ఆర్థిక అత్యయిక పరిస్థితి కారణంగా సమయానికి ఈఎంఐ చెల్లించడం ఒక్కోసారి సాధ్యపడకపోవచ్చు. అలాంటప్పుడు, మీ పరిస్థితి గురించి రుణదాతకు వెంటనే సమాచారం అందించి, సర్దుబాటుకు అదనపు గడువు ఇవ్వాలని కోరడం మేలు. మీరు చెప్పిన కారణం సరైనదని అనిపిస్తే, రుణదాత మీ అభ్యర్థనను మన్నించే అవకాశం ఉంటుంది. తద్వారా, ఆ జాప్య చెల్లింపును మీ క్రెడిట్ హిస్టరీలో అప్‌డేట్ కాకుండా, స్కోర్ తగ్గకుండా నివారించేందుకు అవకాశం ఉంటుంది.

# హైదరాబాద్‌లో భారీగా పడిపోయిన ఇళ్ల అమ్మకాలు



**హైదరాబాద్ - నవభూమి:**కరోనా తర్వాత 2023-24లో రియల్ ఎస్టేట్‌కు డిమాండ్ ఊహించని స్థాయిలో పెరగ్గా.. మళ్లీ కొన్ని నెలలుగా పరిస్థితి మారిపోయింది. సీన్ రివర్స్ అయిందని చెప్పొచ్చు. దేశవ్యాప్తంగా రియల్ ఎస్టేట్ డిమాండ్ తగ్గినట్లు తెలుస్తోంది. తాజాగా దేశవ్యాప్తంగా టాప్-9 నగరాల్లో ఇళ్ల విక్రయాలు.. 23 శాతం తగ్గాయి. సరఫరా కూడా 34 శాతం పడిపోవడం ఆందోళన కలిగిస్తోంది. 2025 సంవత్సరం తొలి త్రైమాసికానికి (జనవరి-మార్చి) సంబంధించి.. తాజాగా డేటా అనలిటిక్స్ సంస్థ.. ప్రాప్‌ఈక్విటీ తన రిపోర్టులో ఈ వివరాల్ని వెల్లడించింది. ఇళ్ల ధరలు పెరగడం, రాజకీయ భౌగోళిక ఉద్రిక్త పరిస్థితుల కారణంగా.. ఇంకా భారత ఆర్థిక వ్యవస్థలోనూ అనిశ్చితి వల్ల అమ్మకాలు తగ్గినట్లు నివేదిక పేర్కొంది. అయినప్పటికీ.. మార్కెట్‌లో డిమాండ్ బలంగా ఉందని, సరఫరాకు తగినంత కొనుగోళ్లు జరుగుతున్నాయని ప్రాప్‌ఈక్విటీ సీఈఓ సమీర్ జసుజా అన్నారు. రానున్న రోజుల్లో పరిస్థితి మెరుగుపడుతుందని ఆశిస్తున్నట్లు వెల్లడించారు. బెంగళూరు, ఢిల్లీ-%చీజ=% మినహా మిగిలిన నగరాల్లో అమ్మకాలు తగ్గాయి. బెంగళూరు మినహా అన్ని నగరాల్లో కొత్త ఇళ్ల నిర్మాణం తగ్గిందని వెల్లడించింది ప్రాప్‌ఈక్విటీ.

ప్రాప్‌ఈక్విటీ నివేదిక ప్రకారం.. 2025 మొదటి త్రైమాసికంలో ఇళ్ల అమ్మకాలు 1,05,791 యూనిట్లుగా ఉన్నాయి. గత ఏడాది ఇదే సమయంలో 1,36,702 యూనిట్లు అమ్ముడయ్యాయి. అంటే అమ్మకాల్లో భారీగా తగ్గుదల కనిపించింది. సరఫరా విషయానికి వస్తే, ఈ ఏడాది మొదటి త్రైమాసికంలో 80,774 యూనిట్లు అందుబాటులో ఉన్నాయి. గత ఏడాది ఇదే కాలంలో 1,22,365 యూనిట్లు సరఫరా అయ్యాయి. గత మూడు త్రైమాసికాలుగా లక్ష యూనిట్ల కంటే తక్కువ సరఫరా నమోదైంది. సాధారణంగా గత కొంతకాలంగా అధిక ఇళ్ల సరఫరా నమోదైన.. హైదరాబాద్, పుణె, థానే నగరాల్లో అమ్మకాలు తగ్గాయి. 2022, 2023 సంవత్సరాల్లో ఈ నగరాల్లోనే అత్యధిక సరఫరా ఉండేది. కానీ 2024లో అమ్మకాలు బాగా పడిపోయాయి. ఈ త్రైమాసికంలో గత ఏడాది కంటే 28,227 యూనిట్ల తక్కువ సరఫరా నమోదైంది.

బెంగళూరులో ఇళ్ల అమ్మకాలు 10 శాతం పెరిగి 18,508 యూనిట్లకు చేరుకున్నాయి. ఇది మొత్తం అమ్మకాల్లో 17 శాతం వాటాను కలిగి ఉంది. గత ఏడాది ఇదే సమయంలో ఇది 12 శాతం మాత్రమే. ఢిల్లీ-%చీజ=%లో అమ్మకాలు 10 శాతం పెరిగి 11,221 యూనిట్లకు చేరుకున్నాయి. ఇది మొత్తం అమ్మకాల్లో 11 శాతం వాటాను కలిగి ఉంది. గతేడాది ఇదే సమయంలో ఇది 7 శాతంగానే ఉంది. హైదరాబాద్‌లో అమ్మకాలు గతేడాది ఇదే సమయంతో పోలిస్తే 47 శాతం పడిపోయాయి. కొత్త ఇళ్ల సరఫరా 38 శాతం డౌన్ ఉంది. ముంబైలో 36 శాతం, పుణేలో 33 శాతం, కోల్‌కతాలో 28 శాతం, థానేలో 27 శాతం, నవీ ముంబైలో 7 శాతం, చెన్నైలో 2 శాతం ఇళ్ల విక్రయాలు పడిపోయాయి.

## మార్కెట్లోకి నయా వెస్పా.. గరిష్ఠ ధర రూ.1.96 లక్షలు



ముంబై, మార్చి 22: ఇటలీకి చెందిన ఐకానిక్ బ్రాండ్ వెస్పా.. ప్రత్యేక ఎడిషన్‌గా పలు మాడళ్లను విడుదల చేసింది. వెస్పా టెక్, వెస్పా ఎస్ టెక్‌లను అందుబాటులోకి తీసుకొచ్చింది. 125 సీసీ, 150 సీసీ సామర్థ్యంతో లభించనున్న వెస్పా స్కూటర్ ప్రారంభ ధర రూ.1,32,915గాను, అలాగే వెస్పా ఎస్ మాడల్ ధర రూ.1,36,791, అలాగే వెస్పా టెక్ మాడల్ ధర రూ.1,92,718గా నిర్ణయించింది. ఈ ధరలు హైదరాబాద్ షోరూంనకు సంబంధించినవి. టీఎఫ్‌టీ స్మార్ట్ డ్యాష్, బ్లూటూత్ ఇంటిగ్రేషన్, నావిగేషన్, ఇంటిగ్రేటెడ్ నావిగేషన్, టీఎఫ్‌టీ డిస్‌ప్లే వంటి ఫీచర్స్‌తో తీర్చిదిద్దింది. ఈ సందర్భంగా పియాజియో వెహికల్స్ ఎగ్జిక్యూటివ్ వైస్ ప్రెసిడెంట్ అజయ్ రఘువంశీ మాట్లాడుతూ.. రాష్ట్రంలో లగ్జరీ వాహనాలకు డిమాండ్ అధికంగా ఉన్నదని, ఈ క్రమంలోనే 2025 ఏడాదిలో వెస్పా పోర్ట్‌ఫోలియో మరిన్ని మాడళ్లను అందుబాటులోకి తీసుకొచ్చినట్లు చెప్పారు.

## వరుసగా రెండో రోజూ పడిపోయిన గోల్డ్ రేట్లు



**హైదరాబాద్-నవభూమి:**బంగారం అంటే భారతీయులకు ఎంతో ఇష్టం ఉంటుంది. దీని గురించి ప్రత్యేకంగా చెప్పాల్సిన పని లేదు. పండగలు, ఇతర వేడుకలు, శుభకార్యాలు, వివాహాలు ఇలా ఏదైనా బంగారం ఉండాల్సిందే. ముఖ్యంగా మహిళలు బంగారు ఆభరణాలు కొనుగోలు చేసి ధరించేందుకు ఇష్టపడుతుంటారు. బంగారు ఆభరణాలు మహిళల అందాన్ని మరింత పెంచుతుందని చెబుతుంటారు. ఇంకా బంగారం కేవలం ధరించేందుకు ఆభరణంగా మాత్రమే కాకుండా.. పెట్టుబడి కోసం కూడా మంచి సాధనంగా ఉంది. పెట్టుబడుల కోసం సావరిన్ గోల్డ్ బాండ్స్, గోల్డ్ ఈటీఎఫ్ వంటివి ఉన్నాయి. అంతలా మన సంస్కృతి, సంప్రదాయాలతో బంగారం ముడిపడి ఉంది. ఇప్పుడు దేశీయంగా, అంతర్జాతీయ మార్కెట్లలో గోల్డ్, సిల్వర్ రేట్లు ఎలా ఉన్నాయో చూద్దాం.

ఇంటర్నేషనల్ మార్కెట్లో కిందటి రోజుతో పోలిస్తే ధరలు స్థిరంగానే ఉన్నాయి. వీటిల్లో ఎలాంటి మార్పు లేదు. అయితే ఆల్ టైమ్ గరిష్ట స్థాయిల నుంచి దూరంగానే ఉంది. ప్రస్తుతం స్పాట్ గోల్డ్ రేటు ఔన్సుకు (31.10 గ్రాములు) 3023 డాలర్ల స్థాయిలో ఉంది. ఆల్ టైమ్ హై విలువ 3 రోజుల కిందట 3057 డాలర్లపైన ఉండేది. ఇక స్పాట్ సిల్వర్ రేటు కూడా 33 డాలర్లకు దిగొచ్చింది. డాలర్ పతనంతో ఇదే క్రమంలో రూపాయి మారకం విలువ పుంజుకుంది. ప్రస్తుతం డాలరుతో పోలిస్తే మారకం విలువ రూ. 86.03 కు దిగొచ్చింది. డాలర్ పడిపోవడం సహా ఫెడ్ వడ్డీ రేట్లను ఇటీవల స్థిరంగానే ఉంచిన క్రమంలో.. దేశీయంగా బంగారం, వెండి రేట్లు మరోసారి దిగొచ్చాయి. హైదరాబాద్ నగరంలో వరుసగా రెండో రోజు కూడా పసిడి ధరలు పతనం అయ్యాయి. ప్రస్తుతం హైదరాబాద్ నగరంలో 22 క్యారెట్స్ గోల్డ్ రేటు రూ. 400 తగ్గగా తులం రూ. 82,300 కు చేరింది. దీనికి ముందు రోజు కూడా రూ. 400 పతనమైంది. ఇక 24 క్యారెట్ల స్వచ్ఛమైన పసిడి ధర విషయానికి వస్తే రూ. 440 పడిపోగా ఇప్పుడు 10 గ్రాములు రూ. 89,780 వద్ద ఉంది.

ఈ క్రమంలోనే దేశ రాజధాని ఢిల్లీలో కూడా పసిడి ధరలు పతనం అయ్యాయి. ఇక్కడ 22 క్యారెట్స్ బంగారం ధర రూ. 400 తగ్గడంతో తులం రూ. 82,450 కి చేరింది. 24 క్యారెట్ల ప్యూర్ గోల్డ్ రేటు రూ. 440 పడిపోగా.. 10 గ్రాములు రూ. 89,980 కి చేరింది. మరోవైపు వెండి రేట్లు కూడా రూ. 2 వేల చొప్పున పతనమయ్యాయి. దీంతో కేజీ సిల్వర్ రేటు ఢిల్లీలో రూ. 1.01 లక్షల వద్ద, హైదరాబాద్ నగరంలో రూ. 1.10 లక్షల వద్ద ట్రేడవుతోంది.

## కిలో బంగారం ఉంటే ఓ ప్రైవేట్ జెట్‌నే సొంతం చేసుకోవచ్చా?




**న్యూఢిల్లీ-నవభూమి:**కిలో బంగారం ఉంటే ఓ ప్రైవేట్ జెట్‌నే సొంతం చేసుకోవచ్చా? అంటే అవుననే చెప్తున్నారు మార్కెట్ నిపుణులు. అప్పుడు.. ఇప్పుడు.. ఎప్పుడూ ‘గోల్డ్ ఈజ్ ఎవర్‌గ్రీన్’ అనే అంటున్నారు మరి. కాలం గడుస్తున్నకొద్దీ కనకం ఏ రీతిలో మెరిసిపోయిందో లెక్కలతోసహా గుర్తుచేస్తున్నారు. ఈ క్రమంలోనే 1990లో కిలో పసిడి ధర.. మారుతీ 800కు సమానమని, అలాగే 2000లో మారుతీ ఎస్టీమ్, 2005లో ఇన్నోవా, 2010లో ఫార్చునర్ రేట్లకు సమానంగా పెరిగిందని వివరిస్తున్నారు. ఇక 2019లో కేజీ పుత్తడికి వెచ్చించే సొమ్ముతో బీఎండబ్ల్యూ ఎక్స్1ను సొంతం చేసుకోవచ్చన్న ఎక్స్‌పర్ట్స్.. 2040కల్లా ఏకంగా ఓ ప్రైవేట్ జెట్‌ను కొన్నా ఆశ్చర్యపోనక్కర్లేదని అంచనా వేస్తుండటం గమనార్హం. అంటే మరో 15 ఏండ్లలో కిలో బంగారం ధర భారత్‌లో రూ.20 కోట్లపైనేనని, తులం రూ.20 లక్షలమీదేనని చెప్పకనే చెప్తున్నారు.

**ఫ్యూచర్ మార్కెట్‌లో..**

అంతర్జాతీయంగా గోల్డ్ ఫ్యూచర్స్ మార్కెట్‌లో ఔన్స్ మునుపెన్నడూ లేనివిధంగా 3,065.09 డాలర్లు పలికింది. ఇదే క్రమంలో దేశీయ మార్కెట్‌లో 24 క్యారెట్ (99.9 స్వచ్ఛత)ఆల్‌టైమ్ హైని తాకుతూ రూ.91,950గా నమోదైంది. దేశ, విదేశీ ప్రతికూల ఆర్థిక పరిస్థితులు, ఉద్రిక్తతలు, వాణిజ్య యుద్ధం వంటివి మదుపరులను స్టాక్ మార్కెట్ల నుంచి పెట్టుబడుల ఉపసంహరణలకు ప్రోత్సహిస్తున్నాయి. పెట్టుబడుల రక్షణార్థం బంగారంపైకి మళ్లిస్తుండటంతో ధరలు పైపైకే వెళ్తున్నాయి. సెంట్రల్ బ్యాంకుల పసిడి కొనుగోళ్లు ఇందుకు దోహదం చేస్తున్నాయి. ఈ క్రమంలో తాజా అంచనాలు మిక్కిలి ప్రాధాన్యాన్నే సంతరించుకున్నాయి. నిజానికి గడిచిన 20 ఏండ్లలో ఎస్‌అండ్‌పీ 500 ఇండెక్స్‌లో స్టాక్స్ 11 శాతం మాత్రమే రిటర్న్స్‌ను ఇన్వెస్టర్లకు అందించాయి. అయితే గత 25 ఏండ్లుగా బంగారం 12.55 శాతం వార్షిక రాబడులను ఇచ్చింది. ఇది భవిష్యత్తులో మరింతగా పెరగవచ్చని బలమైన అంచనాలు వినిపిస్తున్నాయి.

## గుడ్ న్యూస్..ఎగుమతి సుంకం రద్దు, తగ్గనున్న ఉల్లి ధరలు..




**న్యూఢిల్లీ-నవభూమి:**దేశంలో మధ్య తరగతి ప్రజలకు గుడ్ న్యూస్. త్వరలో ఉల్లి ధరలు మరింత తగ్గనున్నాయి. ఎందుకంటే ఉల్లి ధరలను అదుపులో ఉంచేందుకు కేంద్ర ప్రభుత్వం కీలక నిర్ణయం తీసుకుంది. అయితే ఈ ఏడాది ఏప్రిల్ 1, 2025 నుంచి ఉల్లిపై 20 శాతం ఎగుమతి సుంకాన్ని రద్దు చేయాలని కేంద్ర ప్రభుత్వం నిర్ణయించింది. ఈ నిర్ణయం, ప్రజా ప్రయోజనాలను దృష్టిలో ఉంచుకుని ప్రకటించారు. కేంద్ర పరోక్ష పన్నులు, కస్టమ్స్ బోర్డు శనివారం సాయంత్రం ఈ మేరకు నోటిఫికేషన్ విడుదల చేసింది. ఉల్లిపై ఎగుమతి సుంకాన్ని “సున్నా”కి తగ్గించడంతో ధరలు మరింత తగ్గుతాయని వ్యాపార వర్గాలు భావిస్తున్నాయి. 2023 డిసెంబర్‌లో దేశంలో ఉల్లి ధరలు సంక్షోభాన్ని ఎదుర్కొన్న సమయంలో, కేంద్ర ప్రభుత్వం ఉల్లి ఎగుమతిని పూర్తిగా నిషేధించింది. దీంతో, దేశీయ మార్కెట్లో ఉల్లి ధరలు మరింత పెరిగాయి. అయితే, 2024 మే నెలలో, కేంద్ర ప్రభుత్వం పునఃప్రారంభించిన ఎగుమతులను నియంత్రించినప్పటికీ, కనీస ఎగుమతి ధరను పెంచారు. ఆ క్రమంలో 40 శాతం ఎగుమతి సుంకాన్ని విధించారు. తర్వాత, 2024 సెప్టెంబర్ నెలలో, కనీస ఎగుమతి ధరను రద్దు చేస్తూ, 20 శాతం ఎగుమతి సుంకం విధించారు. ఈ నిర్ణయం, దేశంలో ఉల్లి ధరలను తగ్గించేందుకు, దేశీయ మార్కెట్లో సరఫరా పెరిగే అవకాశాన్ని కల్పించింది. ఉల్లి ఎగుమతి..అయినప్పటికీ 2023-24 ఆర్థిక సంవత్సరంలో 17.17 లక్షల టన్నుల ఉల్లిని విదేశాలకు ఎగుమతి చేశారు. మరోవైపు 2024-25 ఆర్థిక సంవత్సరంలో (మార్చి 18 వరకు) 11.65 లక్షల టన్నుల ఉల్లి ఎగుమతి చేశారు. ప్రస్తుతానికి దేశీయ మార్కెట్‌లో ఉల్లి ధరలు గత సంవత్సరాల ఇదే కాలం కంటే ఎక్కువగా ఉన్నప్పటికీ, అఖిల భారత సగటు మోడల్ ధరలు 39 శాతం తగ్గినట్లు చెబుతున్నారు. ఇదే సమయంలో, గత ఒక నెలలో అఖిల భారత సగటు రిటైల్ ధరలు 10 శాతం తగ్గినట్లు మార్కెట్ వర్గాలు తెలిపాయి. ఉల్లి మార్కెట్ మార్పులు..ప్రభుత్వం నిర్ణయాల వల్ల, ఉల్లి మార్కెట్లో అనేక మార్పులు వచ్చాయి. 2024 సెప్టెంబర్ నుంచి నెల వారీ ఉల్లి ఎగుమతి పరిమాణం 72,000 టన్నుల నుంచి జనవరి 2025 నాటికి 1.85 లక్షల టన్నులకు పెరిగింది. ఈ ఎగుమతి వృద్ధి, ఉల్లి సరఫరాలో ఒక కీలక మార్పును సూచిస్తుంది. రైతులకు లాభదాయకమైన ధరలను నిర్ధారించడం, వినియోగదారులకు ధరలు అదుపులో ఉంచడం వంటివి ప్రభుత్వం తీసుకున్న నిర్ణయాల ఫలితంగా మారుతున్నాయి. రానున్న రోజుల్లో..ప్రభుత్వం తీసుకున్న ఈ నిర్ణయం, రైతుల పట్ల సానుకూల దృక్కోణాన్ని ప్రతిబింబిస్తుంది. రైతులకు లాభదాయకమైన ధరలతోపాటు, వినియోగదారులకు కూడా ఉల్లి రేట్లు అదుపులో ఉంటాయి. రబీ పంటలు బాగా పండిన క్రమంలో ఈ ధరలు మరింత తగ్గుతాయని వ్యాపార వర్గాలు అంటున్నాయి. ముఖ్యంగా రిటైల్ ధరలు క్రమంగా తగ్గుతున్న నేపథ్యంలో ప్రజలు ఎక్కువ ఉల్లిని కొనుగోలు చేసే అవకాశం ఉంది ఇది మార్కెట్లో సరైన సరఫరా గమనాన్ని నెలకొల్పి, ప్రతి స్థాయిలోనూ మంచి ప్రభావాన్ని చూపిస్తుంది. ఈ నిర్ణయం దేశీయ, అంతర్జాతీయ ఉల్లి మార్కెట్‌లను ప్రభావితం చేస్తుంది. సరైన సరఫరా, ధరల నియంత్రణతో ప్రజలకు ఇబ్బందులు లేకుండా చేస్తుంది.

## ఆప్షన్ ట్రేడింగ్ అక్కడే కొంప ముంచుతోంది : సెబీ చైర్మన్

**న్యూఢిల్లీ-నవభూమి:**స్టాక్ మార్కెట్లోని ఎఫ్ అండ్ ఓ ) ట్రేడింగ్‌పై కొత్త సెబీ చీఫ్ తుహిన్ కాంత పాండేకూడా ఆందోళన వ్యక్తం చేశారు. ట్రేడర్ల అతి విశ్వాసం, ముఖ్యంగా గడువుముగిసే కొన్ని నిమిషాల ముందు మార్కెట్లోకి ప్రవేశించడం వల్ల తీవ్రంగా నష్టపోతున్నారని అభిప్రాయపడ్డారు. ఫ్యూచర్ అండ్ ఆప్షన్స్ సిగ్మెంట్లో ట్రేడింగ్ చేస్తున్న రిటైల్ ఇన్వెస్టర్ల గురించి ఇప్పటికే అనేక పర్యాయాలు సెబీ మాజీ చీఫ్ మాధబి పూరి బుచ్ కూడా ఆందోళన వ్యక్తం చేసిన సంగతి తెలిసిందే. కాగా, ఎఫ్ అండ్ ఓ మదుపర్లపై చాలా కాలంగా ఇవే తరహా ఆందోళనలు కొనసాగుతున్నాయి. ఎఫ్ అండ్ ఓ ట్రేడర్లు భారీ స్థాయిలో నష్టాల పాలు కావడం లెక్కలతో సహా చూపిస్తున్నారు.

# ఎంది సామి..మళ్లీ 9 వేల లే ఆఫ్స్, ఇక మిగిలేది ఎవరు..



**న్యూఢిల్లీ-నవభూమి:**ది రిజిస్టర్ నివేదిక ప్రకారం, ఈ తొలగింపులు ఐబిఎం క్లౌడ్ క్లాసిక్ యూనిట్ వంటి అనేక విభాగాలను ప్రభావితం చేస్తున్నాయని అంటున్నారు. ఇందులో దాదాపు 50% మంది ఉద్యోగులు ఈ మార్పులకు గురవుతున్నారని భావిస్తున్నారు. అయితే, పశ్చిమ దేశాలలో ఉద్యోగ నష్టాలు పెరుగుతున్నప్పటికీ, ఈ పునర్నిర్మాణం భారతదేశానికి అనుకూలంగా మారవచ్చని నిపుణులు అంటున్నారు. గత కొన్ని సంవత్సరాలుగా ఐబిఎం తన ఉద్యోగులను ఇండియాకు మార్చుతుందని అంటున్నారు. ఈ క్రమంలో వీలైనంత ఎక్కువ మందిని భారతదేశానికి తరలించే ప్రయత్నం చేస్తున్నట్లు సమాచారం. ఖర్చులు తక్కువగాఐబిఎం ప్రస్తుతం యుఎస్ కంటే భారతదేశంలో ఎక్కువ ఉద్యోగ అవకాశాలను కలిగి ఉందని, ఉద్యోగం కోల్పోయిన ఒక యుఎస్ ఉద్యోగి కూడా పేర్కొన్నాడు. భారతదేశంలో ప్రతిభ సమృద్ధిగా ఉండటంతో పాటు, నిర్వహణ ఖర్చులు తక్కువగా ఉండటం వల్ల ఐబిఎం తన శ్రామిక శక్తిని భారతదేశం వైపు తిరిగి కేంద్రీకరించాలనే వ్యూహాన్ని అవలంబిస్తోందన్నారు. ఐబిఎం %CEO% అరవింద్ కృష్ణ కూడా ఈ విషయాన్ని గతంలో బహిరంగంగా చర్చించారు.

**అవకాశాలను పెంచే దిశగా**

ఈ క్రమంలో ఊహించిన విధంగా జరిగితే, భారతీయ టెక్ ఉద్యోగులు ముఖ్యంగా క్లౌడ్, మౌలిక సదుపాయాలు, సేల్స్, కన్సల్టింగ్ అనుభవం ఉన్నవారు మరిన్ని ఉద్యోగ అవకాశాలను పొందవచ్చు. ప్రధానంగా పశ్చిమ దేశాలలో తొలగించబడుతున్న వారు భారతదేశంలో అవకాశాలను పొందవచ్చు. ఐబిఎం ఇప్పటికే బెంగళూరు, హైదరాబాద్, పూణే, చెన్నై వంటి నగరాల్లో విస్తరించింది. ఇది భారతదేశంలో ఉద్యోగ అవకాశాలను పెంచే దిశగా కృషి చేస్తోందని నిపుణులు అంటున్నారు.

**భారతదేశంలో ఉద్యోగ అవకాశాలు**

ఈ మార్పులు భారతదేశంలో రంగానికి కొత్త అవకాశాలను తెచ్చే అవకాశం ఉంది. ఐబిఎం వంటి సంస్థలు భారతదేశంలో ఉన్న ప్రతిభను గుర్తించి, నైపుణ్యాలను ఉపయోగించుకోవడానికి సిద్ధంగా ఉన్నాయి. ఈ నేపథ్యంలో, భారతీయ ఉద్యోగులు తమ నైపుణ్యాలను పెంచుకోవడం, కొత్త సాంకేతికతలను నేర్చుకోవడం ద్వారా ఈ అవకాశాలను సద్వినియోగం చేసుకోవచ్చు. ఈ క్రమంలో క్లౌడ్ కంప్యూటింగ్, డేటా అనలిటిక్స్, సైబర్ సెక్యూరిటీ వంటి రంగాలలో నైపుణ్యాలు కలిగిన వ్యక్తులకు మంచి అవకాశాలు రానున్నాయి.

నవభూమి
www.navabhoomi.in
www.epaper.navabhoomi.in
11 హైదరాబాద్
సోమవారం
24 । మార్చి । 2025



# ఆయన శారీరకంగా అలసిపోయారు, మానసిక స్థిమితం కోల్పోయారు



**సమస్తిపూర్:-నవభూమి:** బీహార్ ముఖ్యమంత్రి నితీష్ కుమార్ పై జన్ సురాజ్ వ్యవస్థాపకుడు ప్రశాంత్ కిషోర్ సంచలన వ్యాఖ్యలు చేశారు. నితీష్ శారీరకంగా అలసిపోయారని, మానసిక పరిస్థితి సరిగా లేదని, దీంతో ఆయన పాలన విషయంలో రాజీపడుతున్నారని ఆరోపించారు. సీఎం పదవికి రాజీనామా చేయాలని డిమాండ్ చేశారు. ఆదివారంనాడిక్కడ మీడియాతో ప్రశాంత్ కిషోర్ మాట్లాడుతూ..."నితీష్ కుమార్ ఆరోగ్య పరిస్థితిపై ఆయన మిత్రపక్షం నేత సుశీల్ కుమార్ మోదీ తొలిసారి మాట్లాడారు. ఆ తర్వాత పలువురు బీహార్ మంత్రులు కూడా వ్యాఖ్యానించారు. గత జనవరి వరకూ నేను ఎలాంటి కామెంట్లు చేయలేదు. కానీ బీపీఎస్‌సీ నిరసనల తర్వాత నితీష్ కుమార్ మానసిక స్థితి క్షీణించిందని తెలిసింది. ఆ కారణంగానే రాష్ట్రంలో ఏమి జరుగుతోందో కూడా తెలియని పరిస్థితిలో ఆయన ఉన్నారు. ఆయన శారీరకంగా అలసిపోయారు. మానసికంగా ఫిట్‌నెస్‌తో లేరు. ఇందుకు సాక్ష్యం కావాలంటే ఆయన కౌన్సిల్‌లో మంత్రుల పేర్లు అడిగి చూడండి. ముఖ్యమంత్రి పదవికి నితీష్ కుమార్ రాజీనామా చేయడం మంచిది" అని సూచించారు. ఇందులో బీజేపీకి కూడా సమాన బాధ్యత ఉందని, నితీష్ కుమార్ మానసిక స్థితి కోల్పోయిన విషయం ప్రధానికి కానీ, హోం మంత్రికి కానీ తెలిసినట్టు లేదని అన్నారు.

## కోళ్లను ఎక్సర్ సైజ్ చేయించారు.. రెండేళ్ల జైలు శిక్షకు గురయ్యారు



**న్యూఢిల్లీ-నవభూమి:**"తెలిసి చేసినా.. తెలియక చేసినా తప్పు తప్పే" అని పెద్దలు ఊరికే అనలేదు. ఇంగ్లాండ్‌లో జరిగిన ఒక సంఘటన ఈ సామెతను నిజం చేసింది. సరదాగా కోడిపుంజులకు ట్రెడ్‌మిల్ ఎక్కించిన ఇద్దరు వ్యక్తులకు అక్కడి కోర్టు ఏకంగా రెండేళ్ల జైలు శిక్ష విధించింది. ఈ తీర్పు జంతు సంరక్షణ చట్టాల యొక్క కఠినత్వాన్ని, ప్రాణుల పట్ల మానవులు ఎలా వ్యవహరించాలో తెలియజేస్తోంది. మన దేశంలో కోడిపుంజుల పెంపకం ఒక ప్రత్యేకమైన సంస్కృతి. ఇక్కడ మాంసాహారం కోసం వీటిని ఎక్కువగా ఉపయోగిస్తారు. ముఖ్యంగా సంక్రాంతి సమయంలో కోడిపందాలు ఒక పెద్ద ఉత్సవంలా జరుగుతాయి. ఈ పందాల కోసం కోడిపుంజులను ఎంతో శ్రద్ధగా పెంచుతారు. వాటికి జీడిపప్పు, బాదం వంటి పోషకాహారం అందిస్తారు. ప్రత్యేకమైన గూళ్లలో ఉంచుతారు. వ్యాయామం, ఈత వంటి శిక్షణ కూడా ఇస్తారు. పందెం కోసం వీటిని ఏడాది ముందు నుంచే సిద్ధం చేయడం ప్రారంభిస్తారు. వాటి కోసం ప్రత్యేకమైన షెడ్లు నిర్మిస్తారు. రాత్రిపూట ఏసీ గదుల్లో విశ్రమించేలా చూసుకుంటారు. కొబ్బరి తోటల్లో ప్రత్యేకంగా వీటిని పెంచుతూ, ఉదయం సాయంత్రం స్నానం చేయించి, ఆ తర్వాత భద్రంగా షెడ్లలో ఉంచుతారు. ఇలా మన దేశంలో కోడిపుంజులను ఎంతో సుకుమారంగా పెంచుతారు. కానీ, విదేశాల్లో పరిస్థితి భిన్నంగా ఉంటుంది. అక్కడ నాటుకోళ్లను తినే సంస్కృతి అంతగా లేదు. అయితే, కొంతమంది మాత్రం సరదా కోసం వీటిని పెంచుకుంటారు. తమ దర్పాన్ని ప్రదర్శించడానికి వాటిని రకరకాలుగా అలంకరిస్తుంటారు. ఇంగ్లాండ్‌లోని లింకోల్న్‌షైర్ ప్రాంతానికి చెందిన ఇద్దరు వ్యక్తులు తమ పెంపుడు నాటుకోడి పుంజులు లావుగా ఉన్నాయని భావించారు. వాటికి వ్యాయామం చేయించాలని సరదాగా ట్రెడ్‌మిల్‌పై ఎక్కించారు. అయితే, ఇంగ్లాండ్‌లో జంతు సంరక్షణ చట్టాలు చాలా కఠినంగా ఉంటాయి. ఈ విషయం వెలుగులోకి రావడంతో పోలీసులు వెంటనే స్పందించారు. ఆ ఇద్దరినీ అరెస్టు చేసి కోర్టులో హాజరుపరిచారు. ఈ కేసును విచారించిన న్యాయమూర్తి వారిద్దరికీ రెండేళ్ల జైలు శిక్ష విధిస్తూ సంచలన తీర్పు చెప్పారు. "జంతువులు మూగ ప్రాణులు. వాటి పట్ల కఠినంగా వ్యవహరించడం అత్యంత దారుణమైన చర్య. జంతువులు లావుగా ఉంటే వచ్చిన నష్టమేంటి? అది ప్రపంచ సమస్య కాదు కదా! వాటిని ట్రెడ్‌మిల్‌పై ఉంచాల్సిన అవసరం ఏముంది? అలా చేయడం వల్ల అవి అనారోగ్యానికి గురయ్యాయి. వాటి బాధ వీరికి తెలియాలి కాబట్టి ఈ శిక్ష విధిస్తున్నాను. ఈ శిక్షతో అయినా వారు మారుతారని ఆశిస్తున్నాను" అని జడ్జి తన తీర్పులో పేర్కొన్నారు. ట్రెడ్‌మిల్‌పై ఉంచడం వల్ల ఆ రెండు కోడిపుంజులు స్వల్పంగా గాయపడ్డాయి. వాటికి వెటర్నరీ ఆసుపత్రిలో చికిత్స అందించిన తర్వాత అవి కోలుకున్నాయి. తాము సరదా కోసమే అలా చేశామని ఆ యువకులు కోర్టుకు విన్నవించుకున్నప్పటికీ, న్యాయమూర్తి వారి వాదనను పరిగణనలోకి తీసుకోలేదు. జంతు సంరక్షణకు భంగం కలిగించినందుకే ఈ తీర్పు ఇచ్చారని ఇంగ్లాండ్ మీడియా కథనాలు వెల్లడించాయి. ఈ సంఘటన జంతువుల పట్ల మనం ఎలా వ్యవహరించాలనే దానిపై ఒక పెద్ద ప్రశ్నను లేవనెత్తుతోంది. మన సంస్కృతిలో జంతువులను ఒక రకంగా చూస్తే, ఇతర దేశాల్లో వాటి సంరక్షణకు అత్యంత ప్రాధాన్యత ఇస్తారు. ఏది ఏమైనా, జంతువులు కూడా జీవులేనని, వాటికి నొప్పి, బాధ ఉంటాయని గుర్తెరగడం మానవులుగా మన బాధ్యత. సరదా కోసమైనా సరే, వాటికి హాని కలిగించేలా ప్రవర్తించడం ఎంత మాత్రం సమర్థనీయం కాదు. ఈ తీర్పు ద్వారా అయినా ప్రజల్లో జంతు సంరక్షణ పట్ల అవగాహన పెరుగుతుందని ఆశిద్దాం.

## సంభాల్ హింసాకాండలో కీలక మలుపు.. జామా మసీదు చీఫ్ అరెస్టు



**లక్నో-నవభూమి:** ఉత్తరప్రదేశ్‌లోని సంభాల్ లో గత ఏడాది నవంబర్ 24న జరిగిన హింసాకాండ కేసులో కీలక పరిణామం చోటుచేసుకుంది. ఈ ఘటనతో ప్రమేయం ఉన్నట్టుగా భావిస్తున్న షాహి జామా మసీదు కమిటీ అధ్యక్షుడు జాఫర్ అలి ని పోలీసులు ఆదివారంనాడు అరెస్టు చేశారు. స్థానిక పోలీసులతో ఏర్పాటు చేసిన ప్రత్యేక విచారణ బృందం ఇంతకుముందు కూడా ఆయన సాక్ష్యాన్ని నమోదు చేసేందుకు కస్టడీలోకి తీసుకుందని అధికారులు తెలిపారు. అయితే, మార్చి 24న త్రిసభ్య జ్యుడిషియల్ కమిటీ ముందు వాంగ్మూలం ఇవ్వకుండా అడ్డుకునేందుకే జాఫర్ అలీని అరెస్టు చేసినట్టు ఆయన సోదరుడు తాహిర్ అలీ ఆరోపించారు. హింసాకాండ ఘటనలో జాఫర్ అలీని అరెస్టు చేసినట్టు సంభాల్ పోలీసు సూపరింటెండెంట్ ధ్రువీకరించారు. అయితే మరిన్ని వివరాలు వెల్లడించేందుకు నిరాకరించారు. మొఘులుల కాలం నాటి మసీదు రీసర్వే సందర్భంగా గత నవంబర్ 24న హింసాకాండ చెలరేగింది. ఈ ఘటనలో నలుగురు ప్రాణాలు కోల్పోగా, పలువురు గాయపడ్డారు. ఈ ఘటన తీవ్ర సంచలనం సృష్టించడంతో ఉత్తరప్రదేశ్ ప్రభుత్వం నలుగురు సభ్యులతో కూడిన జ్యుడిషియల్ ప్యానల్‌ను విచారణకు నియమించింది.

కాగా, సోమవారంనాడు జ్యుడిషియల్ ప్యానల్ ముందు జఫర్ అలి హాజరై వాంగ్మూలం ఇవ్వాల్సి ఉందని, అలా జరక్కుండా చేసేందుకు ఉద్దేశపూర్వకంగానే ఆయనను ముందస్తుగా అరెస్టు చేశారని తాహిర్ అలీ ఆరోపించారు. ఉదయం 11.15 గంటలకు విచారణ అధికారి తమ ఇంటికి వచ్చారని, సర్కిల్ అధికారి కులదీప్ సింగ్ మాట్లాడాలనుకుంటున్నారని తమతో చెప్పారని అన్నారు. సర్కిల్ ఆఫీసర్ గత రాత్రి కూడా తమతో మాట్లాడారని, కమిషన్ విచారణ సోమవారం ఉందనగా ఉద్దేశపూర్వకంగానే జాఫర్ అలీని అరెస్టు చేసి జైలుకు పంపారని వివరించారు. హింసాకాండలో చనిపోయిన వారంతా పోలీసు బుల్లెట్లకే చనిపోయినట్టు జాఫర్ ఇప్పటికే మీడియా ముందు చెప్పారని, ఆ మాటను ఆయన ఉపసంహరించుకునే ప్రసక్తే లేదని తాహిర్ అలీ తెలిపారు. జాఫర్‌ను కస్టడీలోకి తీసుకునేటప్పుడు ఆయన ఏమైనా చెప్పారా అని మీడియా ప్రశ్నించగా, తాను సత్యమే చెబుతానని, అందుకోసం జైలుకు వెళ్లేందుకు కూడా సిద్ధంగా ఉన్నానని తన సోదరుడు చెప్పినట్టు తాహిర్ అలీ సమాధానమిచ్చారు.

# ఇన్‌స్టాగ్రామ్‌లో లైవ్ పెట్టి ఉరివేసుకున్న భర్త.. విడ్డూరం చూసిన భార్య, అత్త



**న్యూఢిల్లీ-నవభూమి:** ఇదెక్కడి శాడిజంరా అయ్యా.. సాటి మనిషి, అందులోనూ ఎన్నో నెలల పాటు కలిసి ఉన్న వ్యక్తి చనిపోతుంటే చోద్యం చూస్తూ ఉన్నారు తప్పా, కనీసం వద్దని వారించడమో, కాపాడటమో చేయలేదు. మధ్యప్రదేశ్‌లో జరిగిన ఈ ఘటన విస్మయం కలిగిస్తోంది. కనీస మానవత్వం చూపని వారిని చూస్తే ఒళ్లు గగుర్పొడుస్తుంది. అసలు విషయం ఏమిటంటే..?ఇది కూడా ఓ భార్యా బాధితుడి వ్యథే. భార్య, అత్త వేధింపులు భరించలేక ఆత్మహత్యకు పాల్పడ్డ ఓ పూజారి దీనగాథ ఇది. మధ్యప్రదేశ్ రేవా జిల్లాలోని అమా నౌధియా గ్రామానికి చెందిన శివ ప్రకాష్ త్రిపాఠి ఓ పూజారి. ఛత్తీస్‌గఢ్‌లోని వార్డాలోని ఓ ఆలయంలో పూజారిగా సేవ చేశాడు. కాగా, రోడ్డు ప్రమాదంలో కాలికి తీవ్ర గాయం అయింది. ఊతకర్ర లేనిది నడవలేని పరిస్థితి దీంతో అతను తన స్వగ్రామానికి తిరిగి వచ్చేశాడు. 26 ఏళ్ల శివ ప్రకాష్ త్రిపాఠికి రెండేళ్ల క్రితం ప్రియా శర్మతో వివాహం జరిగింది. రోడ్డు ప్రమాదం జరగడంతో వైవాహిక సమస్యలు తలెత్తాయి. ఈ క్రమంలోనే భార్య మరో వ్యక్తితో చనువుగా ఉండటం మొదలైంది. ఇది గమనించిన త్రిపాఠికి తనకు నచ్చజెప్పేందుకు ప్రయత్నించాడు. కానీ ప్రియ శర్మ ఎంతకీ తన పద్ధతి మార్చుకోలేదు సరికదా.. భర్తను వదిలేసింది. పసి బిడ్డతో కలిసి పుట్టింటికి వెళ్లిపోయింది.

భార్యను తిరిగి ఇంటికి తీసుకువచ్చేందుకు త్రిపాఠి చాలా సార్లు అత్తింటికి వెళ్లి నచ్చజెప్పే ప్రయత్నం చేశాడు. కానీ ప్రియ శర్మ ఒప్పుకోలేదు, అత్త కూడా అడ్డుపడింది. ఇటీవలి మరోసారి త్రిపాఠి అత్తింటికి వెళ్లి నచ్చజెప్పే ప్రయత్నం చేశాడు. భార్యను, అడ్డుపడుతున్న అత్తను ప్రాధేయపడ్డాడు. వారు అతడ్ని తీవ్రంగా అవమానించడంతో పాటు చేయి చేసుకున్నారు. మానసికంగా ఎంతో కుమిలిపోయిన పూజారి త్రిపాఠి ఇంటికి తిరిగి వచ్చాడు. తన గదిలోకి వెళ్లి లాక్ చేసుకున్నాడు. ఇన్‌స్టాగ్రామ్ లైవ్‌లో ఉరి వేసుకుని ఆత్మహత్యకు పాల్పడ్డాడు.

తను ఉరి వేసుకుని ఆత్మహత్యకు పాల్పడటాన్ని త్రిపాఠి ఇన్‌స్టాగ్రామ్ లైవ్ పెట్టాడు. దానిని త్రిపాఠి భార్య, ఆమె తల్లి కలిసి వీక్షించారు కూడా. కానీ త్రిపాఠిని వారించలేదు, ఆపే ప్రయత్నం కూడా చేయలేదు. చివరకు త్రిపాఠి కుటుంబ సభ్యులు గమనించి పోలీసులకు సమాచారం ఇచ్చారు. దీంతో అతడి ఆత్మహత్యపై కేసు నమోదు చేశారు. భార్య ప్రియ, ఆమె తల్లిని పోలీసులు అరెస్టు చేసి కస్టడీకి తరలించారు. ప్రియకు మరో వ్యక్తితో వివాహేతర సంబంధం ఉందని దర్యాప్తులో తెలుసుకున్నారు. ఈ కేసుపై మరిన్ని వివరాలు సేకరిస్తున్నారు.

# వ్యవస్థల లాలస.. అందుకే ఇలా?!



**న్యూఢిల్లీ-నవభూమి:** ఈ నెల 14న జస్టిస్ వర్మ ఇంట్లో జరిగిన స్వల్ప అగ్ని ప్రమాదం అనంతరం.. ఏడు రోజుల తర్వాత ఈ ఘ టన వెలుగు చూసింది. అయితే.. ఇది దేశమీడియా బయట పెట్టిన విషయం కాదు. అంతర్జాతీయ మీడి యా ఈ విషయాన్ని వెలుగులోకి తెచ్చింది. అనంతరం.. మన మీడియా అందుకుంది. దీనిని బట్టి.. వ్యవస్థలు ఎంతగా మేనేజ్ అవుతున్నాయన్నది తెలుస్తూనే ఉందని.. అంతర్జాతీయ మీడియా చేసిన వ్యాఖ్య పాలకులకు వినిపించకపోయినా.. ప్రజలు విన్నారు. సదరు జస్టిస్ వర్మ, ఆయన ఇంట్లో లభించిన నోట్ల కట్టలు.. ఈ సంగతుల వ్యవహారం.. ఎలాంటిది? ఎప్పు డు తేలుతుంది? దీనిలో ఎవరు నిందితులు..? ఎలా ఆ సొమ్ములు వచ్చాయి? అనే కీలక విషయాలు పక్క న పెడితే.. అసలు ఇలా.. వ్యవస్థల దిగజారుడు వ్యవహారం ఎప్పుడు ఎలా మొదలైందనే సంగతి ఆసక్తి కరం. సీబీఐ, ఈడీ, ఐటీ వంటి స్వయంప్రతిపత్తి ఉన్న సంస్థలు.. ఏనాడో దారి మళ్లాయి. తమకు వ్యతిరేకంగా గళం వినిపించిన వారిపై ప్రయోగించే ఆయుధాలుగా.. రాజకీయ వస్తువులుగా అవిమారాయి. ఇక, తమకు అనుకూలంగా తీర్పులు ఇచ్చిన వారికి నజరానాలు సమర్పించే సంస్కృతి కూడా పెరిగింది. ఓబులాపురం మైనింగ్ కేసులో తనకు బెయిల్ ఇప్పించేందుకు సహకరించిన ఓ న్యాయమూర్తికి గాలి జనార్దన్ రెడ్డి ముడుపులు ఇవ్వడం.. తెలిసిందే. ఈ కేసులో సదరు న్యాయమూర్తి అరెస్టయి.. జైల్లో కూడా ఉన్నారు. ఇక, అయోధ్యలో రామమందిర నిర్మాణానికి అనుకూల తీర్పు ఇచ్చిన ఐదుగురు న్యాయమూర్తులు ఇప్పుడు ఎలాంటి పదవులు అనుభవిస్తున్నారో.. జగద్విత‌మే!. ఈ పరంపరే.. ఇప్పుడు నిప్పుకు సైతం చెద పట్టించే పరిస్థితిని తీసుకువచ్చింది. అందుకే.. తమ భవితవ్యాన్ని దృష్టిలో పెట్టుకుని.. పదవుల లాలసపై ముచ్చట పడుతున్న కొందరు ఇలా పెడదారి పడుతున్నారంటే.. పాపం కేంద్రంలోని పెద్దలది కాదా? అన్నది చర్చ. జస్టిస్ సదాశివం.. కేరళ గవర్నర్ అయినా.. మరో న్యాయమూర్తి.. జస్టిస్ గొగోయ్ రాజ్యసభ సభ్యుడు అయినా.. తెరవెనుక ఏమీ లేకుండానే జరిగిపోయాయా? సో.. ఈ పరిణామాలను బట్టి ఎవరి ప్రమేయం ఉందో అర్థమవుతుంది.

## లేజర్ కిరణాలతో షుగర్ టెస్ట్!



**న్యూఢిల్లీ-నవభూమి:** రక్తంలో గ్లూకోజ్ స్థాయిలు కొలవడం మధుమేహ బాధితులకు పెద్ద సమస్య. సూదితో చర్మాన్ని గుచ్చి రక్తాన్ని సేకరిస్తుంటారు. బెంగళూరులోని ఇండియన్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ సైన్స్ (ఐఐఎస్సీ) శాస్త్రవేత్తలు దీనికి ప్రత్యామ్నాయాన్ని కనుగొన్నారు. చర్మానికి కోతపెట్టాల్సిన అవసరం లేకుండా కాంతి (లేజర్ కిరణాలు) సాయంతో రక్తంలో గ్లూకోజ్ స్థాయిని కొలిచే మార్గాన్ని వారు కనుగొన్నారు. 'ఫొటోఅకౌస్టిక్ సెన్సింగ్' టెక్నాలజీలో కణజాలం సంకోచించి.. వ్యాకోచిస్తుంది. ఈ క్రమంలో చిన్నపాటి ప్రకంపనల్ని డిటెక్టర్లు పసిగడతాయి. ధ్వని తరంగ తీవ్రతను అనుసరించి గ్లూకోజ్ స్థాయిని నిర్ణయిస్తామని సైంటిస్టులు చెబుతున్నారు.

## బ్యాంకుల సమ్మె వాయిదా





**న్యూఢిల్లీ-నవభూమి:** ఈ నెల 24, 25 తేదీల్లో తలపెట్టిన దేశవ్యాప్త బ్యాంకుల సమ్మెను వాయిదా వేసినట్లు యునైటెడ్ ఫోరం ఆఫ్ బ్యాంక్ యూనియన్స్ ప్రకటించింది. సెంట్రల్ లేబర్ కమిషనర్‌తో శుక్రవారం జరిగిన చర్చలు సానుకూల ఫలితాలనిచ్చినట్లు తెలిపింది. బ్యాంకుల ఐదు రోజుల పని దినాలు, నియామకాలు, పనితీరు ప్రోత్సాహకాలు (పీఎల్ఐ) సహా ఇతర అంశాలపై మరింత చర్చించాలని ప్రతిపాదించినట్లు వెల్లడించింది. తమ డిమాండ్ల పట్ల సానుకూల పరిణామాల నేపథ్యంలో సమ్మెను ఒకట్రెండు నెలలు వాయిదా వేయాలని నిర్ణయించినట్లు తెలిపింది. తదుపరి చర్చలు ఏప్రిల్ మూడో వారంలో జరుగుతాయని పేర్కొంది.

**ఉల్లిపై ఎగుమతి సుంకం రద్దు**

న్యూఢిల్లీ: ఉల్లిపై 20 శాతం ఎగుమతి సుంకాన్ని కేంద్ర ప్రభుత్వం రద్దు చేసింది. ఈ నిర్ణయం వచ్చే నెల 1 నుంచి అమల్లోకి వస్తుంది. రైతుల ప్రయోజనాలను కాపాడటం కోసం ఈ నిర్ణయం తీసుకున్నట్లు కేంద్రం వెల్లడించింది. వినియోగదారులకు ఉల్లిపాయలు సరసమైన ధరలకు అందుబాటులో ఉంటాయని కేంద్రం తెలిపింది.

# ట్రంప్ కూతురుతో మామూలుగా ఉండదిక




**అమెరికా-నవభూమి:** అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ కుమార్తె ఇవాంక ట్రంప్ (43) మరోసారి వార్తల్లో నిలిచారు. అయితే ఈసారి ఆమె రాజకీయాల ద్వారా కాకుండా తన అద్భుతమైన మార్షల్ ఆర్ట్స్ నైపుణ్యాలతో అందరినీ ఆశ్చర్యపరిచారు. ప్రాచీన సంప్రదాయ మార్షల్ ఆర్ట్ అయిన జియూ-జిత్సూ (జుజుత్సూ)లో ఆమె సాధించిన ప్రావీణ్యం ప్రస్తుతం హాట్ టాపిక్ గా మారింది. ఇటీవల మియామీలోని ఓ వ్యాయామశాలలో ఇవాంక ట్రంప్ జుజుత్సూ నైపుణ్యాలను ప్రదర్శించారు. బ్లూ బెల్ట్ ధరించిన ఆమె తన ప్రత్యర్థులను క్షణాల్లో మట్టి కరిపించారు. ఆమె కనబరిచిన హస్త లాఘవం, వేగం అందరినీ ఇంప్రెస్ చేశాయి. ఇవాంక ట్రంప్ జుజుత్సూలో ఎంతటి బలం, క్రమశిక్షణ కలిగి ఉన్నారో ఈ వీడియో స్పష్టం చేస్తోంది. జుజుత్సూలో బ్లూ బెల్ట్ సాధించడం అంత సులువైన విషయం కాదు. దీని కోసం ఎంతో సాధన, అంకితభావం ఉండాలి. ఇవాంక ట్రంప్ నిత్యం ఈ మార్షల్ ఆర్ట్‌ను సాధన చేస్తారని తెలుస్తోంది. ఆమె శిక్షణ పొందుతున్న వీడియోను చూసిన అభిమానులు ఆనందం వ్యక్తం చేస్తున్నారు. గతంలో డొనాల్డ్ ట్రంప్ అధ్యక్షుడిగా ఉన్న సమయంలో ఇవాంక ట్రంప్ ఆయనకు సీనియర్ సలహాదారుగా సేవలందించిన విషయం తెలిసిందే. అయితే ప్రస్తుతం ఆమె రాజకీయాలకు దూరంగా ఉంటూ తన కుటుంబ బాధ్యతలకు, వ్యక్తిగత జీవితానికి ప్రాధాన్యం ఇస్తున్నారు. తనకు లభించిన సమయాన్ని ఇలాంటి ఆసక్తికరమైన విషయాలపై వెచ్చిస్తూ తన నైపుణ్యాలను మెరుగుపరుచుకుంటున్నారు. ఒకప్పుడు రాజకీయాల్లో తనదైన ముద్ర వేసిన ఇవాంక, ఇప్పుడు మార్షల్ ఆర్ట్స్ లోనూ తన ప్రతిభను చాటుకుంటున్నారు.

# హత్యకు గురైన మహిళ 18 నెలలకు తిరిగొచ్చింది.. జైల్లోనే నిందితులు, షాకింగ్ ఘటన



**న్యూఢిల్లీ-నవభూమి:** 18 నెలల క్రితం హత్యకు గురైన ఓ మహిళ.. ఉన్నట్టుండి హఠాత్తుగా ఇంటికి వచ్చింది. తామే దగ్గరుండి అంత్యక్రియలు చేసిన కుటుంబ సభ్యులు ఆమె తిరిగి రావడం చూసి షాక్ అయ్యారు. అసలు ఆమె నిజంగానే మనిషా లేక దెయ్యమా అని పదే పదే ఆమెను తాకి చూశారు. నిజంగా మనిషనే తెలుసుకుని వెంటనే పోలీసులకు ఫిర్యాదు చేశారు. ఎందుకంటే ఆమెను చంపేశారనే ఆరోపణలతో నలుగురు వ్యక్తులు జైల్లో శిక్షను అనుభవిస్తున్నారు. మరి ఆపై ఏం జరిగిందో తెలియాలంటే మీరీ స్టోరీ చదివేయాల్సిందే. మధ్య ప్రదేశ్‌లోని మందసౌర్ జిల్లా గాంధీ సాగర్‌కు చెందిన 35 ఏళ్ల లలితా బాయి 2023 సెప్టెంబర్ నెలలో కనిపించకుండా పోయింది. దీంతో ఆమె కుటుంబ సభ్యులు పోలీసులకు ఫిర్యాదు చేశారు. ఆపై చాలా చోట్ల కూడా వెతికారు. కానీ ఎలాంటి ఉపయోగమూ లేదు. అయితే ఓరోజు పోలీసులు.. ముఖం ఛిద్రమైన మహిళ మృతదేహాన్ని గుర్తించి... లలిత కుటుంబానికి పోలీసులు చూపించారు. చేతిపై పచ్చబొట్టు, కాలికి నల్లటి దారం వంటి ఉండడంతో రమేష్ బాంచాడా చనిపోయింది తన కూతురే అని చెప్పారు. నిజంగానే చనిపోయిందని భావించి అంత్యక్రియలు కూడా నిర్వహించారు. అయితే సదరు మహిళను హత్య చేసిన కేసులో నలుగులు వ్యక్తులను అరెస్ట్ చేశారు. అయితే ఇమ్రాన్, షారుక్, సోనూ, ఎజాజ్‌ను పోలీసులు అందుపులోకి తీసుకోగా.. కోర్టులో హాజరు పరిచి జైలుకు తరలించారు. అయితే ఊహించని విధంగా రెండు రోజుల కిందట లలితా బాయి తన ఇంటికి తిరిగి వచ్చింది. అది చూసి షాక్ అయిన కుటుంబ సభ్యులు నువ్వు నిజంగానే లలితా బాయివా అని అడిగారు. పదే పదే ప్రశ్నల వర్షం కురిపించారు. అయితే ఆమెను చంపిన కేసులో నలుగురు జైల్లో ఉండగా.. వెంటనే కుటుంబ సభ్యులు పోలీసులకు ఫోన్ చేశారు. హుటాహుటిన రంగంలోకి దిగిన పోలీసులు ఆమె వద్దకు వచ్చి.. మీరెవరు, ఇప్పుడెక్కడి నుంచి వచ్చారంటూ అడిగారు. ఈక్రమంలోనే లలితా బాయిని పోలీసులు ప్రశ్నించగా.. తెలిసిన వ్యక్తి తనను మోసం చేసి 5 లక్షల రూపాయలు అమ్మేశాడని చెప్పింది. ఇన్ని రోజులుగా బందీగా ఉన్నానని.. అవకాశం దొరకడంతో వారి చెర నుంచి బయట పడి ఇంటికి తిరిగొచ్చనని వివరించింది. అదంతా విన్న పోలీసులు పైఅధికారులకు విషయం తెలిపారు. అసలు హత్యకు గురైన మహిళ ఎవరు, ఆమెను చంపింది తాము జైల్లో వేసిన వారేనా కాదా అని తెలుసుకునే ప్రయత్నాలు చేస్తున్నారు.

## మణిపూర్‌లో సుప్రీంకోర్టు జడ్జిల పర్యటన



**ఇంఫాల్-నవభూమి:** కార్యనిర్వాహక, శాసన, న్యాయ వ్యవస్థల సాయంతో ప్రస్తుత కష్టకాలాన్ని మణిపూర్ రాష్ట్రం త్వరలోనే అధిగమించి మునుపటి వైభవాన్ని సంతరించుకుంటుందన్న ఆశాభావాన్ని సుప్రీం కోర్టు న్యాయమూర్తి జస్టిస్ బీఆర్ గవాయ్ వ్యక్తం చేశారు. ఆరుగురు సుప్రీం కోర్టు న్యాయమూర్తులతో కూడిన బృందం శనివారం కల్లోలిత మణిపూర్ రాష్ట్రంలో పర్యటించింది. చురాచాంద్‌పూర్‌లోని సహాయ శిబిరాన్ని బృందం సందర్శించింది. న్యాయ సేవల విభాగాన్ని, వైద్య శిబిరాన్ని, న్యాయ సహాయ క్లినిక్‌లను వారు వర్చువల్‌గా ప్రారంభించారు. మణిపూర్‌లో ప్రధాని నరేంద్ర మోదీ ఎప్పుడు పర్యటిస్తారని కాంగ్రెస్ ఎంపీ జైరాం రమేశ్ ప్రశ్నించారు. సుప్రీం కోర్టు న్యాయమూర్తులు శనివారం మణిపూర్‌ను సందర్శించడాన్ని ఆయన స్వాగతించారు.

# గ్రోక్ అదుర్స్: ఫోటో ఎడిటింగ్ ఫీచర్‌తో పాటు హిందీ రచ్చపై మస్క్ క్లారిటీ!




**న్యూఢిల్లీ-నవభూమి:** ట్విట్టర్‌లో సంచలనం సృష్టిస్తున్న ఏఐ చాట్‌బాట్ 'గ్రోక్' మరో అద్భుతమైన ఫీచర్‌తో యూజర్లను అలరించేందుకు సిద్ధమైంది. తాజాగా ఈ చాట్‌బాట్‌లో ఫోటో ఎడిటింగ్ ఫీచర్‌ను అందుబాటులోకి తీసుకువచ్చారు. యూజర్లు కేవలం టైప్ చేస్తే చాలు, గ్రోక్ ఆ ఫోటోను అద్భుతంగా ఎడిట్ చేసి చూపిస్తుంది. మార్ఫింగ్ చేసినా గుర్తుపట్టలేనంత సహజంగా ఈ ఎడిటింగ్ ఉంటుందని స్వయంగా ఎలాన్ మస్క్ ఒక వీడియోను షేర్ చేశారు. ఇదివరకే సూటిగా, సుత్తి లేకుండా సమాధానాలిస్తూ నెటిజన్ల దృష్టిని ఆకర్షించిన గ్రోక్, ఇప్పుడు ఫోటో ఎడిటింగ్ ఫీచర్‌తో మరింత క్రేజ్ సంపాదించుకునేలా ఉంది. . భర్తపై భార్య పోలీసులకు ఫిర్యాదు! మరోవైపు, గ్రోక్ ఇటీవల భారత్‌లో హిందీ తిట్ల వివాదంతో వార్తల్లో నిలిచింది. కొంతమంది యూజర్లు అడిగిన ప్రశ్నలకు గ్రోక్ హిందీలో అభ్యంతరకర వ్యాఖ్యలు చేసిందని ఆరోపించారు. అయితే గ్రోక్ సినిమాలు, రాజకీయాలు, క్రీడలపై చాలా నిజాయితీగా సమాధానాలు ఇస్తోందని కొందరు నెటిజన్లు సమర్థిస్తున్నారు. ఈ వివాదంపై ఒక అంతర్జాతీయ మీడియా కథనం ప్రచురించగా ఎలాన్ మస్క్ నవ్వుతున్న ఎమోజీతో స్పందించారు. మస్క్ రిప్లై వైరల్ కావడంతో నెటిజన్లు భిన్న రకాలుగా స్పందిస్తున్నారు. ఒక నెటిజన్ మస్క్ పోస్ట్‌కు అర్థం ఏమిటని గ్రోక్‌ను ప్రశ్నించగా "భారత్‌లో నెలకొన్న ఈ రాజకీయ వివాదం నవ్వు తెప్పించేదిగా ఉందని ఆయన భావిస్తున్నట్లు" గ్రోక్ సమాధానమిచ్చింది. ఎలాన్ మస్క్‌కు చెందిన ఎక్స్‌ఏఐ సంస్థ ఈ గ్రోక్ చాట్‌బాట్‌ను అభివృద్ధి చేసింది. ఇది భూమిపై అత్యంత తెలివైన ఏఐ సాధనమని మస్క్ అభివర్ణించారు. గ్రోక్ హిందీ భాషను కూడా ఉపయోగించగలదు. అయితే, కొన్ని అభ్యంతరకర పదాలు ఉండటం వివాదానికి దారితీసింది. ఈ విషయంపై కేంద్ర ప్రభుత్వం దృష్టి సారించింది. గ్రోక్ వివాదంపై ఎక్స్ ప్రతినిధులతో కేంద్ర సమాచార, సాంకేతిక మంత్రిత్వ శాఖ అధికారులు సంప్రదింపులు జరుపుతున్నట్లు సమాచారం. ఇదిలా ఉండగా, ప్రముఖ బాలీవుడ్ దర్శకుడు వివేక్ అగ్నిహోత్రి పేరును గ్రోక్ సోషల్ మీడియాలో తప్పుడు వార్తలు సృష్టించే వ్యక్తుల జాబితాలో చేర్చింది. దీనిపై దర్శకుడు ఆగ్రహం వ్యక్తం చేయడంతో గ్రోక్ ఆయనకు క్షమాపణలు చెప్పింది. ఇకపై ఇలాంటి తప్పులు జరగకుండా చూసుకుంటామని, వాస్తవాల ఆధారంగానే సమాధానాలు అందిస్తామని హామీ ఇచ్చింది. మొత్తానికి గ్రోక్ తన కొత్త ఫోటో ఎడిటింగ్ ఫీచర్‌తో యూజర్లను ఆకట్టుకుంటుండగా, హిందీ తిట్ల వివాదం మాత్రం ఇంకా చర్చనీయాంశంగానే ఉంది. ఈ వివాదంపై ప్రభుత్వం చర్యలు తీసుకుంటుండటంతో, రానున్న రోజుల్లో గ్రోక్ ఎలాంటి మార్పులు చేసుకుంటుందో చూడాలి.

# క్రేజీ న్యూస్.. ఆ హీరోయిన్‌తో ఈ దర్శకుడు డేటింగ్ మొదలు పెట్టాడా..!



సెలబ్రిటీలకి సంబంధించి సోషల్ మీడియాలో నిత్యం కొన్ని వందల కొద్ది రూమర్స్ నెట్టింట హల్‌చల్ చేస్తూ ఉండడం మనం చూస్తూనే ఉన్నాం. తాజాగా కొత్త బంగారు లోకంతో టాలీవుడ్ కు పరిచయం అయిన శ్రీకాంత్ అడ్డాల డేటింగ్ వ్యవహారం గురించి చర్చ నడుస్తుంది. శ్రీకాంత్ అడ్డాల మొదట్లో పలు సినిమాలకి అసిస్టెంట్ డైరెక్టర్‌గా పని చేసి ఆ తర్వాత డైరెక్టర్‌గా మారారు. తన రెండో సినిమా సీతమ్మ వాకిట్లో సిరిమల్లె చెట్టుఅనే సినిమా చేసి టాక్ ఆఫ్ ది ఇండస్ట్రీ అయ్యారు శ్రీకాంత్ అడ్డాల. ఆ తర్వాత ముకుంద, బ్రహ్మోత్సవం, నారప్ప, పెద కాపు సినిమాలతో మంచి డైరెక్టర్‌గా పేరు తెచ్చుకున్నాడు. వివాదాలకి చాలా దూరంగా ఉండే ఈ డైరెక్టర్ గురించి కొద్ది రోజులుగా నెట్టింట ఆసక్తికర చర్చ నడుస్తుంది. శ్రీకాంత్‌కి తన సతీమణితో విభేదాలు రావడంతో ఓ కోలీవుడ్ క్రేజీ హీరోయిన్‌తో డేటింగ్ లో ఉన్నారని ప్రచారం జరుగుతోంది. వారిద్దరు చెన్నైలో కలిసి ఉంటున్నారనే టాక్ కూడా నడుస్తుంది. ఈ విషయంపై కోలీవుడ్ ప్రముఖ నటుడు, దర్శకుడు పార్థిబన్ తాజాగా క్లారిటీ ఇచ్చారు. కోలీవుడ్‌లో పార్తీబన్ పరిచయం చేసిన హీరోయిన్ బ్రిగిడా సాగాతోనే శ్రీకాంత్ అడ్డాల రిలేషన్‌లో ఉన్నట్టు వస్తున్న వార్తలపై స్పందిస్తూ.. 'బ్రిగిడాను నేనే సినిమా ఇండస్ట్రీకి పరిచయం చేశాను కాబట్టి చాలామంది నన్ను ఈ ప్రశ్న అడిగారు. వారిద్దరి మధ్య ఎలాంటి రిలేషన్ ఉందో నాకు తెలియదు. .

నవచిత్ర





## అంజలి సూపర్ స్టైలిష్ గ్లామర్ లుక్

తెలుగు అమ్మాయి అయిన అంజలి తమిళ సినిమా ఇండస్ట్రీలో స్టార్ హీరోయిన్‌గా దూసుకు పోతుంది. తెలుగులోనూ ఈమె పలు సినిమాల్లో నటించినప్పటికీ ఆశించిన స్థాయిలో స్టార్‌డం దక్కలేదు. తెలుగు సినిమాలతో పోల్చితే తమిళ్ సినిమాలతో అంజలికి ఎక్కువ గుర్తింపు లభించింది. ప్రస్తుతం తమిళ్‌లో పలు పెద్ద సినిమాల్లో నటిస్తున్న అంజలి సోషల్ మీడియా ద్వారా తన అందమైన ఫోటోలను షేర్ చేయడం ద్వారా అందరి దృష్టిని ఆకర్షించింది. సాధారణంగా అంజలి ఏ ఫోటోలు షేర్ చేసినా సోషల్ మీడియాలో వైరల్ అవుతూ ఉంటాయి. అలాంటిది స్టైలిష్ లుక్‌తో పాటు గ్లామర్ పిక్స్ షేర్ చేస్తే వైరల్ కాకుండా ఎలా ఉంటాయి. సింపుల్ ఔట్ ఫిట్‌లోనూ స్టైలిష్ లుక్‌తో మెరిపించే విధంగా అంజలి సర్‌ప్రైజ్ చేసింది. ఆకట్టుకునే బ్యూటీఫుల్ మేకోవర్‌తో పాటు, డీసెంట్ హెయిర్ స్టైల్‌తో, డిఫరెంట్ డిజైనర్ ఔట్ ఫిట్‌ను ధరించిన అంజలి షేర్ చేసిన ఈ ఫోటోల్లో డిఫరెంట్‌గా ఫోటోలకు ఫోజ్‌లు ఇచ్చింది. నడుము అందం చూపించడంతో చూపు తిప్పుకోనివ్వడం లేదు. కొందరు హీరోయిన్స్ స్కిన్ షో చేస్తే ఎబ్బెట్టుగా ఉంటుంది. కొందరు స్కిన్ షో చేస్తేనే వారి ఫోటోలను చూడగలం. కానీ అంజలి స్కిన్ షో చేయకుండానే తన అందంను చూపించి చూపు తిప్పుకోనివ్వడం లేదు. ఒకప్పుడు కాస్త బొద్దుగా అనిపించే అంజలి ఇప్పుడు సన్నగా నాజూకుగా తయారు అయింది. సినిమాల్లో కంటే ఇలా ఫోటో షూట్స్‌లో మరింత అందంగా కనిపిస్తుంది. అంజలి 1986 జూన్ 16న ఏపీలోని తూర్పు గోదావరి జిల్లా రాజోలులోని ఒక తెలుగు కుటుంబంలో జన్మించింది. అంజలికి ఒక సోదరితో పాటు ఇద్దరు సోదరులు ఉన్నారు. స్కూలింగ్‌ను రాజోలులో పూర్తి చేసిన అంజలి చెన్నైకి వెళ్లి మ్యాథ్స్‌లో డిగ్రీని పూర్తి చేసింది. కుటుంబ సభ్యుల మద్దతుతో అంజలి సినిమా ఇండస్ట్రీలో ఎంట్రీ ఇచ్చింది. తెలుగు సినిమాల్లో మొదట నటించిన పెద్దగా గుర్తింపు రాకపోవడంతో తమిళ సినిమా ఇండస్ట్రీలో ప్రయత్నాలు చేసింది. మోడలింగ్‌లోనూ రాణించిన అంజలి 2006 సంవత్సరంలో పోటో అనే సినిమాతో అరంగేట్రం చేసింది. ఆ తర్వాత 2007లో తమిజ్ అనే సినిమాలో నటించడం ద్వారా తమిళ నాట గుర్తింపు దక్కించుకుంది.

# 'అల్లు అర్జున్ - రామ్ చరణ్' రహస్యంగా?



చరణ్, బన్ని లాంటి పెద్ద స్టార్లు తమ ప్రాజెక్టుల గురించి అనవసరమైన లీకులు లేకుండా జాగ్రత్త పడుతున్నారు. ఇందులో భాగంగానే విదేశాల్లో కథాచర్చలు సాగిస్తున్నారని కూడా టాక్ వినిపిస్తోంది. ఐకాన్ స్టార్ అల్లు అర్జున్... మెగా పవర్ స్టార్ రామ్ చరణ్ అబుదబీ- దుబాయ్ వంటి డెస్టినేషన్ నగరాలకు రెగ్యులర్ గా విజిట్ చేయడం అభిమానుల్లో ఆసక్తిని రేకెత్తిస్తోంది. ఇంతకుము ందు సుకుమార్ తో తన ప్రాజెక్ట్ గురించి చర్చించేందుకు చరణ్ అరబ్ దేశంలో కనిపిం చడం గుసగుస లకు తావిచ్చింది. సుకుమార్ తో ఆర్.సి 17 చర్చల్లో భాగంగానే చరణ్ గల్ఫ్ కి వెళ్లారని కథనాలొచ్చా యి. రంగస్థలం తర్వాత చరణ్ - సుకుమార్ ఓ ప్రాజెక్ట్ కోసం సీరియస్ గా చర్చిస్తున్నారు. ఇది భారీ యాక్షన్ ఎంటర్ టైనర్ అని కూడా గుసగుసలు వినిపిస్తున్నాయి. ఇంతలోనే ఇప్పుడు ఐకాన్ స్టార్ అల్లు అర్జున్ దర్శకుడు అట్లీతో సమావేశంలో భాగంగా అబుదబీ వెళ్లారని టాక్ వినిపిస్తోంది. పుష్ప 2 తర్వాత అల్లు అర్జున్ తన ఫేవరెట్ డైరెక్టర్ త్రివిక్రమ్ తో కలిసి ఓ సినిమాకి ప్లాన్ చేసిన సంగతి తెలిసిందే. మార్చి 2025 నుంచి ఈ సినిమా చిత్రీకరణ కొనసాగుతుందని కూడా కథనాలొచ్చాయి. పుష్ప తర్వాత మరో పాన్ ఇండియా ప్రాజెక్ట్ ఈ జోడీ నుంచి రానుంది. అలాగే తమిళ దర్శకుడు అట్లీతో గల్ఫ్ దేశంలో చర్చలు జరుపుతున్నట్లు సమాచారం. అట్లీతో మూవీ కోసం బన్ని దాదాపు 170 కోట్ల పారితోషికం అందుకోబోతున్నాడని కూడా గుసగుస వినిపిస్తోంది. అయితే దీనిపై ఎలాంటి అధికారిక సమాచారం లేదు.చరణ్, బన్ని లాంటి పెద్ద స్టార్లు తమ ప్రాజెక్టుల గురించి అనవసరమైన లీకులు లేకుండా జాగ్రత్త పడుతున్నారు. ఇందులో భాగంగానే విదేశాల్లో కథాచర్చలు సాగిస్తున్నారని కూడా టాక్ వినిపిస్తోంది. హైదరాబాద్, ముంబై, చెన్నై లాంటి చోట్ల ఏదైనా ప్రాజెక్ట్ ని ఖరారు చేయాలంటే అది ముందస్తు లీకులతో ఇబ్బందికరంగా మారుతోంది. అభిమానులకు తప్పుడు సమాచారం అందుతోంది. అందుకే విదేశాల్లో కథా చర్చలు సాగిస్తున్నారని కూడా మీడియాలో కథనాలొస్తు న్నాయి. అబుదబీ స్వామినారాయణ్ ఆల యంలో..! తాజాగా అల్లు అర్జున్ అబుదబీలోని స్వామి నారాయణ్ ఆలయాన్ని సందర్శించిన ఫోటోలు, వీడియోలు వెబ్ లో వైరల్ అవుతున్నాయి. ఆలయ నిర్మాణాన్ని తిలకించిన అల్లు అర్జున్ కి స్థానిక హిందూ దేవాలయ విశిష్ఠతను ఆలయ ప్రతినిధులు వివరించారని తెలుస్తోంది. టాలీవుడ్ స్టార్లు ఆధ్యాత్మిక ప్రదేశాలను విజిట్ చేసేందుకు ఎప్పుడూ ఆసక్తిగా ఉంటారు. ముఖ్యంగా చరణ్, అల్లు అర్జున్ ఆధ్యాత్మిక ప్రదేశాలను కుటుంబ సమేతంగా విజిట్ చేస్తుండడం తెలిసినదే.

## బతికున్న భర్తను థంబ్‌నెయిల్‌తో చంపేశారు



టాలీవుడ్ నటి భార్గవి ఐడ్రీమ్ అనే యూట్యూబ్ ఛానల్‌పై తీవ్ర విమర్శలు గుప్పించింది. తప్పుడు థంబ్‌నెయిల్స్ పెట్టి బ్రతికున్న నా భర్తను చనిపోయినట్లు చిత్రీకరించడమే కాకుండా తప్పుడు వార్తలను ప్రచారం చేస్తున్నట్లు ఐడ్రీమ్‌తో పాటు ఇతర యూట్యూబ్ ఛానల్స్‌పై ఆగ్రహం వ్యక్తం చేసింది. ఈ సందర్భంగా ఒక వీడియోను విడుదల చేసింది. ఇటీవలే నేను ఐడ్రీమ్ అనే యూట్యూబ్ ఛానల్‌కు ఇంటర్వ్యూ ఇచ్చాను. యాంకర్ స్వప్న పిలిచిందని వెళ్లాను. ఈ ఇంటర్వ్యూ కూడా బాగా జరిగింది. అయితే ఈ ఇంటర్వ్యూలో మా ఆయన ఆర్మీ ఆఫీసర్, బోర్డర్‌లో అతడి జీవితం ఎలా ఉంటుంది అనే దానిపై కూడా స్పందించాను. అయితే నేను మాట్లాడిన మాటలన్ని తీసుకుని ఒక తప్పుడు థంబ్‌నెయిల్స్‌ను ఐడ్రీమ్ క్రియేట్ చేసి యూట్యూబ్‌లో వదిలింది. ఈ థంబ్‌నెయిల్‌లో నా భర్త చనిపోయినట్లు అర్థం వచ్చేలా రాయడమే కాకుండా నా ఫ్యామిలీ ఫొటోలను పెట్టారు. ఐడ్రీమ్‌తో పాటు మిగతా యూట్యూబ్ ఛానల్స్ ఇంటర్వ్యూ పేరుతో ప్రజలను తప్పుదారి పట్టించడమే కాకుండా ఒక ఆర్మీ అధికారితో పాటు అతడి భార్య గురించి తప్పుడు వార్తలను ప్రచారం చేస్తున్నారు. నేను ఒక్కటే అడగాలి అనుకుంటున్నాను. ఎందుకు ఇలా చేస్తున్నారు. ఇదే విషయం గురించి యాంకర్ స్వప్నని సంప్రదించగా.. రెండు సార్లు డీలిట్ చేసి మళ్లీ అప్‌లోడ్ చేశారు. ఈ విషయంలో నాకు ఐడ్రీమ్ నుంచి సమాధానమే కాకుండా క్షమాపణలు కూడా చెప్పాలంటూ భార్గవి చెప్పుకోచ్చింది. కాగా ఇందుకు సంబంధించిన ప్రస్తుతం వైరల్‌గా మారింది.

## బిగువుల ప్రదర్శన సరే వ్వాట్ నెక్ట్స్ రాశీ?



నేటి జనరేషన్ స్టార్స్ లో తెలివైన ఎంపికలతో కెరీర్ బండిని నడిపిస్తున్న భామగా రాశీ ఖన్నాకు గుర్తింపు ఉంది. టాలీవుడ్ లో యంగ్ హీరోల సరసన నటిస్తూనే, దర్శకద్వయం రాజ్ అండ్ డీకే ప్రాజెక్ట్ ఫర్జీలో నటించింది. నటనకు ఆస్కారం ఉన్న పాత్రలో ఈ బ్యూటీ పాన్ ఇండియాలో అభిమానులను ఫిదా చేసింది. ప్రస్తుతం బ్యాక్ టు బ్యాక్ హిందీ చిత్రాల్లో నటించేందుకు ప్రణాళికల్ని సిద్ధం చేసింది. ఆరణ్మనై 4 తో కమర్షియల్ విజయం అందుకుంది. యుద్ధానికి ముందు ఇలా.. ది సబర్మతి రిపోర్ట్, సర్దార్ లాంటి సినిమాలు తనకు నటిగా మంచి పేరు తెచ్చాయి. తెలుసు కదా! అనే తెలుగు చిత్రంలోను ఈ బ్యూటీ నటిస్తోంది. అటు బాలీవుడ్ లో ఇంకా టైటిల్ నిర్ణయించని ఎ క్రేజీ మూవీలో నటిస్తోంది. కెరీర్ మ్యాటర్ ఇలా ఉండగానే, రాశీ యూత్ లో తన ఫాలోయింగ్ ఎంతమాత్రం తగ్గకుండా జాగ్రత్త పడుతోంది. ప్రస్తుత కాంపిటీషన్ లో తనను తాను నిలబెట్టుకునేందుకు వరుస ఫోటోషూట్లతో ఫ్యాన్ డమ్ కి టచ్ లో ఉంది.రాశీ తాజాగా తన ఫిట్నెస్ గురూ కుల్ దీప్‌తో కలిసి జిమ్ లో శ్రమిస్తున్న కొన్ని ఫోటోలను షేర్ చేసింది. రాశీ పర్ఫెక్ట్ ఫిట్ టోన్డ్ బాడీని హైలైట్ చేస్తూ ఈ ఫోటోషూట్ గుబులు పుట్టిస్తోంది. బ్లాక్ అండ్ బ్లాక్ - ఆల్ బ్లాక్ ట్రాక్ లో ఉన్న ఈ ఫోటోగ్రాఫ్స్ ఇంటర్నెట్ లో తుఫాన్ సృష్టిస్తున్నాయి. రాశీ నడుము నెమ్మదిగా జీరో నుంచి మైనస్ సైజ్ కి తగ్గిపోవడం ఖాయమని ఈ హార్డ్ వర్క్ చెబుతోంది. కొంత కఠినమైన వ్యాయామ సెషన్స్ కి రాశీ ఖన్నా అటెండవుతోంది. నేను ఏడవకుండా ఆ సెషన్‌లో బయటపడ్డాను. సెల్ఫీలు తీసుకునేంత అందంగా అనిపించింది! అంటూ కొంటె ఫన్నీ ఈమోజీని రాశీ షేర్ చేసింది. రాశీని షేపప్ చేసేందుకు కోచ్ కుల్ దీప్ సేథి చాలా శ్రమిస్తున్నారనడానికి ఈ ఫోటోలే ప్రూఫ్.

# టాలీవుడ్‌లో తొలిసారి పోర్న్ అడిక్షన్‌పై సినిమా.. 'పూర్ణ చంద్రరావు' ఫస్ట్ లుక్ రిలీజ్




తెలుగు సినీ పరిశ్రమ ఎప్పుడూ వైవిధ్యమైన కథలకు పెట్టింది పేరు. అయితే, కొన్ని అంశాలను తెరపై చూపించాలంటే సాహసం తప్పనిసరి. అలాంటి ఓ ధైర్యమైన ప్రయోగంతో వస్తోంది 'పూర్ణ చంద్రరావు' చిత్రం. భారతీయ సినిమా చరిత్రలో తొలిసారిగా 'పోర్న్ అడిక్షన్' అనే సున్నితమైన అంశాన్ని ఎత్తిచూపుతూ ఈ సినిమా రూపొందుతోంది. తారక రామ దర్శకత్వంలో తెరకెక్కుతున్న ఈ చిత్రంలో విజయ్ రాజ్ కుమార్ హీరోగా నటిస్తున్నారు. గతంలో 'ఏం చేస్తునావ్' సినిమాతో గుర్తింపు తెచ్చుకున్న విజయ్, ఈ సినిమాకు కథను కూడా స్వయంగా రాశారు. తాజాగా ఈ సినిమా నుంచి ఫస్ట్ లుక్‌ని విడుదల చేశారు మేకర్స్.

ఈ ఫస్ట్ లుక్‌లో హీరో అర్ధనగ్నంగా సోఫాపై కూర్చొని ల్యాప్‌టాప్ చూస్తూ కనిపిస్తున్నాడు, వెనుక స్టీవ్ జాబ్స్ మరియు ఎలాన్ మస్క్ ఫోటోలు ఉన్నాయి. ఈ దృశ్యం టెక్నాలజీ, పోర్న్ అడిక్షన్, మరియు మానసిక స్థితుల మధ్య సంబంధాన్ని సూచిస్తూ లోతైన సందేశాన్ని అందిస్తోంది. సాధారణంగా మద్యం, డ్రగ్స్, సోషల్ మీడియా వ్యసనాలపై సినిమాలు వస్తుంటాయి, కానీ పోర్న్ అడిక్షన్‌ను ఫీచర్ ఫిల్మ్‌గా తీసుకురావడం ఇదే తొలిసారి. ఈ సినిమా ఎంటర్‌టైన్‌మెంట్‌తో పాటు ఆలోచనను రేకెత్తించే శైలిలో రూపొందుతోంది.దర్శకుడు తారక రామ గతంలో 'అనగనగా ఆస్ట్రేలియాలో' సినిమాతో కొత్త ప్రయోగం చేసిన సంగతి తెలిసిందే. ఇప్పుడు 'పూర్ణ చంద్రరావు'తో మరో బోల్డ్ కథనాన్ని ఎంచుకున్నారు. ఆసక్తికర విషయం ఏమిటంటే, హీరో విజయ్ రాజ్ కుమార్ తన వ్యక్తిగత అనుభవాల ఆధారంగా ఈ కథను రాసినట్లు సమాచారం. సహాన ఆర్ట్ క్రియేషన్స్ బ్యానర్‌పై మాధవి మంగపతి, యారీక్ స్టూడియోస్ సంయుక్తంగా ఈ చిత్రాన్ని నిర్మిస్తున్నాయి. ప్రస్తుతం ఈ సినిమా సోషల్ మీడియాలో హాట్ టాపిక్‌గా మారింది.

## ఎన్టీఆర్‌తో ప్రశాంత్ నీల్ హ్యాంగ్ అవుట్.. ఫొటో షేర్ చేసిన లిఖిత



టాలీవుడ్ అగ్ర కథానాయకుడు యంగ్ టైగర్ ఎన్టీఆర్, కేజీఎఫ్, సలార్ చిత్రాల దర్శకుడు ప్రశాంత్ నీల్ కాంబోలో ఒక సినిమా రాబోతున్న విషయం తెలిసిందే. #%NTRNeel% అంటూ రానున్న ఈ ప్రాజెక్టను మైత్రీ మూవీ మేకర్స్ బ్యానర్, ఎన్టీఆర్ ఆర్ట్స్ సంస్థలు సంయుక్తంగా నిర్మిస్తున్నాయి. ఎన్టీఆర్ 31వ ప్రాజెక్ట్ ఇది పట్టాలెక్కబోతుంది. ప్రస్తుతం ఈ ప్రాజెక్ట్ శరవేగంగా షూటింగ్ జరుపుకుంటున్న విషయం తెలిసిందే. ఇప్పటికే హైదరాబాద్‌లోని పలు లొకేషన్స్‌లో ప్రశాంత్ నీల్ కీలక సన్నివేశాలను చిత్రీకరించారు. అయితే తాజాగా ఈ మూవీ షూటింగ్ నుంచి ఎన్టీఆర్ %-% ప్రశాంత్ నీల్ విరామం తీసుకున్నట్లు తెలుస్తుంది.శనివారం సాయంత్రం ఎన్టీఆర్ %-% ప్రశాంత్ నీల్ హ్యాంగ్ అవుట్ అవుతూ కనిపించారు. దీనికి సంబంధించిన ఫొటోలను ప్రశాంత్ నీల్ సతీమణి లిఖిత ఇన్‌స్టా వేదికగా పంచుకుంది. వీరిద్దరిని చూస్తుంటే కేవలం భయం అనే ఒకే ఒక్క మాట గుర్తుకు వస్తుందంటూ లిఖిత రాసుకోచ్చింది. కాగా ఇందుకు సంబంధించిన ఫొటో వైరల్‌గా మారింది.

## బెట్టింగ్ యాప్ వ్యవహారంలో కీలక పరిణామం..!



బెట్టింగ్ యాప్స్ ప్రమోషన్స్ వ్యవహారం టాలీవుడ్‌ను కుదిపేస్తున్నది. ఇప్పటికే పలువురు నటీనటులపై కేసు నమోదైన విషయం తెలిసిందే. తాజాగా ఈ వ్యవహారంలో కీలక పరిణామం చోటు చేసుకున్నది. తాజాగా సీనియర్ నటుడు నందమూరి బాలకృష్ణ, ప్రభాస్, గోపీచంద్‌లపై కేసులు నమోదయ్యాయి. ఇమ్మాని రామారావు అనే వ్యక్తి ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేశారు. ముగ్గురు నటులు బెట్టింగ్ యాప్స్‌ని ప్రమోట్ చేసినట్లుగా ఆరోపించారు. ఓ టాక్ షోలో పాల్గొన్న సమయంలో అక్రమ బెట్టింగ్ యాప్స్ ప్రమోషన్ నిర్వహించినట్లు ఆయన ఆరోపించారు. టాక్‌లో బాలకృష్ణ హోస్ట్‌గా వ్యవహరించగా.. స్పెషల్ ఎపిసోడ్‌లో ప్రభాస్, గోపీచంద్ కనిపించారు.సదరు ప్లాట్‌ఫామ్ ద్వారా రూ.80లక్షలు కోల్పోయానని పోలీసులకు ఇచ్చిన ఫిర్యాదులో పేర్కొన్నాడు. ఫన్88 అనే బెట్టింగ్ యాప్‌కి బాలకృష్ణ, ప్రభాస్, గోపీచంద్ ప్రచారం చేశారని ఆయన ఆరోపించారు. ఆ హీరోలు ప్రమోటింగ్ చేయడంతోనే తాను ఆ బెట్టింగ్ యాప్‌లో డబ్బులు పెట్టి నష్టపోయినట్లు పేర్కొన్నారు. యాప్ యాక్సెన్‌ను నిలిపివేయాలని పోలీసులను కోరారు.

## హైదరాబాద్ బ్యాటర్ల ఊచకోత.. పది ఓవర్లలో ఎస్‌ఆర్‌హెచ్ విధ్వంసం ఎలా సాగిందంటే..



**న్యూఢిల్లీ-నవభూమి:** ఊహించినట్టుగానే సన్‌రైజర్స్ హైదరాబాద్ ఓపెనర్లు అద్భుత ఆరంభాన్ని అందించారు. గతేడాది మెరుపులను కొనసాగిస్తూ ఆకాశమే హద్దుగా చెలరేగారు. ముఖ్యంగా ట్రావిస్ హెడ్ (31 బంతుల్లో 67) రాజస్తాన్ బౌలర్లకు చుక్కలు చూపించాడు. మూడు సిక్స్‌లు, 9 ఫోర్లతో బౌండరీల వర్షం కురిపించాడు. మరో ఓపెనర్ అభిషేక్ శర్మ (11 బంతుల్లో 24) ఉన్నంతసేపు బౌండరీలతో అలరించాడు. తీక్షణ బౌలింగ్‌లో అభిషేక్ అవుటైనా హైదరాబాద్ పరుగుల ప్రవాహం ఆగలేదు.వచ్చిన బ్యాటర్లందరూ బంతిని కసితీరా బలంగా బాదడమే తమ లక్ష్యం అన్నట్టుగా ఆడుతున్నారు. ఉన్నంతసేపు అద్భుతమైన వినోదాన్ని పంచిన హెడ్‌ను దేశ్‌పాండే పెవిలియన్ చేర్చాడు. మరోవైపు ఇషాన్ కిషన్ (20 బంతుల్లో 36 బ్యాటింగ్) కూడా రెచ్చిపోతున్నాడు. అతడికి తెలుగు కుర్రాడు నితీష్ కుమార్ రెడ్డి తోడయ్యాడు. ప్రస్తుతం నితీష్ 8 బంతుల్లో 17 పరుగులతో ఆడుతున్నాడు. దీంతో హైదరాబాద్ 11 ఓవర్లలో రెండు వికెట్లు కోల్పోయి 150 పరుగులు చేసింది. ఇంకా అరవీర భయంకర హెన్రిచ్ క్లాసిన్ బ్యాటింగ్‌కు దిగబోతున్నాడు. ఈ నేపథ్యంలో హైదరాబాద్ స్కోరు 250 పరుగులు దాటేలా కనిపిస్తోంది.కాగా, రాజస్థాన్ రాయల్స్ టీమ్ టాస్ గెలిచి బౌలింగ్ ఎంచుకుంది. దీంతో సన్‌రైజర్స్ హైదరాబాద్ తొలుత బ్యాటింగ్‌కు దిగింది. సంజూ శాంసన్ పూర్తి ఆరోగ్యంగా లేకపోవడంతో రియాన్ పరాగ్ ఈ మ్యాచ్‌లో రాజస్థాన్ రాయల్స్ టీమ్‌కు నాయకత్వం వహిస్తున్నాడు. సంజూ శాంసన్ ఇంపాక్ట్ ప్లేయర్‌గా బరిలోకి దిగబోతున్నాడు.

## వీల్‌చైర్‌లో ఉన్నా లాక్కెళ్తారు..! ఎట్టకేలకు రిటైర్మెంట్ వార్తలపై స్పందించిన ధోనీ..!



**న్యూఢిల్లీ-నవభూమి:** టీమిండియా మాజీ కెప్టెన్ మహేంద్ర సింగ్ ధోనీ ఐపీఎల్‌కు సన్నద్ధమయ్యాడు. చెన్నైలో ఆదివారం ముంబయితో మ్యాచ్‌లో ఆడనున్నాడు. 2016, 2017 సీజన్లు మినహా మిగతా అన్ని సీజన్లలో చెన్నై తరఫున టీ20 క్రికెట్ ఆడుతున్నారు. అయితే, గత కొన్ని సంవత్సరాలుగా ధోనీ ఐపీఎల్‌కు రిటైర్మెంట్ పలుకనున్నాడనే వార్తలు వస్తున్నాయి. తాజాగా ఈ సీజనే ధోనీకి చివరి ఐపీఎల్ అంటూ వార్తలు వచ్చాయి. తాజాగా రిటైర్మెంట్ వార్తలపై ధోనీ స్పందించాడు. జియో హాట్‌స్టార్‌తో మాట్లాడుతూ రిటైర్మెంట్ వార్తలకు ఫుల్ స్టాప్ పెట్టాడు. తాను కోరుకున్నంత కాలం క్రికెట్ ఆడతానని స్పష్టం చేశాడు.'నేను కోరుకున్నంత కాలం సీఎస్‌కే తరఫున ఆడగలను. ఇది నా ఫ్రాంచైజీ. నేను వీల్‌చైర్‌లో ఉన్నా వారు (సీఎస్‌కే) నన్ను లాక్కెళ్తారు' అంటూ ధోనీ వ్యాఖ్యానించాడు. ముంబయితో మ్యాచ్‌కు ముందు ధోనీ.. హార్దిక్ పాండ్యా, కీరాన్ పోలార్డ్‌లను కలిశాడు. ఇందుకు సంబంధించిన వీడియోను సీఎస్‌కే వీడియోలను షేర్ చేసింది. ధోనీ ఇంటర్నేషనల్ క్రికెట్‌కు వీడ్కోలు పలికిన విషయం తెలిసిందే. ఐపీఎల్ నిబంధనల ప్రకారం.. ఐదు సంవత్సరాలు, అంతకంటే ఎక్కువ కాలం క్రికెట్ నుంచి రిటైర్ అయిన ఆటగాడిని అన్‌క్యాప్డ్ ప్లేయర్‌గా పరిగణిస్తారు. ఐపీఎల్ 2025 మెగా వేలానికి ముందు సీఎస్‌కే ధోనీని అన్‌క్యాప్డ్ ప్లేయర్‌గా తీసుకుంది. తనకు మరికొన్ని సంవత్సరాలు క్రికెట్ ఆడే సామర్థ్యం ఉందని ధోనీ తెలిపాడు. ముంబయితో మ్యాచ్‌కు ముందు భారీగా ప్రాక్టీస్ చేశాడు.

నవక్రీడ

## కోహ్లిని రింకూ సింగ్ అవమానించాడా.. వేదిక మీద షేక్ హ్యాండ్ ఇవ్వకపోవడంతో చర్చ



**న్యూఢిల్లీ-నవభూమి:** క్రికెట్ అభిమానులను ఉర్రూతలూగించేందుకు ఐపీఎల్ 2025 సిద్ధమైంది. శనివారం సాయంత్రం కోల్‌కతాలో ఐపీఎల్ ప్రారంభో త్సవ వేడుకలు అంగరంగ వైభవంగా జరిగాయి. బాలీవుడ్ బాద్ షా షారూక్ ఖాన్ ఈ వేడుకల్లో కీలక పాత్ర పోషించాడు. శ్రేయా ఘోషల్, దిశా పటానీ, కరణ్ ఔజ్లా తమ ప్రదర్శనలతో ఆకట్టుకున్నారు. అయితే ఈ వేడుకల్లో కోహ్లీ , రింకూ సింగ్ కు సంబంధించిన ఓ వీడియో చర్చనీయాంశంగా మారింది. ఆ వీడియో ఆధారంగా వీరిద్దరి మధ్య విబేధాలు ఉన్నట్టు ఊహాగానాలు మొదలయ్యాయి.ఐపీఎల్ ప్రారంభోత్సవంలో షారూక్ ఖాన్ తనదైన శైలిలో హోస్టింగ్ చేసి అందరినీ అలరించాడు. విరాట్ కోహ్లీని వేదిక పైకి ఆహ్వానించి అతడితో మాట్లాడాడు. ఆ తర్వాత ఇద్దరూ కలిసి ఓ పాటకు డ్యాన్స్ కూడా చేశారు. ఆ తర్వాత రింకూ సింగ్‌ను షారూక్ వేదిక పైకి ఆహ్వానించాడు. రింకూ సింగ్ వేదిక పైకి వచ్చి షారూక్‌తో కరచాలనం చేశాడు. పక్కనే ఉన్న కోహ్లీ చేయి అందించే ప్రయత్నం చేయగా రింకూ పట్టించుకోకుండా పక్కకు వెళ్లి నెల్చున్నాడు. ఆ వీడియో ప్రస్తుతం సోషల్ మీడియాలో వైరల్‌గా మారింది.


Printed,Published & Owned by SHAIK SHAHANAZ, Printed at SUPER PRINTERS Web offset Printers 2-3-655/C/118,Azad Nagar,Amberpet Circle 23,HYDERABAD -500113(T.S.), and Published D.No: 10-2-287/1/,Ground Floor,Santhinagar,A.C Guards,Masabtank,HYDERABAD - 500028,State TELANGANA (India). Editor: **SHAIK SHAHANAZ**, Phone: 9246213493,Email : navabhoomidaily@gmail.com,navabhoomi1@gmail.com **RNI No: TEL TEL: 82083**